మంగళవారం
22•08•2017


హైదరాబాద్
• వెల.5 రూ.

• సంపుటి 7 • సంచిక 76
• పేజీలు : 18 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

తెలంగాణ చారిత్రక విద్యావికాస కేంద్రం

రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు





మానవత్వం మూర్తీభవించిన అధికారి, పరోపకారి, ప్రజావికాస ఉద్యమాల సహకారి,
గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు, స్త్రీ జనోద్ధారకుడు, మతసామరస్యానికి మారుపేరు, శాంతిభద్రతల సంరక్షకుడు, సంఘసంస్కర్త

శ్రీ రాజ బహద్దూర్ కొత్వాల్ వేంకటరామారెడ్డి

149వ జయంతి వేడుకలు

22.08.2017 మంగళవారం సాయంత్రం 4 గంటలకు

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రాజ బహద్దుర్ వేంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీకి ప్రభుత్వం పది ఎకరాల స్థలాన్ని కేటాయించి, పది కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ స్థలంలో నిర్మించే రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్‌కు

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన

రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్ విశేషాలు

- బాలుర వసతిగృహం
- బాలికల వసతి గృహం
- కెరీర్ కోచింగ్ సెంటర్
- కన్వెన్షన్ హాల్స్
- ఇండోర్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్
- వ్యవసాయ క్షేత్రం

100 REDDY HOSTEL 1917-2017

నిజాం కాలంలో తెలంగాణ పునర్వికాసానికి కృషి చేసిన చరిత్రాత్మక కేంద్రం రెడ్డి హాస్టల్. రాజ బహద్దుర్ వేంకట రామారెడ్డి గారి పూనికతో 1917లో ఏర్పాటైన ఈ హాస్టల్ గ్రంథాలయోద్యమానికి, పత్రికా వికాసానికి, విద్యాభివృద్ధికి కేంద్రమైంది. ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకుడు, గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాప రెడ్డి ఈ హాస్టల్ తొలి వార్డెన్. హైదరాబాద్‌లో చదువుకోవడానికి వచ్చిన రెడ్డి విద్యార్థులతో పాటు, ఇతర కులాల విద్యార్థులను కన్న తల్లిలాగా ఆదరించింది, అక్కున చేర్చుకుంది. అనేక ఉద్యమాలకు ఊపిరులూదింది. 1969 తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైంది. రావి నారాయణ రెడ్డి, పి.వి.నరసింహారావు మొదలుకొని అనేకమంది ప్రముఖులు ఈ హాస్టల్ నీడలోనే చదువుకుని ఎదిగారు. రెడ్డి హాస్టల్ చారిత్రిక స్ఫూర్తిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు రెడ్డి హాస్టల్ విస్తరణ కోసం బుద్వేల్‌లో పది ఎకరాల స్థలం కేటాయించి, భవన సముదాయ నిర్మాణానికి పది కోట్ల రూపాయలు మంజూరు చేశారు.

జారీచేసినవారు: కమిషనర్ సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

నేడు రెడ్డి హాస్టల్‌కు సీఎం కేసీఆర్ శంకుస్థాపన



రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌లో నిర్వహించనున్న బహిరంగసభ వేదిక వద్ద ఏర్పాట్లు

బుద్వేల్ సభకు భారీగా ఏర్పాట్లు చేసిన నేతలు

రాజేంద్రనగర్: రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో మంగళవారం రాజా బహద్దూర్ వేంకటరామిరెడ్డి ఎడ్యుకేషనల్ క్యాంపస్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బుద్వేల్‌లోని సభా ప్రాంగణాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్, జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు సోమవారం పరిశీలించారు. సీఎం ఆవిష్కరించే శిలాఫలక దిమ్మెలతోపాటు సభాప్రాంగణంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఘనంగా ఉండేలా దగ్గరుండి పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీసులు, అధికారులతో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడారు. మంగళవారం సాయంత్రం నాలుగుగంటలకు సీఎం కేసీఆర్ మొదటగా శంకుస్థాపన చేసి, అనంతరం సమావేశ ప్రాంగణానికి చేరుకుంటారని అధికారులు తెలిపారు. ఇప్పటికే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద టీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగత తోరణాలను ఏర్పాటు చేశాయి.



బహిరంగసభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు. (ఇన్‌సెట్) సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

జలాశయాలు కళకళ



ఎగువ నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో నీటితో కళ కళ లాడుతున్న నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ఎస్సారెస్పీకి 89,531 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, కడెం ప్రాజెక్టులకు వరద నీరు

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: వరుణుడు కరుణించడంతో గోదారమ్మ ఉధృతంగా పరుగులు పెడుతున్నది. మంజీర పరీవాహక ప్రాంతంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్ర నుంచి నీరువస్తుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. శ్రీరాంసాగర్, కడెం, నిజాంసాగర్, కల్యాణి, పోచారం, సింగితం, ఎల్లంపల్లి, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఈ సంవత్సరం ఆలస్యంగానైనా ఎస్సారెస్పీకి మాత్రం వరద తాకిడి భారీగానే ఉన్నది. సోమవారం రాత్రి వరకు 89,531 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు ఐదు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 9.88 టీఎంసీల నీటి నిల్వతో ఉన్న జలాశయం సోమవారం రాత్రి వరకు 20.218 టీఎంసీలకు చేరుకున్నది. 24 గంటల వ్యవధిలోనే 10.338 టీఎంసీల వరద వచ్చి చేరింది. అయితే శ్రీరాంసాగర్‌కు వస్తున్న వరదలో మంజీరా నుంచి వచ్చి చేరుతున్నదే ఎక్కువ భాగంగా ఉండటం విశేషం. మంజీర నదికి అనుబంధంగా ఉన్న నల్లవాగు నుంచే లక్షా యాభై వేల క్యూసెక్కులు వచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఎగువన మహారాష్ట్రలోని బాలెగావ్ నుంచి 50వేల క్యూసెక్కులు మాత్రమే వచ్చినట్టు తెలిపారు. మరో ప్రాజెక్ట్ అయిన విష్ణుపురి నిండడంతో సోమవారం సాయంత్రం మరో 26,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నీరు బుధవారం నాటికి ఎస్సారెస్పీకి చేరుకోనున్నదని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. ఈక్రమంలో మరింత ఇన్‌ఫ్లో పెరిగే అవకాశముందని ప్రాజెక్టు అధికారులు చెప్తున్నారు. గత ఏడాది ఇదే రోజున 1075.10 అడుగులతో 39.953 టీఎంసీల నీటినిల్వ ఉందంటున్నారు. నిజాంసాగర్ జలాశయానికి ఇన్‌ఫ్లో మొదలైంది. సోమవారం సాయంత్రానికి 2,389 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. పూర్తి స్థాయి మట్టం 1,405 అడుగులకు గాను 1,383 అడుగులకు చేరింది. 17.802 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను 1.941 టీఎంసీల నిల్వ ఉన్నది. సింగితం రిజర్వాయర్ నిండుకుండలా తొణికిసలాడుతున్నది. కల్యాణి ప్రాజెక్టు 409.50 మీటర్ల లెవల్‌కు గాను 408.5 మీటర్లకు చేరింది. ఎగువ నుంచి 441 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌లోకి 441 క్యూసెక్కులను ఔట్‌ఫ్లో రూపంలో వదులుతున్నారు. పోచారం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 1.077 టీఎంసీలు కాగా 1.015 టీఎంసీలకు నిల్వకు చేరుకున్నది. నిర్మల్ జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లు కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగులకు వరదనీటి ప్రవాహం మొదలైంది. స్వర్ణ పూర్తి నీటిమట్టం 1184

గలగలా పారుతున్న గోదావరి

అడుగులు కాగా 1179 అడుగులకు నీటి మట్టం చేరింది. ప్రస్తుతం ఐదు వేల క్యూసెక్కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. కడెం ప్రాజెక్టు పూర్తి మట్టం 700 అడుగులు (7.603 టీఎంసీలు) కాగా 697.900 (7.064టీఎంసీలు) అడుగులకు చేరింది. కడెం ప్రాజెక్టుకు 2,496 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నది. ఎడమకాలువ ద్వారా 637క్యూసెక్కులు, కుడికాలువ ద్వారా 25క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సదర్‌మాట్ వద్ద 7.9 అడుగులకు నీటిమట్టం చేరగా ప్రధాన కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడ్డెన్నవాగు పూర్తి మట్టం 385.5 అడుగులు కాగా 356 అడుగుల నీరుంది. పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లిలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ పెరుగుతున్నది. జలాశయం నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి 11.6206 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 6110 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 660 క్యూసెక్కులుగా నమోదవుతున్నది.

24, 25 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

రాబోయే మూడు రోజులు చిరుజల్లులు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 24, 25 తేదీల్లో తెలంగాణ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం తగ్గడంతో ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొంది. రాబోయే మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గడిచిన 24 గంటల్లో సారంగాపూర్, బాన్సువాడ, లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, తాడ్వాయిల్లో రెండు సెంటీ మీటర్లు, గాంధారి, బోథ్, రామాయంపేట, ఆదిలాబాద్, మెదక్, పినపాక, వెంకటాపురం, గంభీరావ్‌పేట, బిక్నూర్, బిర్కూర్, కొత్తగూడెంలలో ఒక సెంటీ మీటరు చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.



1,383 అడుగులకు చేరిన కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ జలాశయ నీటిమట్టం



నిర్మల్ జిల్లా సదర్‌మాట్ ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసిన అధికారులు



నిండుకుండలా మారిన నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు



నిర్మల్ జిల్లా స్వర్ణ ప్రాజెక్టులో 1179 అడుగులకు చేరిన నీటి మట్టం

ముహూర్తం

సూర్యోదయం: 6.04 గంటలకు

సూర్యాస్తమయం: 6.33 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, పాడ్యమి రాత్రి 10.18 వరకు. తదుపరి విదియ. నక్షత్రం: మఖ మధ్యాహ్నం 2.44 వరకు తదుపరి పుబ్బ. అమృతఘడియలు: మధ్యాహ్నం 12.27 నుంచి మధ్యాహ్నం 2.03 వరకు. రాహుకాలం: మధ్యాహ్నం 3.26 నుంచి సాయంత్రం 5.00 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి ఉదయం 9.24 వరకు తిరిగి మధ్యాహ్నం 2.24 నుంచి 3.14 వరకు, వర్జ్యం: రాత్రి 10.31 నుంచి 12.07 వరకు. తిరిగి తె. 3.18 నుంచి తె. 4.54 వరకు.

లోకం పోకడ





గంజాయి ముఠా సభ్యులను మీడియా ముందు ప్రవేశపెట్టి.. వివరాలు వెల్లడిస్తున్న రైల్వేస్ ఇన్‌చార్జి ఎస్పీ రాజేంద్రప్రసాద్

గంజాయి ముఠా అరెస్టు

రైలులో 120 కిలోల గంజాయి స్వాధీనం.. రైల్వేస్ ఇన్‌చార్జి ఎస్పీ రాజేంద్రప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లో 120 కిలోల ఎండు గంజాయిని ముంబై చేరవేసేందుకు ప్రయత్నించిన ముగ్గురిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వేస్ ఇన్‌చార్జి ఎస్పీ రాజేంద్రప్రసాద్ కేసు వివరాలను మీడియాకు తెలియజేశారు. 'శనివారం రాత్రి 7.00గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒడిశాలోని కోర్ధా జిల్లా బాల్గా ప్రాంతానికి చెందిన నిందితులు బాసుదేవ్ జానీ, సంజయ్‌కుమార్ జానీ, సామిల్‌పూర్ జిల్లాకు చెందిన చంచన్ తమ లగేజీలో పొడి గంజాయిని పెట్టి తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 120 కిలోల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.18 లక్షల వరకు ఉంటుంది. నిందితులు కేవలం సరఫరాదారులు మాత్రమేనని, అసలు వ్యక్తులు వేరే ఉన్నారని విచారణలో గుర్తించాం' అని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఒడిశా, ముంబైల మధ్య సమాచారాన్ని పంపించుకునేందుకు ముఠా సభ్యులు వాట్సప్‌ను ఉపయోగిస్తున్నారని, గంజాయి సరఫరా చేస్తున్న సమయంలో వాసన రాకుండా నాఫ్తలిన్ బిల్లల పొడిని కలిపి రవాణా చేస్తున్నారని చెప్పారు. రైల్వేస్, రోడ్డు భద్రత డీజీపీ టీ కృష్ణప్రసాద్ ఆదేశాలతో మొత్తం పది ప్రత్యేక బృందాలతో నిత్యం రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం రూ.నాలుగు కోట్ల 80 లక్షల విలువచేసే 3,200 కిలోల గంజాయిని పట్టుకోగా.. కేవలం ఈ నెల రోజుల్లోనే రెండు వేల కిలోలకుపైగా పట్టుబడిందని చెప్పారు. ఇప్పటి వరకు 70 మందిని అరెస్టుచేసి కేసులు నమోదు చేశామన్నారు. ముఖ్యంగా ముంబై, పుణెలకు ఎక్కువగా గంజాయి సరఫరా చేస్తున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. గంజాయి రవాణాకు అడ్డుకట్టవేస్తున్న పోలీసు అధికారులకు రైల్వేస్, రోడ్డు భద్రత డీజీపీ టీ కృష్ణప్రసాద్ ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో రైల్వేపోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్ చంద్రయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై డీ రమేశ్, ఆర్‌ఎస్సై వీరలింగం పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నాలుగు రోజులపాటు 15 జిల్లాల్లో సమావేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై నాలుగు రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. ప్రాజెక్టువల్ల పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ)పై కాలుష్య నియంత్రణ మండలి సమావేశాలను ఏర్పాటు చేస్తున్నది. మంగళవారం నాలుగు జిల్లాల్లో ప్రారంభమయ్యే ప్రజాభిప్రాయ సేకరణ శనివారంతో ముగియనుంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లు సమావేశాలను ఏర్పాటుచేసి అభిప్రాయాలను సేకరించి, వాటిని నమోదు చేయనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిగే ప్రదేశాల వివరాలు ఇలా ఉన్నాయి..

తేదీ	ప్రజాభిప్రాయ సేకరణ జరిగే ప్రదేశం
22.8.2017 ఉదయం 11 గంటలు (మంగళవారం)	1. రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, ఖలీల్‌వాడి, నిజామాబాద్ పట్టణం 2. రాజశ్రీ గార్డెన్స్, రేకుర్తి గ్రామం, కరీంనగర్ మండలం 3. సోమరాధాకృష్ణ ఫంక్షన్‌హాల్, రాయగిరి గ్రామం, భువనగిరి మండలం, యాదాద్రి జిల్లా 4. శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్, తుర్కపల్లి గ్రామం, శామీర్‌పేట మండలం, మేడ్చల్ జిల్లా
23.8.2017 ఉదయం 11 గంటలు (బుధవారం)	1. రెడ్డి ఫంక్షన్ హాల్, మంథని రోడ్డు, రాఘవపూర్ గ్రామం, పెద్దపల్లి మండలం 2. మా ఫంక్షన్ హాల్, దుర్గమ్మ గుడి దగ్గర, నారాయణఖేడ్, సంగారెడ్డి జిల్లా 3. లక్ష్మీదేవి గార్డెన్స్, నిజాంసాగర్ రోడ్డు, దేవునిపల్లి గ్రామం, కామారెడ్డి మండలం 4. రాజరాజేశ్వరీ కల్యాణ మండపం, చిట్యాల, నల్లగొండ జిల్లా
24.8.2017 ఉదయం 11 గంటలు (గురువారం)	1. నరేందర్‌రెడ్డి గార్డెన్స్, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా 2. శ్రీసాయి బాలాజీ గార్డెన్స్, చేగుంట ఎక్స్‌రోడ్డు, మెదక్ జిల్లా 3. వైఎస్సార్ ఫంక్షన్ హాల్, నిర్మల్ పట్టణం
26.8.2017 ఉదయం 11గంటలు (శనివారం)	1. ఏఎస్సార్ గార్డెన్స్, కుందూర్‌పల్లి, భూపాలపల్లి మండలం, జయశంకర్ జిల్లా 2. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, నిర్మల గ్రామం, గంభీరావ్‌పేట, రాజన్న సిరిసిల్ల జిల్లా 3. తహసీల్దార్ కార్యాలయం, జైపూర్ గ్రామం, మండలం, మంచిర్యాల జిల్లా 4. వయోలా గార్డెన్స్, సిద్దిపేట పట్టణం

డబుల్ బెడ్రూం ఇండ్లకు రూ.558 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.558.50 కోట్లు మంజూరుచేసింది. సోమవారం గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి పీఎంఏవై కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులను డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి వినియోగించాలని అందులో పేర్కొన్నారు.

మంగళవారం
22•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

హైదరాబాద్‌లోనే

పెరిగా.. ఎదిగా.. ఒదిగా!

తెలంగాణ నేల అంటే ఎంతో ఇష్టం... ఈ రాజధాని ఒక మినీభారత్

అభివృద్ధి, స్వయంపాలన కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

- తెలుగుభాష అభివృద్ధికి రెండు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలి
- రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరస్పరం సహకరించుకోవాలి
- మాండలిక భాషలో సీఎం కేసీఆర్ ప్రసంగం నాకెంతో ఇష్టం
- తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం శాయశక్తులా పాటుపడుతా
- కేసీఆర్ ప్రసంగం, వేదపండితుల సాహిత్యంతో షడ్రుచులతో భోజనం చేసినట్టుగా ఉంది
- రాజ్‌భవన్ పౌరసన్మానంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఉపన్యాసాన్ని పండించడంలో అద్భుతమైన వక్త వెంకయ్యనాయుడు
- భారతదేశం గర్వించదగ్గ తెలుగుబిడ్డ ఆయన: సీఎం కేసీఆర్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన గొప్ప నేల తెలంగాణ. నేను రాజకీయంగా పెరిగింది, ఎదిగింది, ఒదిగింది...హైదరాబాద్‌లోనే. ఉపరాష్ట్రపతిగా ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ తెలుగురాష్ట్రాల అభివృద్ధి కోసం కృషిచేస్తా. తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడింది ఎవరిపైనా కక్షతో కాదు. అభివృద్ధి, స్వయంపాలన కోసమే'అని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భారతదేశం గర్వించదగ్గ తెలుగుబిడ్డ అని రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కొనియాడారు. రసజ్ఞతతో ప్రసంగించే గొప్ప వక్తని ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఘనంగా పౌరసన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, తెలంగాణతో తనకున్న విడదీయలేని బంధాన్ని నెమరువేసుకున్నారు. 'తెలంగాణ నేల అంటే ఎంతో ఇష్టం. తెలంగాణలోని ప్రతిగ్రామంతో నాకు అనుబంధం ఉన్నది. ఢిల్లీ స్థాయికి వెళ్లానంటే తెలంగాణలో రాజకీయంగా బలపడటమే కారణం. రాజకీయంగా ఎదిగిన హైదరాబాద్ నుంచే అధికారిక పర్యటన ప్రారంభించాలనుకున్నా. ఇదే విషయాన్ని

› మిగతా 4వ పేజీలో


తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు తిలకం దిద్ది పౌరసన్మాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ కూడా ఉన్నారు.

- నవంబర్ చివర్లో 30 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ప్రారంభం
- మొదటిదశ పూర్తయ్యాక మెట్రో రెండో దశ నిర్మాణానికి శ్రీకారం
- మూడు వేల కోట్లతో రోడ్లు, ఫ్లై ఓవర్లు, జంక్షన్ల అభివృద్ధి
- డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు 11వేల కోట్లతో ప్రతిపాదనలు
- రెండు వేల కోట్లతో రెండు చోట్ల స్కైవేల నిర్మాణాలు
- ఉప్పల్ నుంచి నారపల్లికి వెయ్యి కోట్లతో ఫ్లై ఓవర్
- ఛే నంబరు నుంచి రామంతపూర్‌కు 250కోట్లతో మరోటి

కోర్టు కేసులు వేశామని నిస్సిగ్గుగా చెప్పిన కాంగ్రెసోళ్లు

- 2019లో కేసీఆర్‌కే ప్రజలు పట్టం కడుతారని వారికీ తెలుసు


హైదరాబాద్ బాలానగర్‌లో భారీ ఫ్లైఓవర్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం సభలో ప్రసంగిస్తున్న ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్

మాది అభివృద్ధి బాట

- విశ్వనగరమే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- మౌలిక వసతుల కల్పనలో ఇది ఆరంభమే
- సీఎం కేసీఆర్ కార్యదక్షతతో నగరాభివృద్ధికి కృషిచేస్తాం
- బాలానగర్ ఫ్లై ఓవర్ శంకుస్థాపనలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వానిది అభివృద్ధి బాట అని పట్టణాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారక రామారావు చెప్పారు. ఇప్పటిదాకా ప్రభుత్వంచేసిన కృషితో సంతృప్తి చెందడం లేదని, ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) రూ.387కోట్లతో ఆరు లేన్లతో నిర్మించతలపెట్టిన బాలానగర్ భారీ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు సోమవారం మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ, రాబోయే ఏడెనిమిదేండ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కేవలం రోడ్లు, ఫ్లై ఓవర్లు, జంక్షన్ల అభివృద్ధికి రూ.3వేల కోట్లతో పనులు చేపడుతున్నామని చెప్పారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థకోసం 11వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. రూ.2వేల కోట్లతో శివారు మున్సిపాలిటీల్లో ఇంటింటికీ నీళ్లు అందించే ప్రయత్నం చేశామని చెప్పారు. కచ్చితంగా మెట్రో రెండోదశ, హైదరాబాద్ నగరంలో స్కైవేలకు సీఎం కేసీఆర్ సారథ్యంలోనే శ్రీకారం చుడుతామని ప్రకటించారు. ఈ ప్రభుత్వంలో పేదలకు అందుతున్న ఫలాలు ఆరంభం మాత్రమేనని, సీఎం కేసీఆర్ మనసులో చాలా ఆలోచనలున్నాయని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ కార్యదక్షతతో హైదరాబాద్ అభివృద్ధికి అన్ని విధాలా కృషిచేస్తామని అన్నారు.

నవంబర్ చివరికల్లా 30 కిలోమీటర్ల మెట్రో రైల్

నవంబర్ చివర్లో నాగోల్ నుంచి మియాపూర్ వరకు 30 కిలోమీటర్ల మేర మెట్రో రైల్‌ను ప్రారంభిస్తామని కేటీఆర్ వెల్లడించారు. వచ్చే సంవత్సరం మిగిలిన దూరాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తదనంతరం మెట్రో రెండో దశను చేపడుతామని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగరంలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందని కేటీఆర్ చెప్పారు. 24 గంటల వ్యవధిలో 2 సెంటీమీటర్ల వర్షం పడితే నీరు తీసుకునిపోయే వ్యవస్థ లేదన్నారు. రోడ్ల విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో నాణ్యమైన రోడ్లను ఏర్పాటుచేస్తామని అన్నారు. హైదరాబాద్‌లో నాణ్యమైన జీవనాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రూ.2వేల కోట్లతో ప్యారడైజ్ నుంచి కొంపల్లివరకు, జేబీఎస్‌నుంచి తూంకుంటవరకు

› మిగతా 5వ పేజీలో

సింగరేణిలో

ఎన్నికల నగారా

- అక్టోబర్ 5న ఎన్నికలు.. అదే రోజు ఓట్ల లెక్కింపు
- నామినేషన్ల దాఖలుకు సెప్టెంబర్ 16 ఆఖరు తేదీ
- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికకు నగారా మోగింది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డాక్టర్ కేకేహెచ్‌ఎం శ్యాంసుందర్ విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 5న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో అన్ని కార్మిక సంఘాలతో కలిపి నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ ఈ షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం 1.8.2017 నాటికి ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులను తాత్కాలిక ఓటర్లుగా పరిగణిస్తామని చెప్పారు. అక్టోబర్ 5 నాటికి ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులే ఓటు వేయడానికి అర్హులని వివరించారు. కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో రీజనల్ లేబర్ కమిషనర్ ఎస్ రామన్, సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్,పా) జే పవిత్రన్, జీఎం(పర్సనల్, ఐఆర్, పీఎం,ఆర్‌సీ) ఏ ఆనందరావు, ఎస్‌వోటు డైరెక్టర్ (పీఏ అండ్ డబ్ల్యూ) మురళీసాగర్ కుమార్, డిప్యూటీ జీఎం ఎన్ అనిల్‌కుమార్, కవితానాయుడు, 16 కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇదీ షెడ్యూల్

- ఓటరు జాబితా ప్రకటన : 30.8.2017
- అభ్యంతరాలకు గడువు : 6.9.2017 (సాయంత్రం 5 గంటలు)
- అభ్యంతరాలపై రిటర్నింగ్ అధికారి నిర్ణయం: 9.9.2017 (సాయంత్రం 5 గంటలు)
- తుది ఓటరు జాబితా ప్రకటన: 13.9.2017
- నామినేషన్ల దాఖలు ప్రారంభం: 14.9.2017 (ఉదయం 10 గంటల నుంచి)
- నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ: 16.9.2017 (సాయంత్రం 5 గంటల వరకు)
- నామినేషన్ల ఉపసంహరణ : 19.9.2017 (మధ్యాహ్నం 2 గంటల వరకు)
- నామినేషన్ల పరిశీలన : 20.9.2017 (ఉ.10 గంటల నుంచి 1.00 గంటల వరకు)
- గుర్తుల కేటాయింపు : 20.9.2017 (మ. 2 గంటల నుంచి సా. 5 గం.వరకు)
- పోలింగ్ తేదీ : 5.10.2017 (ఉ. 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు)
- ఓట్ల లెక్కింపు : 5.10.2017 (సా. 7 గంటల నుంచి)

డిపార్ట్‌మెంటల్ పరీక్ష తేదీలో సవరణ

సెప్టెంబర్ 15న నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిపార్ట్‌మెంటల్ పరీక్ష తేదీల్లో స్వల్ప సవరణ చేసినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 10వ తేదీన జరుగాల్సిన పరీక్ష సెప్టెంబర్ 15వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నది. 10న గురుకులాల పరీక్ష ఉన్నందున ఈ మార్పు చేసినట్లు వెల్లడించింది. ఈ ఒక్క తేదీ మినహా మిగతా పరీక్షల టైంటేబుల్‌లో మార్పు ఉండదని స్పష్టంచేసింది.




సోమవారం చెన్నైలో అన్నాడీఎంకే రెండు వర్గాలు విలీనమైనట్టు ప్రకటించి చేతులు కలిపిన ముఖ్యమంత్రి పళని స్వామి, పార్టీ నేత పన్నీర్ సెల్వం

పళని, పన్నీర్ ఒక్కటయ్యారు

- అన్నాడీఎంకే ప్రత్యర్థి వర్గాల విలీనం
- ఉపముఖ్యమంత్రిగా పన్నీర్‌సెల్వం ఆర్థికశాఖ కేటాయింపు
- అంతా 'అమ్మ' బిడ్డలమన్న సీఎం పళని

త్వరలో శశికళపై వేటు!

తమిళనాడులో పాలక అన్నాడీఎంకే ప్రత్యర్థి వర్గాలు ఒక్కటయ్యాయి. దీంతో ఆరునెలల రాజకీయ అనిశ్చితికి తెరపడింది. ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం చేతులు కలిపారు. గతంలో ఆపద్ధర్మంగా సీఎం పదవి చేపట్టిన పన్నీర్ ఇప్పుడు విలీనం ఒప్పందంలో భాగంగా డిప్యూటీ సీఎం అవతారం ఎత్తారు. మేమంతా 'అమ్మ' బిడ్డలం.. అన్నదమ్ములం అంటూ సీఎం పళని ఐక్యతారాగం ఆలపించారు. మరోవైపు అక్రమాస్తుల కేసుతో జైలుపాలైన శశికళను పార్టీ అధినేత్రి పదవి నుంచి తప్పించేందుకు రంగం సిద్ధమైంది.

› వివరాలు 8వ పేజీలో

ఎఫ్‌ఐఆర్‌ల డిజిటైజేషన్‌లో

తెలంగాణ నంబర్ 1

సీసీటీఎన్‌ఎస్ ప్రగతి నివేదికలో 93.1% మార్కులు

రాష్ట్రానికి మరో ఘనత

న్యూఢిల్లీ/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఎన్నో అంశాల్లో ముందున్న తెలంగాణ రాష్ట్రం మరో ఘనత సాధించింది. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్(సీసీటీఎన్‌ఎస్)లో భాగంగా అన్ని పోలీసు స్టేషన్లను డిజిటల్ పరిజ్ఞానం పరిధిలోకి తెచ్చి ఎఫ్‌ఐఆర్‌ల మొదలు నేర సమాచారాన్నంతా కంప్యూటరీకరించడంలో మిగతా రాష్ట్రాలకంటే ముందు నిలిచింది. ఈ విషయంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సగటు మార్కుల శాతం 67.8 కాగా తెలంగాణ 93.1శాతం మార్కులు సాధించింది. ఆరు నెలలకు ఒకసారి అన్ని రాష్ట్రాల పోలీసు వ్యవస్థలపై 'ప్రగతి' పేరుతో నిర్వహించే సమీక్షా సమావేశం ఢిల్లీలో సోమవారం జరిగింది. పోలీసు వ్యవస్థతో పాటు కోర్టులు, జైళ్ళు, జువైనల్ హోమ్‌లు, నేరాల విచారణ, వేలిముద్రల విభాగం, ఫోరెన్సిక్ విభాగం తదితరాలన్నింటినీ సీసీటీఎన్‌ఎస్ వ్యవస్థ కిందికి తీసుకొచ్చే 'డిజిటల్ పోలీస్ పోర్టల్'ను కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రిత్వశాఖ ఈ నివేదిక ద్వారా సీసీటీఎన్‌ఎస్ అమలులో రాష్ట్రాల ప్రగతిపై నివేదిక విడుదల చేసింది. ఈ సంవత్సరం జూన్ 30వ తేదీ వరకు అందిన సమాచారం ప్రకారం తెలంగాణ పలు అంశాల్లో 100% ఫలితాలను సాధించి తొలి స్థానం దక్కించుకుంది. సీసీటీఎన్‌ఎస్ వ్యవస్థతో మొత్తం 841 పోలీసు స్టేషన్లను అనుసంధానించడంతో పాటు సమగ్ర దర్యాప్తు ఫారం (ఐఐఎఫ్-పది రకాలు)లను కంప్యూటరీకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం, తొలి ఐదు రకాల ఐఐఎఫ్‌లను 'కోర్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్'లో పొందుపర్చడం, పాత నేరాల వివరాలను సైతం

› మిగతా 5వ పేజీలో



సోమవారం ఢిల్లీలో సీసీటీఎన్‌ఎస్ వ్యవస్థను పరిశీలిస్తున్న కేంద్రహోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సహాయ మంత్రి కిరణ్ రిజిజు తదితరులు

అతిత్వరలో వరంగల్‌కు సీఎం కేసీఆర్!

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- ప్రజాప్రతినిధులతో సమీక్షలో మంత్రి కేటీఆర్

5

రాయ్‌పూర్ దవాఖానలో

ముగ్గురు శిశువుల మృతి

మద్యం మత్తులో 3గంటలు ఆక్సిజన్ సరఫరాను నిలిపేసిన ఉద్యోగి అరెస్ట్

› వివరాలు 8వ పేజీలో



సోమవారం బేగంపేట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ నరసింహన్ ఉన్నారు.



రాజ్‌భవన్‌లో జరిగిన పౌర సన్మాన సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, కేంద్ర మంత్రి దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు, సీఎస్ ఎస్పీసింగ్ ఉన్నారు.



రాజ్‌భవన్‌లో జరిగిన పౌర సన్మాన సభావేదికపై చిరునవ్వులు చిందిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్‌లోనే పెరిగా.. ఎదిగా.. ఒదిగా!



బేగంపేట విమానాశ్రయంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న వెంకయ్యనాయుడు

మూడోపేజీ తరువాయి...

సీఎం కేసీఆర్‌తో చెప్పారు. విభిన్న భాషలకు, సంస్కృతికి వేదికగా ఉన్న తెలంగాణ విస్తృతమైన భౌగోళిక ప్రాంతం. ఇది ఉత్తరాదివారికి దక్షిణాది ప్రాంతంగా, దక్షిణాదివారికి ఉత్తరాది ప్రాంతంలా అనిపిస్తుంది. ప్రజల తీరుతెన్నులు గమనిస్తే మినీభారత్‌ను తలపిస్తుంది. నేను పుట్టింది నెల్లూరులో, చదివింది విశాఖపట్నంలో, ఉద్యమాలు చేసింది ఆంధ్రలో, రాజకీయంగా పెరిగింది, ఎదిగింది, ఒదిగింది... హైదరాబాద్‌లోనే. నేను మొదటి నుంచి చెప్పాలనుకుంటున్నా.. రాష్ట్రం విడిపోయింది ఎవరికో వ్యతిరేకంగా, ఎవరిపైనో కక్షతో కాదు. ఎవరిప్రాంతాన్ని వారే పరిపాలించుకోవాలని, అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతోనే. రాష్ట్రాలు విడిపోయినా, ప్రపంచ దృష్టిలో తెలుగువారంతా ఒక్కటే. కలిసి ఉండి కలహించుకునే బదులు విడిపోయి సహకరించుకోవడం మేలని ఎప్పుడూ చెప్తుంటా. కన్నతల్లిని మాతృభాషను, దేశాన్ని పట్టించుకోనివాడు మనిషే కాదు. మనం తెలుగుభాషను విస్మరించవద్దు. తెలుగుభాషలో గ్రామర్ కాదు.. గ్రామర్ కూడా ఉంది. అంటువ్యాధిలా మారిన ఇంగ్లిష్‌పై విపరీత అభిమానాన్ని వదిలించుకోవాలి. ఇంగ్లిష్‌కు నేను వ్యతిరేకిని కాదు. అది అవసరమే. కానీ ఇంగ్లిష్ ఒరవడిలో తెలుగు కొట్టుకుపోవద్దనేది నా అభిప్రాయం. తెలుగుభాషను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెండురాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరుతున్నా. తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు పరస్పరం సహకరించుకోవాలి. తెలుగు చదివితే ఉద్యోగం వస్తుందన్న భరోసా కల్పించాలి. సాహిత్య ప్రపంచంలో రారాజు దాశరథి సినారె. సుయోధన స్వాతిశయం, శ్రీనాథ సార్వభౌముని ప్రతిభ, కవి పోతన కవిత్వం కలగలిస్తే సినారె అవుతారు. మహాకవి సినారె తెలుగువారి గురించి గొప్పగా చెప్పారు. 'పంచకట్టులో ప్రపంచానికే మొనగాడు. కండువాలేనిదే గడప దాటనివాడు. పంచభక్ష్యాలు కంచాన వడ్డించినా, గోంగూర కోసం గుటకలేసేవాడు..ఎవడయ్యా ఎవడు..! ఇంకెవడయ్యా మన తెలుగువాడు'అని తెలుగుతనాన్ని పండించారని నెమరువేసుకున్నారు.

అడుగడుగునా పోరాట నేల తెలంగాణ

సీఎం కేసీఆర్ సాహిత్యం, భాషలో మాధుర్యం, మాటలలో లాలిత్యం, జనంతో మమేకమైన మాండలిక భాషలో మాట్లాడే ప్రసంగం అంటే తనకెంతో ఇష్టమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. సన్మానం తర్వాత మంచి భోజనం ఏర్పాటుచేశామని, తినకుండా వెళ్లిపోవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారని, కానీ కేసీఆర్ ప్రసంగం, వేదపండితుల సాహిత్యం విన్నాక షడ్రుచులతో కూడిన భోజనం తిన్నంత సంతోషంగా ఉన్నదన్నారు. పద్యం,గద్యం వినే రోజులు కనుమరుగవుతున్న క్రమంలో తెలంగాణ ప్రభుత్వం సాహిత్యపరంగా, సంప్రదాయకంగా, సాంస్కృతికపరంగా సన్మానం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. సాహిత్యానికి, సంస్కృతికి ప్రాణపద్రమైన తెలంగాణ నేలలో అడుగడుగునా ప్రతిఘటన, పోరాటం ఉన్నదని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో, నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా ఉద్యమించడంలో, రజాకార్ల అరాచకానికి వ్యతిరేకంగా గళమెత్తడంలో ఘనమైన చరిత్ర ఉన్నదని గుర్తుచేశారు. కుమ్రంభీం, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్క తిరుగుబాటుకు ప్రతీకలని వివరించారు. 'అన్యాయాన్ని, అక్రమాన్ని ఎవరైతే ఎదురిస్తారో వారే నా ఆరాధ్యుడు' అని చెప్పిన కాళోజీ.. పరిస్థితులకు రాజీపడేవారు కాదని చెప్పారు. తెలంగాణ సంస్కృతి విశిష్టమైనదని, బతుకమ్మ, బోనాలు, రంజాన్, బక్రీద్ పండుగలు జరుపుకోవడమే నిదర్శనమని చెప్పారు. తెలంగాణ విభిన్న సంస్కృతులకు నిలయమే కాదు, రుచులు సైతం భిన్నమైనవని చెప్పారు. బిర్యానీ, హలీం ప్రపంచ ప్రసిద్ధి చెందాయని గుర్తుచేశారు. తాను భాషాప్రియుడే కాదు, భోజన ప్రియుడనని.. హైదరాబాద్ వంటకాలు ఇష్టమని చెప్పారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ నరసింహన్, కేంద్ర మంత్రి దత్తాత్రేయ, స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి ఉన్నారు.

గాంధీ, అంబేద్కర్ కలల రాజ్యం రావాలి

రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పునరుద్ఘాటించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. ఇద్దరు ముఖ్యమంత్రులతో మాట్లాడినప్పుడు ఇద్దరిలో కూడా అదే భావన, అభిప్రాయం వ్యక్తమైందని చెప్పారు. కుటుంబంలో మాదిరిగా వివిధ అంశాల్లో చిన్నచిన్న గొడవలు సహజమని, వాటిని పక్కనపెట్టి ముందుకు సాగాలని సూచించారు. రెండురాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. దేశానికి స్వరాజ్యం వచ్చిందని, పూర్తి సురాజ్యం రాలేదని అభిప్రాయపడ్డారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ కలలుగన్న సురాజ్యం రావాలన్నారు. రామరాజ్యం రావాలని మహాత్మాగాంధీ కోరుకున్నారని, రామరాజ్యం అంటే మతరాజ్యం కాదన్నారు. ఆకలిదప్పులు లేని అవినీతి, అక్రమాలకు ఆస్కారంలేని పాలన అని చెప్పారు. దేశంలో వీధికుక్క కూడా ఆకలితో అలమటించకూడదు..అప్పుడే సంతోషిస్తానన్న స్వామి వివేకానంద వ్యాఖ్యలు నిజం కావాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ పదవిలో ఉన్నందున ప్రొటోకాల్ ప్రకారం పరిమితులుంటాయని, ప్రజలతో మమేకమైన తనకు ఇది ఇబ్బందేనని.. క్రమంగా అలవాటుపడుతానని చెప్పారు. పౌరసన్మానం చేసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

తెలుగువారు గర్వించే సందర్భం: గవర్నర్ నరసింహన్

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సన్మానించుకోవడం తెలుగువారందరికీ గర్వకారణమని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చెప్పారు. ఏడున్నర ఏండ్లుగా హైదరాబాద్‌లోనే సేవలందించానని, తాను కూడా తెలుగువారిలో ఒకరినయ్యానని వివరించారు. 1972 జై ఆంధ్రా ఉద్యమం నుంచి వెంకయ్యనాయుడు తెలుసునని చెప్పారు. ఢిల్లీలో ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా జైఆంధ్రా ఉద్యమం వివరాలను సేకరించే బాధ్యత ఉండేదన్నారు. అప్పట్లో విజయవాడలో వెంకయ్యనాయుడు భారీ ప్రసంగాలు చేయడం, చురుకుగా ఉద్యమంలో పాల్గొనడం చూశానని గుర్తుచేసుకున్నారు. వెంకయ్యనాయుడు అసాధారణమైన వ్యక్తి అని కొనియాడారు. వెంకయ్యనాయుడుకు ఉపరాష్ట్రపతి పదవిరావడం గర్వకారణమని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కొనియాడారు. ఇప్పటివరకు అన్ని పదవులకు న్యాయంచేశారని, ఉపరాష్ట్రపతి పదవికి మరింత వన్నె తెస్తారని ఆకాంక్షించారు.

బేగంపేటలో ఆత్మీయ స్వాగతం

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి ఉదయం 11గంటలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో పాటు పలువురు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసు బృందం గౌరవ వందనం సమర్పించింది. స్వాగతం పలికిన వారిలో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు కే తారకరామారావు, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేత జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో ఘన సన్మానం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు రాష్ట్రప్రభుత్వం ఘనంగా పౌరసన్మానం చేసింది. యాదాద్రి వేదపండితులు మంత్రోచ్ఛారణాల మధ్య ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్వయంగా సన్మానించారు. వెంకయ్యనాయుడుకు శాలువా కప్పి, పన్నీరు చల్లారు. వెండి నెమలి, కాకతీయ కళాతోరణం జ్ఞాపికతోపాటు నిలువెత్తు ఫోటోతోకూడిన సన్మానపత్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎంలు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, ఎంపీలు కేశవరావు, జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్‌తో పాటు మంత్రులు నాయిని నరసింహారెడ్డి, ఈటల రాజేందర్, కే తారకరామారావు, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, జోగు రామన్న, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీలు కల్వకుంట్ల కవిత, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గొడం నగేష్, మల్లారెడ్డి, బూర నర్సయ్య గౌడ్, బాల్క సుమన్, పసునూరి దయాకర్, రాజ్యసభ సభ్యులు డీ శ్రీనివాస్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, టీ సుబ్బరామిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్, సినీప్రముఖులు అక్కినేని అమల, బ్రహ్మానందం, పరుచూరి గోపాలకృష్ణ, వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పట్టువస్త్రాలు బహూకరించి పన్నీరు చల్లుతున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. ఆశీర్వచనం చేస్తున్న యాదాద్రి వేద పండితులు



రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి కి జరిగిన పౌరసన్మాన సభకు హాజరైన మంత్రులు కేటీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పద్మారావు, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, హరీశ్‌రావు, తలసాని, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి. చిత్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.



రాజ్‌భవన్‌లో ఉపరాష్ట్రపతికి జరిగిన పౌరసన్మాన సభకు హాజరైన ఎంపీలు కల్వకుంట్ల కవిత, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జీ నగేష్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్. చిత్రంలో కే రవీందర్‌రావు, అయాచితం శ్రీధర్, కార్పొరేషన్ చైర్మన్లు జీ దేవీప్రసాద్, శేరి సుభాష్‌రెడ్డి ఉన్నారు.

ఈ ప్రస్థానం వెనుక ఎంతో కృషి: సీఎం కేసీఆర్

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భారతదేశం గర్వించదగ్గ తెలుగుబిడ్డ అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కొనియాడారు. రసజ్ఞతతో కూడిన గొప్ప వక్తని, ఉపరాష్ట్రపతి పదవికి మరింత వన్నె తెస్తారని చెప్పారు. రాజ్‌భవన్‌లో పౌరసన్మానం సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రసంగించారు. 'ఉపరాష్ట్రపతిగా ఉన్నతహోదాలో ఉన్న వ్యక్తిని దేశంలోనే తొలిసారిగా సన్మానించే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. వెంకయ్యనాయుడు గురించి ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఇదొక ప్రత్యేక సందర్భం. మన మధ్యలోనే ఉన్న వ్యక్తి ఎదుగుతూ ఎదుగుతూ...ఒదుగుతూ ఒదుగుతూ అత్యున్నత శిఖరానికి చేరడం గర్వకారణం. కొన్ని సందర్భాల్లో కొన్ని చెప్పక తప్పదు. తెలుగువారిని గతంలో మదరాసీలని పిలిచేవారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక తర్వాత తెలుగువారికి గుర్తింపు వచ్చింది. తెలుగు అనే జాతి ఒకటి ఉన్నదని, వారికి ఒక భాష ఉన్నదని ప్రపంచానికి తెలిసింది. తెలుగుబిడ్డ వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టడంతో తెలుగుఖ్యాతి మరింత ఇనుమడిస్తుందనడంలో సందేహం లేదు. వెంకయ్యనాయుడు ప్రసంగంలో దిట్ట. అద్భుతమైన వక్త. ఆయన మాట్లాడితే ఎంజాయ్ చేస్తారు. అలా మాట్లాడటం వెనుక ఎంతో కృషి, శ్రమ ఉంటుంది. అద్భుతమైన పదాలకూర్పు. భాషా పాండిత్యంతో ఉపన్యాసాన్ని పండించడం ఒక కళ. అందులో దేశంలోనే అద్భుతమైన వక్త వెంకయ్యనాయుడు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ.. భాష ఏదైనా అద్భుతంగా మాట్లాడగలరు. దక్షిణాదివారికి హిందీ రాదనే అభిప్రాయం ఉంది. కానీ వెంకయ్యనాయుడు హిందీలో అద్భుతంగా ప్రసంగిస్తారు. రసజ్ఞతతో మాట్లాడమంటే ఒక కళ. 'చదువది ఎంత కలిగినా రసజ్ఞత ఇంచుక చాలకున్నా నా చదువు నిరర్థకంబు. గుణసంయుతులెవ్వరు మెచ్చ,రెచ్చుటన్. బడనుగ మంచికూర నలపాకము చేసినన్నైనా నందు నిం పొడవెడు నుప్పులేక రుచిపుట్టగా నేర్చునటయ్యా భాస్కరా'అన్నట్టుగా ప్రసంగంలో రసజ్ఞత లేకపోతే ఇంటలెక్చువల్ యాక్సెప్టెన్సీ రాదు. పదాల నర్తన, కూర్పు బాగుంటేనే ప్రసంగం రక్తికడుతుంది. 1980లో తొలిసారిగా వెంకయ్యనాయుడు ఉపన్యాసం వినే అవకాశం దక్కింది. పీజీ అయిపోయి రాజకీయాల వైపు చూస్తున్న సమయమది. ఎమర్జెన్సీ ఉద్యమంలో జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత సుబ్రహ్మణ్యస్వామితో కలిసి వెంకయ్యనాయుడు సిద్దిపేటకు వచ్చారు. ఎమర్జెన్సీ గురించి ఆయన ప్రసంగం వ్యంగ్యంగా ఆసక్తిగా సాగింది. వ్యంగ్యం, హాస్యం, రౌద్రం అన్నీ కలగలిపితే ఒక మంచి ఉపన్యాసం అవుతుంది. ఇది ఒక్కరోజుతో వచ్చేది కాదు. ఎంతో శ్రమిస్తే కానీ సాధ్యం కాదు. అనగనగా రాగమతిశయించు..తినగతినగ వేము తియ్యనుండు..సాధనమున పనులు సమకూరు ధరణిలోన...అని వేమన శతకంలో ఉంది. తమాషాకు ఏదీరాదు. వెంకయ్యనాయుడు అద్భుతమైన వక్త. కానీ వెనుక ఎంత శ్రమ, ఎంత పరిశీలన ఉంటుందో అర్థం చేసుకోవాలి. ఆయన ప్రసంగం ద్వారా, తెలివితో పదవులకు వన్నె తెస్తున్నారు. సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన ఈ స్థానానికి రావడం వెనుక ఎంతో కృషి ఉన్నది. మాజీ ప్రధాని వాజపేయి, ప్రస్తుత ప్రధాని మోదీ బృందంలో వెంకయ్యనాయుడు మంత్రిగా పనిచేయడం గొప్పవిషయం. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా తెలుగువ్యక్తి పనిచేసినప్పుడే మనకు గౌరవం దక్కింది. ఉప రాష్ట్రపతి పదవి దక్కడం మరోమారు లభించిన గౌరవం. అలాంటి పదవి దక్కిన తర్వాత ఆత్మీయసన్మానం చేసే అవకాశం మొదటిసారి తెలంగాణకు ఇచ్చారు. ఉన్నతమైన పదవిలో ఉన్నప్పటికీ.. ఈ రోజు సన్మానం సందర్భంగా హుందాగా ఉన్నారు. గతంలో ఉన్నత వ్యక్తులకు ఆహ్వానం పలికినప్పుడు ఆహ్వానంతోనే సరిపోయేది. కానీ ఈ రోజు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆహ్వానం అందుకున్నట్టుగా కాకుండా, మమ్మల్ని గొప్పగా పలుకరించారు. ప్రొటోకాల్ పక్కనపెట్టి సాధారణ వ్యక్తిలా ఆత్మీయంగా పలుకరించి...ఆప్యాయంగా మాట్లాడారు. నెల్లూరు తర్వాత ఆత్మీయక్షేత్రం హైదరాబాదే, ఇక్కడ అందర్నీ కలువడానికి వచ్చానని చెప్పారు. ఉపరాష్ట్రపతి వంటి ఉన్నతస్థానంలో ఉండి కూడా ఆత్మీయతను పంచిన తెలుగు బిడ్డకు అభినందనలు'అని సీఎం ముఖ్యమంత్రి కేసీఆర్ కొనియాడారు.

తెలుగు భాషను కాపాడండి..

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో ఉపరాష్ట్రపతి

ఉద్యోగాల ఎంపిక క్రమంలో తెలుగు భాషను కాపాడండి అని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణిని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరారు. రాజ్‌భవన్‌లో పౌర సన్మానం సందర్భంగా ఘంటా చక్రపాణిని వెంకయ్యనాయుడుకు సీఎం కేసీఆర్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా చక్రపాణితో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీ క్రమంలో తెలుగు భాషా పరిజ్ఞానానికి సంబంధించి పరీక్ష కూడా నిర్వహించాలన్నారు.

గెలుపుపై టీబీజీకేఎస్ ధీమా

సింగరేణిలో ఎన్నికల సందడి

కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో ఒక్కసారిగా కార్మిక సంఘాల్లో సందడి నెలకొన్నది. మూడేండ్లలో కార్మిక సంక్షేమానికి తాము చేపట్టిన కార్యక్రమాలే తమ సంఘాన్ని గెలిపిస్తాయని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకే) ధీమాగా ఉన్నది. గతంలో ఎన్నడూలేదని విధంగా సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికుల కోసం అనేక ప్రయోజనాలు కల్పించారని చెప్తున్నది. కలిసొచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని ఎన్నికల బరిలోకి దిగుతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పేర్కొంటున్నది. మిగతా సంఘాలు కూడా గెలుపుపై ధీమాగా ఉన్నాయి.

ఎన్నికల నిర్ణయం సంతోషకరం



సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థలో నాలుగేండ్లకోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగాలి. ఇప్పటికే ఐదేండ్లు దాటింది. ఆలస్యంగానైనా ఎన్నికల నిర్వహణపై కేంద్ర కార్మిక శాఖ నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకం. ఎన్నికల్లో అదిచేస్తాం, ఇది చేస్తాం అని చెప్పడం కంటే ఆచరణలో చేసి చూపించడం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)కే సాధ్యమైంది. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఎవరూ చేయనివిధంగా అనేక ప్రయోజనాలు చేకూర్చారు. సింగరేణి చరిత్రలో జరుగని అనేక సంక్షేమ, అభివృద్ధి, కార్మిక శ్రేయస్సు కార్యక్రమాలు, ఆర్థిక ప్రయోజనాలు ఈ మూడేండ్లలో సమకూరాయి.

-బీ వెంకట్రావ్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

గులాబీ జెండా చేసిన కార్యక్రమాలే గెలిపిస్తాయి



సింగరేణిలో టీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్మిక సంఘంగా కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సింగరేణిలో పనిచేస్తున్న అందరికీ నూతన రాష్ట్ర ఏర్పాటు ఇంక్రిమెంట్‌ను సీఎం కేసీఆర్ ఇచ్చారు. సకల జనుల సమ్మె కాలానికి వేతననష్టం జరుగకుండా వేతనాలు ఇప్పించిన చరిత్ర టీబీజీకేఎస్‌దే. అనేక పరిశ్రమల్లో లాభాలు వస్తున్నప్పటికీ సింగరేణిలో మాత్రమే కార్మికులకు లాభాల వాటా ఇచ్చారు. ఇలా అనేక అంశాలపై కార్మికులకు మేలు చేశాం. ఈ మంచిపనులే మా సంఘాన్ని గెలిపిస్తాయి.

-కెంగెర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఈ ఎన్నికలు కార్మిక చట్టానికి వ్యతిరేకం



సింగరేణిలో గుర్తింపు ఎన్నికల సందర్భంగా కోడాఫ్ డిసిప్లేన్ మార్చాలని కోరినప్పటికీ అందుకు భిన్నంగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇది కార్మిక చట్టాలకు వ్యతిరేకం. సింగరేణిలో గుర్తింపు ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)ను ప్రత్యామ్నాయంగా కార్మికులు ఆలోచించాలి. అనేక సూక్ష్మ విషయాలను కూడా తెరపైకి తీసుకొచ్చి నిర్లిప్తత నుంచి సమస్యలు పరిష్కరించే శక్తిసామర్థ్యాలు మాకే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో బీఎంఎస్ సత్తా చూపిస్తుంది.

- లట్టి జగన్‌మోహన్, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు

ఎన్నికలతోనే సమస్యలకు పరిష్కారం



ఎన్నికలతోనే సింగరేణిలోని కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయి. గత నాలుగు సార్లు రామగుండం ఏరియాలోని ఆర్జీ1-2లలో విజయం సాధించాం. కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడుతాం. అన్ని సమస్యలను పరిష్కరించడానికి ఎన్నికల నిర్వహణ ద్వారానే మార్గం ఏర్పడుతుంది. కొత్త హక్కులు తీసుకొస్తాం.

-రియాజ్ అహ్మద్, హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్), ప్రధాన కార్యదర్శి

హక్కులు కాకుండా ఎన్నికలే ముఖ్యమని తేటతెల్లమైంది



సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలంటే ముందు కోడాఫ్ డిసిప్లేన్ మార్చాలని ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్‌లు పట్టుబట్టాయి. కానీ అది జరుగకుండానే ఎన్నికల్లోకి వెళ్తామని చెప్పడం అవకాశవాదంగా ఉపయోగించుకున్నారు. హక్కుల కోసం కాకుండా ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఆలోచనతోనే ఉన్నారని వారి వైఖరిని బట్టి తేటతెల్లమైంది. కేవలం ఒక్కఓటుతో రెండు గుర్తింపులు ఇవ్వడం మంచిపద్ధతి కాదు.

-మందా నర్సింహారావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి

కలిసొచ్చే వారి సహకారంతో ఎన్నికలకు వెళ్తాం

సింగరేణిలో గుర్తింపు ఎన్నికల్లో తలపడేందుకు సిద్ధంగా ఉన్నాం. కలిసొచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని ఎన్నికల బరిలో నిలిచేందుకు మాకెలాంటి అభ్యంతరమూ లేదు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా కార్మికుల సమస్యలపై విధానపరమైన అంశాల్లో అందరం కలిసికట్టుగా యాజమాన్యంపై పోరాటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. అందరికీ మైన్స్ వద్ద మీటింగ్‌లు పెట్టుకోవడానికి, మెంబర్‌షిప్ చేసుకోవడానికి హక్కు కల్పించాలి. పొత్తులపై ఇంకా ఎవరితో మాట్లాడలేదు. ఎన్నికలను స్వాగతిస్తున్నాం.

- వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ (సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్) ప్రధాన కార్యదర్శి

ఉపాధి హామీ నిధుల విడుదల

తొలి విడుతగా రూ. 172.02 కోట్లు

ఉత్తర్వులు జారీచేసిన గ్రామీణాభివృద్ధి శాఖ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తెలంగాణకు 2017-18 సంవత్సరానికి రెండవ విడుతగా రూ.172.02 కోట్లను విడుదలచేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి ఈ పథకం కింద మొత్తం రూ.226.02 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 9వ తేదీన తీసుకున్న నిర్ణయంలో భాగంగా రెండవ విడుతగా రూ.172.02 కోట్లను విడుదలచేస్తున్నామని, మిగిలిన నిధుల్ని త్వరలో విడుదల చేస్తామని మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ రాజీవ్‌శర్మ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులు ఈ పథకం కింద కేవలం 'వేజ్ కాంపొనెంట్'కు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేశారు. తొలి విడుతగా రూ.4.61 కోట్లను ఈ నెల 18వ తేదీన విడుదల చేశారు. రెండు విడతలుగా ఇప్పటివరకు రూ.176.63 కోట్లు విడుదల కాగా, ఇంకా రూ.49.38 కోట్లు విడుదల కావాల్సి ఉంది. మిగిలిన నిధుల్ని మరో విడతగా (రూ. 49.38 కోట్లను) విడుదల చేస్తామని ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధుల్ని ఈ పథకం కింద వినియోగించాల్సిన అసరాలకు మాత్రమే ఖర్చు పెట్టాలని, ఇతర పనులకు మళ్లించరాదని స్పష్టంచేశారు. మెటీరియల్ కాంపొనెంట్ విభాగం కింద రాష్ట్రానికి 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ. 35.17 కోట్లను మంజూరుచేస్తూ ఈ నెల 9న జరిగిన సమావేశంలోనే మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. గతేడాది రాష్ట్రానికి మంజూరైన రూ.1,231.52 కోట్లను 33 విడుతలుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే.

అతిత్వరలో వరంగల్‌కు సీఎం కేసీఆర్!

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ■ ప్రజాప్రతినిధులతో సమీక్షలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అతిత్వరలో వరంగల్ జిల్లాలో పర్యటిస్తారని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు. ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని, పెండింగ్ పనులను ఎమ్మెల్యేలు ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ పర్యటనలో టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఆశించిన మార్పును తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించేందుకు పురపాలకశాఖ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించాలని ప్రజాప్రతినిధులు మంత్రి కేటీఆర్‌ను కోరారు. వచ్చేవారంలో వరంగల్‌లో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సారథ్యంలో నిర్వహించే సమీక్షలో జిల్లాస్థాయి యంత్రాంగం మొత్తం పాల్గొంటుందని మంత్రి తెలియజేశారు. ఇందులో వరంగల్ కార్పొరేషన్, కుడా అభివృద్ధి పనులను సమీక్షిస్తారు. సమావేశంలో ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, మేయర్ నన్నపనేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు



గణేశ్, బక్రీద్ పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై సోమవారం జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీజీపీ అనురాగ్‌శర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈసారి గణేశ్, బక్రీద్ పండుగలు ఒకే సమయంలో వస్తుండటంతో పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని డీజీపీ అనురాగ్‌శర్మ జిల్లా ఎస్పీలను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పోలీసు కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలతో మాట్లాడారు. బందోబస్తు ఏర్పాట్లను తెలుసుకోవడంతోపాటు పలు సూచనలు చేశారు. ఏయే జిల్లాల్లో ఎంత ఫోర్స్‌ను ఉపయోగిస్తున్నారు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? పెట్రోలింగ్ ఎలా నిర్వహిస్తున్నారు? ఎన్ని మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నది? వంటి అంశాలపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఎం మహేందర్‌రెడ్డి, అదనపు డీజీపీ అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు రాజేశ్, తరుణ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

సరస్ ఎక్స్‌పో నిర్వహణ బాధ్యతలు మళ్లీ రాష్ట్రానికే

■ ఏర్పాట్లపై సెర్ప్ అధికారుల కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏటా దసరా పండుగకు ముందు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహకారంతో నిర్వహించే మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన.. సరస్ ఎక్స్‌పో-2017 నిర్వహణ బాధ్యతలు మళ్లీ రాష్ట్రానికే దక్కాయి. గతేడాది కూడా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించింది. సెప్టెంబర్ 14 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో జరుగనున్న సరస్ ఎక్స్‌పో- 2017 నిర్వహణపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలు, పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమం కోసం రూ.40 లక్షలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సెర్ప్‌కు విడుదల చేసింది. దేశంలోని 29 రాష్ట్రాలకు చెందిన సుమారు 250 స్వయం సహాయక సంఘాలు ఈ ఎక్స్‌పోలో పాల్గొననున్నాయి. ఎక్స్‌పో సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రదర్శనకు, విక్రయాలకు అందుబాటులో ఉంచనున్నారు. కార్యక్రమ నిర్వహణకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు ఇందిరాపార్క్ దగ్గర ఉన్న ఎన్టీఆర్ స్టేడియం, నిజాం కాలేజీ, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ మైదానాలను సెర్ప్ సీఈవో పౌసుమి బసు సోమవారం పరిశీలించారు. ఈ ఏడాది నుంచి సరస్ ఎక్స్‌పోను ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది.



హైదరాబాద్‌లోని బాలానగర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం జరిగిన బహిరంగ సభ వేదికపై ఆసీనులైన మంత్రులు కే తారకరామారావు, నాయిని నర్సింహారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు కూడా ఉన్నారు.

మాది అభివృద్ధి బాట

మూడోపేజీ తరువాయి...

రెండు స్కైవేలు కట్టబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ నిర్మాణాలు రక్షణభూములతో ముడిపడి ఉన్నాయని, వీటిని అప్పగించేందుకు రక్షణ శాఖ అంగీకరించినా ఇంకా ఉత్తర్వులు రాలేదన్నారు. ఇవి రాగానే ఉత్తర తెలంగాణకు కీలకమైన రాజీవ్ రహదారి మీదుగా స్కైవే నిర్మాణాలు చేపడుతామన్నారు. దాంతోపాటు నగరంలో రూ.3వేల కోట్లతో వివిధ ప్రాంతాల్లో భారీ ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. అంబర్‌పేటలోని ఛే నంబరు చౌరస్తా నుంచి రామంతపూర్‌వరకు రూ.250 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణం టెండర్ దశలో ఉన్నదని చెప్పారు. ఉప్పల్‌నుంచి నారపల్లివరకు రూ.వెయ్యి కోట్లతో ఫ్లై ఓవర్ చేపట్టి నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ ఎదుగాలంటే కొంత సమయం పడుతుందని ప్రజలు గమనించాలని కోరారు.

ఈ అభివృద్ధితోనే మేం సంతృప్తి పడం..

ఈ మూడేండ్లలో పారిశ్రామికంగాకానీ, కరెంటు, మంచినీళ్ల విషయంలో కానీ శాంతిభద్రతల విషయంలో కానీ సాధించిన అభివృద్ధితో పొంగిపోవడంలేదని కేటీఆర్ అన్నారు. కొత్త రాష్ట్రం అంటే కొత్త సంసారం లెక్క అని చెప్తూ.. పాలన గాడిలో పడేందుకే సంవత్సరం పట్టిందన్నారు. ముఖ్యంగా సంవత్సరంపాటు కేంద్రం రాచిరంపాన పెట్టిందని విమర్శించారు. అధికారుల విభజన సరిగా చేయలేదని, ఇప్పటికీ హైకోర్టు, చాలా సంస్థల విభజన పూర్తికాలేదని గుర్తుచేశారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ కార్యదక్షతవల్ల అన్ని కుదుటపడ్డాయని అన్నారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన కరెంటు, శాంతిభద్రతలు సహా అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ పోతున్నామన్నారు. ఈ క్రమంలోనే పెండింగ్‌లో ఉన్న బాలానగర్ ఫ్లై ఓవరును నిర్మిస్తున్నామన్నారు. పీవీ ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత ఇంతటి భారీ నిర్మాణం చేపట్టడం నగరంలో ఇదే మొదటిసారి అని చెప్పారు. 18 నెలల్లో దీనిని పూర్తిచేసి తీరుతామని ధీమా వ్యక్తంచేశారు.

ఎవ్వరినైనా ఇబ్బంది పెట్టినమా?

'ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా మూడేండ్ల రెండు నెలల, పదహారు రోజులు. నాలుగేండ్ల కిందట హైదరాబాద్‌లో ఏ నోట విన్నా తెలంగాణ వస్తే నష్టమా? లాభమా? అనే చర్చ జరిగింది. ఈ సమయంలో ఎన్నోన్నో అనుమానాలు, అపోహలు, దుష్ప్రచారాలు లేవనెత్తారు. తెలంగాణ వస్తే ఇట్లయితది.. అట్లయితది.. ఇక్కడ ఉండనీయరు.. ఆంధ్ర ప్రాంత ప్రజలను బతకనీయరు.. అంటూ అబద్ధపు ప్రచారాలు చేశారు' అని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. 'కానీ ఈ మూడేండ్లలో ఎవ్వరినైనా కనీసం గిచ్చినమా? ఎక్కడైన ఇబ్బందులకు గురి చేసినమా?' అని ప్రశ్నించారు. హోంమంత్రి నాయిని నేతృత్వంలోని పోలీస్‌శాఖ దేశంలోనే సమర్థవంతంగా శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నదని కేటీఆర్ చెప్పారు.

రాష్ట్రం అన్నింటిలో నం.1

శాంతి భద్రతల్లో హైదరాబాద్ నంబర్ వన్‌గా ఉందని కేటీఆర్ అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉన్నదని వివరించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అవినీతిరహిత పరిపాలన, విధానాల్లో సంస్కరణలు తీసుకురావడం వల్లే ఈ ఘనతలు దక్కాయని చెప్పారు. ఇది మనకి మనం ఇచ్చుకున్న సర్టిఫికెట్ కాదని, స్వయంగా కేంద్ర ప్రభుత్వం 29 రాష్ట్రాలలో విధానాలు, ఆచరణలను బేరీజు వేసి ప్రకటించిందని అన్నారు. తెలంగాణ వచ్చినంక ఇప్పటివరకు టీఎస్ ఐపాస్ ద్వారా 4,100 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, తద్వారా రూ.70వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చామని వివరించారు. వీటితో 2.30లక్షల మందికి ప్రత్యక్షంగా, అంతకు రెండింతలు పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించినట్టు పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై అపోహలు సృష్టించారని, కానీ భారతదేశం మొత్తంలోనే రియల్ ఎస్టేట్‌పరంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరంగా హైదరాబాద్ నిలబడిందన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్లనే సాధ్యమైందన్నారు. జేఎల్ఎస్ సంస్థ (రియల్ ఎస్టేట్ అధ్యయన సంస్థ) చాలా పారామీటర్లతో బేరీజు వేసి ఈ మేరకు ప్రకటించిందన్నారు. దేశంలోనే నాణ్యతతో కూడిన జీవన ప్రమాణాలున్న నగరం హైదరాబాద్ అని మెర్సర్ అనే అంతర్జాతీయ సంస్థ ప్రకటించిందన్నారు. గడిచిన మూడేండ్లలో వరుసగా హైదరాబాద్ బెస్ట్ లివింగ్ సిటీగా అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు.

జోడెద్దుల మాదిరిగా ముందుకు

ఒకవైపు అభివృద్ధి.. రెండోవైపు సంక్షేమం.. రెండింటినీ కలగలిపి జోడెద్దుల మాదిరిగా ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రహ్మాండంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారని కేటీఆర్ చెప్పారు. నిరంతర విద్యుత్, మన పంట-మన పెట్టుబడి పేరిట ఎకరానికి ఏటా రూ.8వేలు ఇచ్చే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టబోతున్నారని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతన్నలు గుండెల మీద చేయ్యి వేసుకుని నిద్రపోయే పరిస్థితులను కల్పించామని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనను గుర్తించి వ్యవసాయ రంగంలో అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం గర్వకారణమని అన్నారు. ఆసరా పింఛన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలతోపాటు పేదింటి గర్భిణులకు రూ.12వేల రూపాయలతోపాటు ప్రసవానంతరం 13 రకాల వస్తువులను కేసీఆర్ కిట్ పేరుతో ఇస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మహా నగరంలో లక్ష మందికి పట్టాలు ఇచ్చామని తెలిపారు.

రాష్ట్రంలో నిరుపేదలున్నంత వరకు ఇండ్ల పథకం

'గతంలో వాంబే, ఇందిరమ్మ ఇండ్లు 150, 200 చదరపు అడుగులతో కట్టి సంసారం చేయమన్నరు. పేదవారంటేనే గత ప్రభుత్వాలకు చిన్నచూపు. కానీ పేదలు తలెత్తుకుని బతికేలా ఇండ్లు ఉండాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం' అని కేటీఆర్ అన్నారు. అందుకే రూ.8.70లక్షలు ఖర్చు పెట్టి ఉచితంగా ఇల్లు కట్టించి ఇస్తున్నామని పేర్కొన్నారు. ఒక్కో ఇంటి విలువ రూ.35-40లక్షలకు సమానమని చెప్పారు. ఇది లబ్ధిదారుల పిల్లలకు ప్రభుత్వం ఇచ్చే విలువైన కానుక అన్నారు. ఏ రాష్ట్రంలోలేని విధంగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసమే రూ.18వేల కోట్లను ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో నిరుపేదలు ఉన్నంతవరకు ఈ ఇండ్ల పథకాన్ని కొనసాగిస్తామని, ఇది ఎన్నికల కోసం కాదని, నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం కాబట్టే ఈ నెలాఖరు నాటికి లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లకు టెండర్లు పూర్తి చేసి, వచ్చే సంవత్సరంలో ప్రారంభోత్సవాలు చేస్తామని తెలిపారు.



సోమవారం హైదరాబాద్‌లోని బాలానగర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కే తారకరామారావు, నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు కూడా ఉన్నారు.

2019లో కేసీఆర్‌కే మళ్లీ పట్టం

ప్రజలు 2019 ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్‌కే పట్టం కడుతారని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వాన్ని రోజూ తిడుతున్న కాంగ్రెస్ నాయకులకు కూడా ఈ విషయం బాగా తెలుసునని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలోని రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ సహా అందరికీ ఈ విషయం తెలుసని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయని కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే జీర్ణించుకోలేక పోతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఎక్కడ అధికారానికి శాశ్వతంగా దూరమైపోతామోనన్న భయంతో ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టులకు వ్యతిరేకంగా చనిపోయినవాళ్ల పేరుతోనూ కేసులు వేశారని గుర్తుచేశారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వృత్తిపరంగా న్యాయవాది. ఆయన అసెంబ్లీలో తెలిసో తెలియకనో చనిపోయిన వ్యక్తుల వేలిముద్రలతో కేసులు వేసినమని నిస్సిగ్గుగా ఆన్‌ద రికార్డు ఒప్పుకున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. తాను అన్నది అవాస్తవమైతే కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహా నగర ప్రజలకు రెండు, మూడేండ్లు కరువు వచ్చినా మంచినీళ్ల గోస ఉండవద్దని సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని మండిపడ్డారు. తాగునీటి కోసం తిప్పల్లేకుండా 10 టీఎంసీల సామర్థ్యంతో డెడికేటెడ్ డ్రింకింగ్ వాటర్ రిజర్వాయర్‌ను కేశవపూర్, రాచకొండ ప్రాంతాల్లో కడుతున్నట్లు మంత్రి చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రం వస్తే బతుకులు చీకటి అయితని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నడు.. కానీ ఈ రోజు ఎర్రని ఎండల్లోనూ కోతల్లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌ది' అని అన్నారు. ప్రతిపక్షాలకు పని లేకుండా మెరుగైన నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఖాళీ కుండల ప్రదర్శనలకు అవకాశం లేకుండా చేశామని అన్నారు.

కోదండరాం కాంగ్రెస్ తొత్తు: హోంమంత్రి నాయిని

టీజేఏసీ చైర్మన్ కోదండరాం కాంగ్రెస్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నారని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌తో కలిసి అభివృద్ధి పథకాలకు అడ్డు తగులుతున్నారని మండిపడ్డారు. ఉద్యమకాలంలో కేసీఆర్ మద్దతుతోనే టీజేఏసీ చైర్మన్ అయ్యారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ విషయాన్ని మరిచి ప్రభుత్వం పైన విమర్శలు చేస్తుంటే ప్రజలే ఆయనను అడుగడుగునా అడ్డుకుంటూ ఛీదరించుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రులు మహేందర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, సాట్స్ చైర్మన్ ఆలం వెంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, మెంబర్ ఎస్టేట్ రాజేశం, సీపీవో శరత్‌చంద్ర, ఇన్‌చార్జి సీఈ మాజీద్ షరీఫ్, ఈఈ హుస్సేన్, డిప్యూటీ ఈఈ అప్పారావు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలవి దుష్ట ఆలోచనలు

■ సీఎం కేసీఆర్‌కు అవార్డు రావడం రైతులందరికీ గర్వకారణం

■ టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి



సోమవారం టీఆర్‌ఎస్‌భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు. చిత్రంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'రాష్ట్రంలో రైతే సీఎంగా ఉన్నందున రైతులకు మంచి రోజులు వచ్చాయి. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు రావడం తెలుగు వారందరికీ గర్వకారణం. అవార్డును కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది. ప్రతీది రాజకీయం చేయాలనే దుష్ట ఆలోచనలు వారివి'అని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు రావడంపై ప్రతి రైతు గర్వపడాలన్నారు. హరిత విప్లవపితామహుడు స్వామినాథన్ వంటి శాస్త్రవేత్తల సారథ్యంలోని కమిటీ సీఎం కేసీఆర్‌ను అవార్డుకు ఎంపికచేస్తే కొందరు అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి అవార్డు దక్కినందుకు సహకార సంఘాల తరపున రవీందర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తితో కలిసి మీడియాతో మాట్లాడారు. రైతులకు ఇంకా ఏం చేయా లో ప్రతిపక్షాలు సూచనలు ఇస్తే బాగుంటుందని, కానీ ప్రతి అంశాన్ని విమర్శించాలనే విధానం సరికాదని హితవుపలికారు. 2008లో యూపీఏ ప్రభు త్వం దేశవ్యాప్తంగా రూ.55 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.17,500 కోట్ల రుణాలు మాఫీ చేసిందని గుర్తుచేశారు. పంజాబ్‌లో రుణమాఫీ చేసేందుకు ఆ రాష్ట్ర ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి అధ్యయనం చేసి బాగున్నదని కితాబిచ్చిందని తెలిపారు. ఇవేవీ కాంగ్రెస్ నేతలకు కనపడటం లేదా అని నిలదీశారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు అవార్డు రావడంపై తెలంగాణ సమాజం మొత్తం గర్విస్తున్నదన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్, ఎరువులు, విత్తనాలు సరఫరా చేసి కష్టాలను తొలిగించామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు.

ఎఫ్‌ఐఆర్‌ల డిజిటైజేషన్‌లో తెలంగాణ నంబర్ 1

మూడోపేజీ తరువాయి...


డిజిటల్‌లోకి మార్చి ఆన్‌లైన్‌లో ఉంచడం తదితర అంశాల్లో వందకు వందశాతం సక్సెస్ సాధించింది. హిమాచల్‌ప్రదేశ్ (91%), హర్యానా (90.7%), మహారాష్ట్ర (89.8%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కేంద్రం నుంచి సీసీటీఎన్ఎస్ పథకానికి అందుతున్న నిధులను సకాలంలో ఆ అవసరాలకు వినియోగించడంలో తెలంగాణ 83.1% ఫలితాలు సాధించింది. ఐఐఎఫ్-6 వివరాలను 58.3% నమోదు చేసింది.

పోలీసు పోర్టల్‌తో బహుళ ప్రయోజనాలు: రాజ్‌నాథ్‌సింగ్

డిజిటల్ పోలీసు పోర్టల్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ఈ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలుచేయాలని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. పోర్టల్ ప్రారంభం సందర్భంగా అన్ని రాష్ట్రాల పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, సీసీటీఎన్ఎస్ వినియోగంపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ డీజీపీ అనురాగ్ శర్మతోపాటు అదనపు డీజీపీలు అంజనీకుమార్ (శాంతి భద్రతలు), రవిగుప్తా (టెక్నికల్ సర్వీసెస్) పాల్గొన్నారు. తరువాత రాజ్‌నాథ్ ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేవలం నేరాలు, దర్యాప్తునకు మాత్రమే కాకుండా పౌర సేవలకు కూడా ఈ పోర్టల్‌ను వినియోగించుకోవచ్చునని, పాస్‌పోర్టు దరఖాస్తు దారులు వారి పోలీసు వెరిఫికేషన్ ప్రగతిని తెలుసుకోవచ్చునని, ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఈ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయవచ్చునని తెలిపారు. ఇండ్ల యజమానులు, కిరాయిదారులు, వాహనాలు లేదా వస్తుల చోరీపై ఆన్‌లైన్ ద్వారానే ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు. ఈ సీసీటీఎన్ఎస్ వల్ల నేరాల దర్యాప్తు కూడా సమగ్రంగా వేగంగా జరుగుతుందన్నారు. దేశంలో 15,398 పోలీసు స్టేషన్లు ఉంటే అందులో 13,439 స్టేషన్లు మాత్రమే ఎఫ్‌ఐఆర్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాయని తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాలు కలుపుకుని మొత్తం 36 రాష్ట్రాల్లో ఒక్క రాష్ట్రం మాత్రమే ఇంకా సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానం కాలేదని అన్నారు. ఈ వ్యవస్థను 2003లో రూపకల్పన చేస్తే 2009 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో హోంశాఖ సహాయ మంత్రులు హన్స్‌రాజ్ ఆహిర్ గంగారాం, కిరణ్ రెజిజు, కార్యదర్శి రాజీవ్ మహర్షి, ఓఎస్డీ రాజీవ్ గౌబ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో దేశవ్యాప్త సమాచారం: డీజీపీ అనురాగ్‌శర్మ

సీసీటీఎన్ఎస్ ప్రయోజనాల గురించి ఈ సందర్భంగా డీజీపీ అనురాగ్ శర్మ మరిన్ని వివరాలు వెల్లడించారు. ఇది పోలీసులకు, ప్రజాసేవలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో నేరస్థుల వివరాలు ఏ రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్రానికే పరిమితమయ్యేవని, ఏదైనా నేరగ్యాంగులకు సంబంధించిన ఇతర రాష్ట్రాల నుంచి సమాచారం తీసుకోవాలంటే అక్కడికి వెళ్లి కోరాల్సి వచ్చేదన్నారు. సీసీటీఎన్ఎస్ విధానం అమలులోకి రావడంతో పాత ఇబ్బందులు పోయాయన్నారు. సీసీటీఎన్ఎస్‌లో నేరగాళ్ల చరిత్ర, ఫోటోలు, ఎఫ్‌ఐఆర్ కాపీలు, ఇతరత్రా సమాచారం పొందుపరుస్తున్నామన్నారు. ఒక్క క్లిక్‌తోనే ఎక్కడి సమాచారమైనా పొందవచ్చునని తెలిపారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టుకు అదనపు డీజీపీ రవిగుప్తా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.



అన్నిరాష్ట్రాల పోలీస్ వ్యవస్థలపై 'ప్రగతి' పేరుతో సోమవారం ఢిల్లీ నుంచి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ ఇతర ఉన్నతాధికారులు



డోక్లామ్ సంక్షోభం వీలైనంత త్వరలో పరిష్కారమవుతుంది. నేను పొరుగు దేశాలకు చెప్పదల్చుకున్నదొకటే. భారత్ ఎవరితోనూ ఘర్షణ పెట్టుకోవడానికి ప్రయత్నించదు. దీన్ని పొరుగు దేశాలు కూడా పాటిస్తాయని ఆశిస్తున్నాను. చైనా ఈ విషయంలో తగు పరిష్కారం కనుగొంటుందని ఆశిస్తున్నాను.


రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర మంత్రి

తమిళనాడులో ఏఐఏడీఎంకే రెండు గ్రూపులు కలిసిపోయే నాటకం రసవత్తరంగా నడిచింది. మనం ఇప్పటిదాకా గాంధీ టోపీ, కాశాయ టోపీ, కశ్మీర్ టోపీ చూశాం. ఇప్పుడు అవినీతిలో కూరుకుపోయిన తమిళ నేతలు ప్రజలకు బఫూన్ కుచ్చుటోపీలు పెడుతున్నారు.



కమల్ హాసన్, ప్రముఖ నటుడు

చరిత్రలో నేడు



1639

స్థానిక పాలకుల నుంచి మద్రాస్‌ను స్వాధీనం చేసుకున్న బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ.

1762



అమెరికాలో మొదటి సారి ఓ న్యూస్ పేపర్‌కు మహిళా ఎడిటర్ అయిన అన్నా ఫ్రాంక్లిన్.



1932

టీవీ ప్రసారాలను ప్రారంభించిన బీబీసీ.

అమెరికా అధ్యక్ష భవనంలో మునుపెన్నడూ లేనంత స్థాయిలో ముసలం పుట్టింది. ట్రంప్ విధానాలతో విసిగిపోయిన, వ్యతిరేకిస్తున్న వారు ఒక్కొక్కరు వైట్‌హౌజ్ నుంచి నిష్క్రమిస్తున్నారు. వైట్ హౌజ్ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్ ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ పదవి నుంచి తప్పుకోవటంతో పెద్ద దుమారమే రేగుతున్నది. జాత్యహంకారాన్నీ, స్వయంరక్షణ విధానాలనూ మాట్లాడుతున్న ట్రంప్ ప్రపంచీకరణ పరిణామాలను ఎలా ఎదుర్కొంటారని నిలదీస్తున్నారు. ఈ మధ్య జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఇరువర్గాలదీ తప్పేనన్నట్లు మాట్లాడిన ట్రంప్‌పై తీవ్రవిమర్శలు వస్తున్నాయి. సరిగ్గా ఇదే తరహాలో మోదీ కూడా గో రక్షకుల విషయంలో వ్యవహరిస్తున్నారు. ఇకనైనా ట్రంప్‌కు ఎదురవుతున్న అనుభవాల నుంచి మోదీ పాఠాలు నేర్చుకోవాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

మహాకూటమితో తెగతెంపులు చేసుకున్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కు మార్ ఇంట గెలిచాడు. ఎమ్మెల్యేలందరినీ తన వెంటే నిలుపుకున్నాడు. కానీ జాతీయస్థాయిలో శరద్‌యాదవ్ ఎదురుతిరిగి నితిశ్ నిర్ణయాన్ని వ్యతిరేకించటం నితిశ్‌కు ఊహించని పరిణామమే. ఎన్డీయేలో చేరి ఎంపీలకు కేంద్ర మంత్రి పదవులు ఇప్పించి వారినీ తన వెంట నిలుపుకుంటే రచ్చ కూడా గెలిచినట్లే.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కొత్వాల్ స్ఫూర్తి

రాజాబహద్దుర్ వేంకటరామారెడ్డి జయంతి, రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ సరికొత్త రెడ్డి హాస్టల్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చరిత్రలో అబ్బుర ఘట్టంగా నిలిచిపోతుంది. నాడు హైదరాబాద్ రాజ్యంలో సాగిన విద్యావికాసంలో రెడ్డి హాస్టల్ స్థాపన ఒక మైలురాయి. విద్యాభివృద్ధిలో నిరుపమాన పాత్రను నిర్వహించిన రెడ్డి హాస్టల్ సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ, ఉద్యమాలకు ఆయువు పట్టుగా నిలిచింది. రెడ్డి హాస్టల్ విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పదెకరాల స్థలం కేటాయించి పది కోట్ల రూపాయల నిధులు అందించడం, ఆ మహనీయుడు రాజాబహద్దుర్ వేంకటరామారెడ్డి సేవాతత్పరతకు సముచితమైన నివాళి. ఈ భవన సముదాయంలో భాగంగా బాల బాలికల వసతి గ్రహాలు, ఉద్యోగార్థుల బోధనా కేంద్రం, సమావేశ మందిరా లు, క్రీడా విభాగంతోపాటు వ్యవసాయ క్షేత్ర నిర్మాణాలు చేపట్టడం వేంకటరామారెడ్డి స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ చారిత్రక దృక్కోణాన్ని, బంగారు తెలంగాణ లక్ష్యాన్ని వెల్లడిస్తున్నది.

కార్యశీలియైన ఉన్నతాధికారిగా, సాహిత్య పోషకుడిగా, సంఘసేవకుడిగా విభిన్న బాధ్యతలు నిర్వహిస్తూ, తెలంగాణ పౌరసౌధానికి మూలస్తంభంగా నిలిచిన ఘనత కొత్వాల్‌కు చెందుతుంది. సురవరం ప్రతాపరెడ్డి వంటి సాహితీవేత్త మొదలుకొని అనేకమంది కవులు, కళాకారులు, ఉద్యమకారుల గురించి గొప్పగా చెప్పుకుంటాం. కానీ వీరందరికి తోడ్పాటు అందించిన పెద్ద దిక్కు వేంకటరామారెడ్డి. నిజాం ప్రభుత్వంలో కొత్వాల్ (హైదరాబాదు నగర పోలీసు కమిషనర్)గా ఉంటూనే కాంగ్రెస్, కమ్యూనిస్టు, విద్యార్థి ఉద్యమకారులతో సత్సంబంధాలు నెలకొల్పుకొని సలహాలు ఇచ్చేవారాయన. ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోతున్న సందర్భంలో ఇరు వర్గాలతో సంప్రదింపులు జరిపి ఉద్యమ ఐక్యతను కాపాడటానికి చివరి క్షణం వరకు ప్రయత్నించారు. ఖిలాఫత్, సహాయ నిరాకరణ వంటి ఉద్యమాలు హైదరాబాద్ రాజ్యంపై ప్రభావం చూపినప్పుడు అత్యంత నేర్పుతో వ్యవహరించారు. వందేమాతరం ఉద్యమం సాగుతున్నప్పుడు, ఆ తరువాత విద్యార్థులకు అడుగడుగునా సలహాలు అందించారు. ఉద్యమాలు అదుపు తప్పకుండా, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకుండా ఇరువర్గాలకు వారధిగా వ్యవహరించేవారు. అప్పటివరకు కొత్వాల్ అంటే చండశాసనుడనే అభిప్రాయం ఉండేది. సామాన్య ప్రజలు ఎదురు రావడానికి భయపడేవారు. కానీ వేంకటరామారెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత, ప్రజల విన్నపాలు వినడం మొదలైంది. పోలీసు శాఖలో సంస్కరణల యుగం ప్రారంభమైంది. కొత్వాల్‌గానే కాకుండా న్యాయ, పౌరపాలన అధికారాలు కూడా ఉన్నప్పటికీ, ఆయన పెత్తనం చలాయించకుండా, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించేవారు. వేంకటరామారెడ్డి 1934 నుంచి కొత్వాల్‌గా పధ్నాలుగేండ్ల విధి నిర్వహణ నేటి ప్రభుత్వాధికారులకు, ప్రత్యేకించి పోలీసు అధికారులకు పాఠ్యాంశంగా పనికివస్తుంది.

> **వేంకటరామారెడ్డి స్థాపించిన విద్యాసంస్థలలో చదువుకున్న వారే, రెడ్డి హాస్టల్‌లో ఉండి సామాజిక ఉద్యమాలలో ఓనమాలు దిద్దుకున్న వారే ఆ తరువాత కాలంలో- తెలంగాణ సమాజం ఆధునిక యుగంలో ప్రవేశించే దశలో - భిన్నరంగాలలో సమాజానికి మార్గదర్శకులయ్యారు. ఇప్పుడు తెలంగాణ సమాజం దాదాపు ఆరు దశాబ్దాల పరాయి పాలన నుంచి విముక్తి పొంది ప్రగతి దారిలో పయనిస్తున్నది. ఈ సందర్భంలో వేంకటరామారెడ్డి వంటి వైతాళికులు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం.**

తెలంగాణ సాహితీ వనానికి నీరందించడమైనా, విద్యా పరిమళాలు విస్తరింప చేయడంలోనైనా, ఉన్నతాధికారిగా సామాజిక బాధ్యత నిర్వహించడంలోనైనా తెలంగాణ వికాస చరిత్రలో విస్మరింపజాలని మహోన్నతుడు కొత్వాల్ రాజాబహద్దుర్ వేంకటరామారెడ్డి. గోలకొండ పత్రికను వెలిగించి ఎప్పటికప్పుడు తైలం సమకూర్చడంలో ఆయన కృషి దాగి ఉన్నది. వివాహాది కార్యాలకు ముందు వెనుక చూడకుండా డబ్బు వెచ్చించే రెడ్డి రాజులు, జమీందారులు, ఇతర ధనికులు ఇకముందు రెడ్డి విద్యార్థులు చదువుకోవడానికి తోడ్పడాలంటూ ఒప్పించి రెడ్డి హాస్టల్‌ను స్థాపించారు. ఇందులో ఇతర కులస్తులకూ ప్రవేశం ఉండేది. రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో ఆనాడే పదకొండు వేల గ్రంథాలు ఉండటం ఆశ్చర్యకరం. విద్యార్థుల సంపూర్ణ వికాసం పట్ల ఆసక్తి చూపేవారు. రెడ్డి బాలికల ఉన్నత పాఠశాల, వసతి గృహంతో పాటు ఇతర పాఠశాలలను కూడా పోషించారు. ఆంధ్ర విద్యాలయం ఏర్పాటులోని ప్రధాన పాత్ర వేంకటరామారెడ్డి గారిదే. స్త్రీల కోసం క్లబ్ ఏర్పాటు చేయించారు. అనాథ పిల్లలు ధనికుల ఇండ్లలో కట్టుబానిసలుగా మారకుండా ఉత్తర్వులు జారీ చేయించి ఆదుకున్నారు. బాల్యవివాహాలను నిరోధించడానికి, వితంతు వివాహాలను ప్రోత్సహించడానికి చట్టం చేయించారు. వేంకటరామారెడ్డి స్థాపించిన విద్యాసంస్థలలో చదువుకున్న వారే, రెడ్డి హాస్టల్‌లో ఉండి సామాజిక ఉద్యమాలలో ఓనమాలు దిద్దుకున్న వారే ఆ తరువాత కాలంలో–తెలంగాణ సమాజం ఆధునిక యుగంలో ప్రవేశించే దశలో – భిన్నరంగాలలో సమాజానికి మార్గదర్శకులయ్యారు. ఇప్పుడు తెలంగాణ సమాజం దాదాపు ఆరు దశాబ్దాల పరాయి పాలన నుంచి విముక్తి పొంది ప్రగతి దారిలో పయనిస్తున్నది. ఈ సందర్భంలో వేంకటరామారెడ్డి వంటి వైతాళికులు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం. విద్యారంగంతో పాటు అన్ని రంగాలలో పురోగతి సాధించడానికి, భిన్న సామాజిక వర్గాల ఐక్యతకు ఆయన జీవితం మార్గదర్శనం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వైతాళికులను స్మరించుకోవడం అభినందనీయం.

విద్య



డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి

కార్పొరేట్ కాలేజీలకు కళ్లెం

ఇంటర్ విద్యా వ్యవస్థలో తమ విద్యా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకొని ఇంటర్ బోర్డు అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వరకు ఎవరినైనా దారికి తెచ్చుకోగలమనే పద్ధతిలో వ్యవహరిస్తున్న జంట కార్పొరేట్ విద్యాసంస్థలకు తెలంగాణ సర్కారు బుద్ధి చెప్పింది. శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థల మెడలు వంచి అక్షరాల రెండు కోట్ల పదిహేడు లక్షల జరిమానాను వసూలు చేసింది. ఇది ఇంటర్ బోర్డు చరిత్రలో ఒక అరుదైన రికార్డు.

టీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు జరిపిన సాధారణ పరిపాలన శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని 29 కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి సెప్టెంబర్ 2015 లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందించటంతో పాటు ఇంటర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించిన శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలపైన భారీ మొత్తంలో జరిమానాలను విధించాలని ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ప్రధానంగా ఇంటర్ బోర్డు ఆదేశాలతో నిమిత్తం లేకుండా అడ్మిషన్స్ ప్రక్రియను ప్రారంభించడం, పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే కళాశాలలను ప్రారంభించడం, ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి కళాశాలలను యథేచ్ఛగా తరలించడం, విద్యాసంస్థల్లో అనుసరించవలసిన రిజర్వేషన్లను పాటించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రాజ్యాంగపరమైన హక్కులను యథేచ్ఛగా తిరస్కరించడం ప్రధానమైన ఆరోపణలు. వీటితోపాటు ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం వసూలు చేయవలసిన ఫీజులను ఏ మాత్రం పట్టించుకోకుండా లక్షల్లో ఎలాంటి ప్రాతిపదిక లేకుండా ఫీజులు వసూలు చేయడం విజిలెన్స్ అధికారుల దృష్టికి వచ్చింది.

కళాశాలలు నడుపడానికి ఏ మాత్రం అనువుకాని వాణిజ్య భవన సముదాయాల్లో కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహణ తీరు విజిలెన్స్ అధికారులకు విస్మయాన్ని కలిగించింది. ఈ భవనాలకు ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం ఉండవలసిన అగ్నిమాపక శాఖ అనుమతులు గాని భవనం సురక్షితం పైన మున్సిపల్ అధికారుల ధృవీకరణ పత్రాలు గాని పొందకుండానే ఏండ్ల తరబడి నెట్టుకొస్తున్న ఈ యాజమాన్యాల భరితెగింపును విజిలెన్స్ నివేదిక ఎండగట్టింది. ఇంటర్ విద్యలో కళాశాలల నిర్వహణ పైన అనుసరించాల్సిన నిబంధనలపైన ఇంటర్ విద్యా మండలి నిర్ణయాలు అనుబంధ గుర్తింపు పొందిన ప్రతి కళాశాలకు శిరోధార్యం కావాలి. కాని ఇవేవి పట్టించుకోకుండా ఈ విద్యా సంస్థలు ఏండ్లుగా ఇంటర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. గుర్తింపు పొందిన ప్రతి జూనియర్ కళాశాలలో కనీసం రెండు సెక్షన్లు ఆర్ట్స్, కామర్స్ విభాగాలుండాలని బోర్డు నిబంధనలున్నా వాటిని ఉల్లంఘించి ఏ కళాశాలలో కూడా ఆర్ట్స్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించని విషయాన్ని విజిలెన్స్ నివేదక బహిర్గతం చేసింది. అనుమతులు లేకుండా కళాశాలను ప్రారంభించి ఇంటర్ బోర్డు పర్యవేక్షణను తప్పించుకోవడానికి అకాడమీల పేరుతో అక్రమ విద్యాసంస్థలను నడుపడం విజిలెన్స్ నివేదక తప్పుబపట్టింది.

పైకి ఐఐటీ, ఏఐఈఈఈ, ఎంసెట్ కోచింగ్ కేంద్రాలుగా చలామణి అవుతున్న రెండేండ్ల ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అక్రమంగా చేర్చుకొని బినామీ కళాశాలల ద్వారా ఆ విద్యార్థులకు ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయాన్ని విజిలెన్స్ నివేదిక భయటపెట్టింది. రెండేండ్ల ఇంటర్మీడియట్ విద్య కోర్సు పేరుతో భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయలేమన్న దురుద్దేశంతో వాటికి ఐఐటీ, ఏఐఈఈఈ, ఎంసెట్ల పేరుతో టాగ్‌లు తగిలించి లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేయడాన్ని విజిలెన్స్ నివేదిక బయటపెట్టింది. కళాశాలలన్నింటిలో విధిగా ఉండాల్సిన ఆట స్థలాలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఈ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎక్కడా కనిపించలేదని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం కోటి అరువై లక్షల రూపాయల జరిమానాను విధించాలని విజిలెన్స్ విభాగం సూచించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇంటర్ విద్యాశాఖల ద్వారా ఆయా కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. గత అనుభవాల ప్రకారమే ఈ రెండు కార్పొరేట్ విద్యాసంస్థలు విజిలెన్స్ నివేదికను పెద్దగా పట్టించుకోలేదు.

గతంలో ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఈ విద్యాసంస్థలు అనుసరించే పద్ధతులనే ఈ రెండేండ్లలో ప్రదర్శించే ప్రయత్నం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలపైన పలురకాలుగా ఒత్తిడి తేవడానికి ప్రయత్నించాయి. కాని తెలంగాణ ప్రభుత్వం ముందు వీరి ఆటలు సాగలేదు. చేసేదేం లేక విజిలెన్స్ విభాగం నివేదిక ప్రకారం విధించిన జరిమానా చెల్లించడంతోపాటు ఆయా సందర్భాల్లో బోర్డుకు చెల్లించాల్సిన పాత జరిమానాలను కూడా కలిపి రెండు కోట్ల పదిహేడు లక్షల రూపాయల జరిమానాను రెండు కార్పొరేట్ విద్యాసంస్థలు చెల్లించాయి. ఏడాదికి మూడు వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించే ఈ కార్పొరేట్ విద్యా సంస్థలకు ఈ జరిమాన భారీ మొత్తం కాకపోవచ్చు. కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలకు ఈ జరిమానా సమానం కాకపోవచ్చు, కానీ కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్న రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన ఆలోచనకు ఈ జరిమానా ఒక సంకేతం.

> **రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపైన ఒక సమగ్ర అధ్యయన ప్రణాళిక ద్వారా ద్విముఖ వ్యూహం ద్వారా ముందుకెళ్తున్నది. ఒకవైపు కార్పొరే ట్ విద్యాసంస్థలపైన నియంత్రణ విధిస్తూనే మరోవైపు దీర్ఘకాలిక వ్యూహంతో కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మెరుగైన సొంత విద్యావ్యవస్థల రూపకల్పనకు శ్రీకారంచుట్టింది.**

గతంలో కార్పొరేట్ కళాశాలల అక్రమాలను ప్రశ్నించే అనేకమంది అధికారులు వీరి పలుకుబడికి బలి పశువులయ్యారు. గతంలో ముక్కుసూటిగా వ్యవహరించే ఓ ఐఏఎస్ అధికారి ఇప్పటి విజిలెన్స్ నివేదిక మాదిరిగానే ఈ జంట కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలపై సమగ్ర నివేదిక రూపొందించి భారీ మొత్తంలో జరిమానాలు విధించడానికి ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయపరంగా ఒత్తిడి తెచ్చి జరిమానాలు చెల్లించకుండా సకల ప్రయత్నాలు చేశారు. ఆ అధికారి నిబద్ధతపై నమ్మకం ఉన్న నాటి ముఖ్యమంత్రి కూడా అధికారికి బాసటగా నిలిచారు. కానీ మూడు రోజులు తిరుగకుండానే ఢిల్లీ ఆదేశాలతో ఆ అధికారి బదిలీ ఉత్తర్వులు అందుకోకతప్పలేదు. ఇది కార్పొరేట్ విద్యాసంస్థల గత చరిత్ర. ఈ చర్య ఇంటర్ విద్యపైన ఈ కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యాన్ని, రాజకీయ పలుకుబడిని తెలియజెప్పడమే కాకుండా ఇంటర్ విద్యలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న అధికారుల ఆత్మస్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో ఇంటర్ విద్యలో పనిచేసే అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థల వ్యవహారాల్లో చర్యలకు ఉపక్రమించే సందర్భంలో ఆచితూచి వ్యవహరించే పద్ధతిలో ముందుకెళ్ళాలనే ఆలోచనా ధోరణితో పనిచేయడం ప్రారంభించారు.

కార్పొరేట్ విద్యాసంస్థల అఘాయిత్యాలకు బలైన అనేకమంది తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వ ఆలోచనావిధానాన్ని ప్రశంసిస్తున్నారు. గతంలో ఆత్మహత్యల పరంపర కొనసాగిన సందర్భంలో ప్రభుత్వం నియమించిన నీరదారెడ్డి కమిటీ నివేదికను వెలికితీసి కమిటీ సిఫార్సులను బహిర్గతంచేసి అమలు పరుచాలి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరిగే ప్రతి ఆత్మహత్యకు ఈ విద్యాసంస్థలను బాధ్యులుగా చేసే కఠినతరమైన నిబంధనలను అమలుపరచి క్రిమినల్ చర్యలు తీసుకునేవిధంగా చట్టాలను సవరించాలి. ఇంటర్ విద్యలో ఫీజులకు సంబంధించిన నియమ నిబంధనలు కఠినతరంగా లేకపోవడంతో ఈ కళాశాలల ఇష్టారాజ్య దోపిడీకి అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఇంజినీరింగ్, ఇతర సాంకేతిక విద్యాసంస్థల మాదిరిగానే ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటుచేసి సమగ్ర ఫీజుల విధానాన్ని రూపొందించాలి. రెసిడెన్షియల్ కళాశాలల పేరిట అక్రమంగా నిర్వహిస్తున్న కళాశాలలన్నింటిని నియంత్రించడానికి ఒక ప్రత్యేక రెగ్యులేటరీ అథారిటీని నియమించి రెసిడెన్షియల్ కళాశాలల్లో భవన సముదాయం, వసతులు, విద్యార్థినీ విద్యార్థుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు, భోజనం, వసతి ఏర్పాటులో నిర్దిష్ట ప్రమాణాలు నిర్దేశించే విధంగా మార్గదర్శకాలు రూపొందించాలి.

రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపైన ఒక సమగ్ర అధ్యయన ప్రణాళిక ద్వారా ద్విముఖ వ్యూహం ద్వారా ముందుకెళ్తున్నది. ఒకవైపు కార్పొరేట్ విద్యాసంస్థలపైన నియంత్రణ విధిస్తూనే మరోవైపు దీర్ఘకాలిక వ్యూహంతో కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మెరుగైన సొంత విద్యావ్యవస్థల రూపకల్పనకు శ్రీకారంచుట్టింది. ఈ మూడేండ్ల కాలంలో 500 పైచిలుకు గురుకుల విద్యాసంస్థలను నెలకొల్పి రాబోయే రోజుల్లో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేసే దిశగా ముందుకెళ్తున్నది. ఈ దిశగా కార్పొరేట్ విద్యాసంస్థల మెడలు వంచి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్న సంకేతం పంపారు. తెలంగాణ ప్రభుత్వాన్ని 25 ఏండ్ల నుంచి ఈ కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలపై గొంతెత్తిన అనేకమంది విద్యార్థుల ఈ విద్యాసంస్థల మోసానికి గురైన తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు.

మన 'కులం' తెలంగాణ

తెలంగాణం



సందీప్ రెడ్డి కొత్తపల్లి

ఆంధ్రాలో ఏ ఇంటికి వెళ్లినా ముందు కులం అడుగుతారు. తెలంగాణలో ఏ ఇంటికి వెళ్లినా ముందు ఏమయినా తాగుతావా, తింటావా అని అడుగుతారని ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ అన్న మాటలు ఫేస్‌బుక్‌లో పోస్టు పెడితే ఆంధ్రా అనంతపురం జిల్లాకు చెందిన నర్సింహ అనే మిత్రుడు 'ఏమన్నా మా ఊరికి వస్తే ఏమన్న మర్యాద తక్కువ చేశామా' అని కాల్ చేశాడు. 'తమ్ముడు పోస్టును తప్పుగా అర్థం చేసుకున్నావు. ఆంధ్రాలో కులాల ప్రస్తావన ఉంటుంది, తెలంగాణలో ఉండదని చెప్పడమే నా ఉద్దేశం' అన్నా. అవునన్నా, నీవు పెట్టింది నిజమే. నర్సింహ్మ పదో తరగతి తర్వాత హైదరాబాద్‌లో సర్వేయర్ మూడు నెలలు ట్రైనింగ్ చేసి ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. 'అన్నా ప్రస్తుతం నేను తెలంగాణలోని మిడ్ మానేరులో పనిచేస్తున్నా. ఆదిలాబాద్ మినహా అన్ని ఊర్లు తిరిగా నువ్వు చెప్పినట్టు ఎక్కడికి వెళ్లినా ఏమయినా తింటావా? ఏమయినా తాగుతావా అని అడుగుతారని' చెప్పాడు.

పనిలోపనిగా 'అన్నా మా కంపెనీ మిడ్‌మానేరులో పనిచేసున్నది. ఓ వార్త రాయకూడదు' అన్నాడు. 'ఏం రాయాలి? ఏం జరుగుతుంది? ఏం గమనించావ్ మిడ్ మానేరు పనుల్లో' అడిగా. 'గతంలో పనిచేసిన ఐవీఆర్ సీఎల్ కంపెనీ ప్రభుత్వ సహకారం లేకపోవడంతో చేతులెత్తేసింది. నిధులివ్వరు, మెటీరియల్ వ్యయం పెరిగిపోయింది. నాణ్యతలేని పనుల మూలంగా కట్టతెగి పదివేల ఎకరాలు మునిగింది. దీంతో ఆ కంపెనీ చేతులెత్తేసింది. ఇప్పుడు మా సంస్థకు పని వచ్చింది. వారంలో ఆరు రోజులు ఎస్ఈ, డీఈలు 24 గంటలు ఇక్కడే ఉండి పనిచేయించుకుంటున్నారు. గతంలో ప్రభుత్వం పట్టించుకునేది కాదు, నిధులిచ్చేది కాదు, ప్రజా ప్రతినిధులు ప్రాజెక్టు వైపు ముఖం చూపేవారు కాదు. ఇప్పుడు డ్యాంలో 2 నుంచి 3 టీఎంసీల నీళ్లున్నాయి. ఈ నెలాఖరు, వచ్చేనెలకు ఆరు లేదా ఏడు టీఎంసీల నీళ్లు రావచ్చు. ప్రాజెక్టు పూర్తయితే 24 టీఎంసీల నీళ్లు నిల్వ చేసుకోవచ్చు. ఈ డిసెంబర్‌కు ప్రాజెక్టు పూర్తవుతుంది. తెలంగాణలో మొదట పూర్తయ్యే ప్రాజెక్టు ఇదే'నని చెప్పాడు. అనంతపురానికి చెందిన 24 ఏళ్ల నర్సింహ్మ తెలంగాణ ప్రాజెక్టు గురించి ఇంత విపులంగా చెప్పేసరికి తెలంగాణ మేధావులంతా కళ్లముందు మెదిలారు. ప్రాజెక్టులో సర్వే ఇంజినీర్‌గా పనిచేసే నర్సింహ్మకు ఉన్న తెలివి మన మేధావులు, నాయకులకు ఎందుకు లేకపాయెనని బాధేసింది.

ప్రత్యేక తెలంగాణ అనేది 60 ఏండ్ల ఆరాటం. నాలుగు కోట్ల గుండెల ఆకాంక్ష. వేల త్యాగాలు, వందల బలిదానాల ఫలితం, తెలంగాణ సమాజంలో ఆంధ్రాతో పోల్చుకుంటే ఉన్న ప్రాధాన్యం చాలా తక్కువ. ఇక ఉద్యమంలో అన్ని కులాలు, వర్గాలు, మతాల ప్రజలు పార్టీలకతీతంగా ఉద్యమంలో పాల్గొన్నారు. 2001 నుంచి 2012 వరకు తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ అనేకసార్లు రాజీనామాలు చేసి, చేయించి ఎన్నికలకు వెళ్లి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాకాంక్షను దేశానికి చాటారు.

ప్రజల మనసును అర్థం చేసుకున్న కేసీఆర్ టీఆర్ఎస్ జెండాను పక్కనబెట్టి జేఏసీ జెండాను ముందుపెట్టి తెలంగాణ ఉద్యమంలో ప్రజలను మమేకం చేశారు. పార్టీలవారీగా విడిపోతే తెలంగాణ అంశం బలహీనపడుతుందని, తెలంగాణ వచ్చేవరకు జెండాలు పక్కన పెడుదామని, తెలంగాణ వచ్చాక ఎవరికి ఇష్టం ఉన్న జెండా వారు ఎత్తుకుందామని పిలుపునిచ్చారు. కేసీఆర్ జేఏసీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. జేఏసీ రథానికి అంగ, అర్థ బలాలు సమకూర్చి, ఉద్యమకారులు వెన్నంటి నిలిచి టీఆర్ఎస్ పార్టీ ఉద్యమం ముందుకుతీసుకెళ్లింది. మొహమాటానికి మొదట జేఏసీలో చేరిన కాంగ్రెస్ అధిష్ఠానం పేరుచెప్పి హ్యాండిచ్చింది. టీడీపీ సొంత కార్యక్రమాలతో తెలంగాణలో ఉద్యమాన్ని హింసవైపు మళ్లించేందుకు ప్రయత్నించింది. ఉద్యమంలో సీపీఎం అడ్రస్ లేదు. జేఏసీ జెండా నీడన ఆ రోజు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అన్నికులాలు, అన్నిమతాలు తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి చాటాయి. గౌండ్లు, విశ్వబ్రాహ్మణులు, మంగలి, సగరులు (ఉప్పర), ముదిరాజ్, చాకలి, మాల, మాదిగ, ఆర్యవైశ్యులు ఇలా సకల కులాలు సకల జనుల సమ్మె నడిచినన్ని దినాలు ఒక్కో కులం ఒక్కోరోజు వంతులు వేసుకొని మరీ టెంట్ల కిందికి చేరి తెలంగాణ ఉద్యమంలో మేము సైతం అంటూ తమ వంతు పాత్ర పోషించారు.

> **తెలంగాణ ఉద్యమంలో నాలుగు కోట్ల గుండెల్లో తెలంగాణ దీపం వెలిగింది. ఇంకా దీపం వెలుగుతూనే ఉన్నది. అది ఆరిపోయిన నాడే కులం అనే దీపం వెలుగుతుంది. అది ఆరదు కాబట్టి దీనికి ఇప్పట్లో ఇక్కడ స్థానం లేదు, ఉండబోదు.**

ఇక తెలంగాణలో గత మూడేండ్లుగా ఎంత అభివృద్ధి జరిగింది? ఎలాంటి పాలన కొనసాగుతున్నది? అన్నది తెలంగాణ అంటే విషం కక్కే ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ భాగస్వామిగా ఉన్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన అనేక అవార్డులు, రివార్డులే చెబుతాయి. ఇక తెలంగాణ సీఎం కేసీఆర్ ఎలా పనిచేస్తున్నారన్నది అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు తెలియజేస్తుంది.

తెలంగాణ వస్తే రాష్ట్రం కరెంటు కోతలతో చీకటవుతుందన్న నేత రాష్ట్రం ఏర్పడిన తర్వాత మళ్లీ నోరు తెరువలేదు. ఆయన రాజకీయ జీవితం ఇప్పట్లో చీకటి నుంచి తేరుకునేలా లేదు. 2014 వరకు కరెంటు కోతలతో అల్లాడిన జనం 24 గంటల కరెంటును చూసి ఆశ్చర్యపోతున్నారు. వ్యవసాయం చేద్దామంటే ఎప్పుడు కరెంటు వస్తుందో తెలియక రాత్రిపూట కావలి వెళ్లి పాముకాట్లకు, కరెంటు షాకులకు గురై ప్రాణాలు కోల్పోయింది. నేడు 24 గంటల కరెంటు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నది.

ఉన్న ఊర్లో ఉపాధి లేక వలసవెళ్లిన జనం నాలుగు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి కొద్ది మొత్తానికి నీళ్లు ఇస్తేనే ఊర్లకు మళ్లీ వ్యవసాయం బాటపట్టారు. ఇక కేసీఆర్ ప్రకటించిన కోటి ఎకరాలకు సాగునీరు పూర్తయితే తెలంగాణ దేశంలోనే సస్యశ్యామల రాష్ట్రంగా మారుతుందనడంలో సందేహం లేదు. ఓ కాళేశ్వరం, మరోవైపు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఇంకోవైపు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం తెలంగాణ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు శరవేగంగా పరుగులు పెడుతున్నాయి.

రైతులకు నీళ్లు ఇస్తే వాళ్ల పని వాళ్లు చేసుకుంటారు. ఇక గ్రామాల్లో ఉండే కులవృత్తిదారులను ఆదుకునేందుకు మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలు, గొల్లకుర్మలకు గొర్ల పంపిణీ పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలనే మార్చనున్నాయి. సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిన విద్య, వైద్యాన్ని కేసీఆర్ ఇప్పుడు అందుబాటులోకి తెచ్చారు. గత మూడేండ్లలో ప్రారంభించిన గురుకుల పాఠశాలలు తెలంగాణలో రాబోయే చైతన్యానికి ప్రతీకలు. సర్కారు దవాఖాన అంటేనే భయపడే పేదలు ఇప్పుడు సర్కారు దవాఖానల బాటపట్టారు. రాష్ట్రంలోని అన్ని కులాలు, మతాలు ఆర్థిక పునరుజ్జీవనం దిశగా అడుగులు వేస్తున్నాయి.

సమైక్య పాలనలో నీళ్లు, నిధులు దారిమళ్లాయి తెలంగాణలోని సబ్బండ కులాలు ఉపాధి కోల్పోయాయి. తెలంగాణ ఉద్యమంలో కుల, మతాలకతీతంగా తెలంగాణ సమాజం ఒక్క తాటిమీద నిలబడి రాష్ట్రాన్ని సాధించుకున్నది. ఇప్పుడు తెలంగాణను తననుతాను సరికొత్తగా ఆవిష్కరించుకునే అభివృద్ధి పథం వైపు నడుస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో నాలుగు కోట్ల గుండెల్లో తెలంగాణ దీపం వెలిగింది. ఇంకా దీపం వెలుగుతూనే ఉన్నది. అది ఆరిపోయిన నాడే కులం అనే దీపం వెలుగుతుంది. అది ఆరదు కాబట్టి దీనికి ఇప్పట్లో ఇక్కడ స్థానం లేదు, ఉండబోదు.

జనగళం

పేపర్లలో ప్రచురించాలి

ఈ మధ్య ఎంసెట్, ఇతర ప్రవేశ పరీక్షల సమాచారం, ఫలితాలు, సీట్ల కేటాయింపులాంటి వివరాలన్నీ నెట్‌లోనే పెడుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, వెబ్‌సైట్‌పై అవగాహన లేనివారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంసెట్, నీట్‌పై ఆధారపడిన సైన్స్ విద్యార్థులు అగ్రికల్చర్, ఆయుష్ స్ట్రీం కౌన్సిలింగ్ ఎప్పుడు ఉంటుందో తెలియక నష్టపోతున్నారు. కాబట్టి వీటి అడ్మిషన్ల ప్రక్రియపై సవివరంగా పత్రికల్లో ప్రకటనలు విడుదల చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కారంపురి శాలినీ, హుస్నాబాద్, సిద్దిపేట

సీజనల్ వ్యాధులను ఎదుర్కోవాలె

వానకాలం మొదలుకాగానే సీజనల్ వ్యాధులు భయపెడుతాయి. అనుకున్నట్లుగానే ఈసారి స్వైన్ ఫ్లూ వ్యాధి విజృంభిస్తున్నది. ఇప్పటికే ఐదారుమంది స్వైన్‌ఫ్లూతో దవాఖాన పాలయ్యారు. స్వైన్ ఫ్లూ వ్యాప్తిచెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రాంతీయ దవాఖానలలో నివారణ మందులు అందుబాటులో ఉంచాలి.

- జంపాల అంజయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా

హర్షణీయం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామం యూనిట్‌గా తీసుకొని కచ్చితమైన భూముల లెక్కలు తీయటానికి పూనుకోవటం చరిత్రాత్మకం. గ్రామాల్లో సాదా బైనామాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు పాసు పుస్తకాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే భూముల సర్వే రావటం మంచిది. బైనామాలు త్వరగా పూర్తిచేసి సమగ్ర భూ సర్వే చేయాలి.

- అరికిల్ల ప్రభాకర్, మైలారం, శాయంపేట

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఇకపై వైద్యం కూడా 'భరోసా'లోనే

- అఘాయిత్యాలకు గురయ్యే బాధితులకు మరింత వేగంగా వైద్య సేవలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆపదలో ఉన్న మహిళలకు మేమున్నామని భరోసా ఇస్తున్న 'హైదరాబాద్ భరోసా' కేంద్రంలో ఇక నుంచి వైద్య సేవలు కూడా అందించనున్నారు. అఘాయిత్యాలకు గురయ్యే మహిళలు, పిల్లలను అక్కున చేర్చుకొని వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ భరోసా కేంద్రం సేవలు అందిస్తున్నది. లైంగిక దాడులు, పోక్సో కేసులలో బాధితులకు భరోసా కేంద్రంలో అత్యవసర సేవలు అందిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదయిన ఇలాంటి కేసుల్లోని బాధితులను పోలీసులు భరోసా కేంద్రానికి పంపిస్తారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని భరోసా కేంద్ర సిబ్బంది అందజేస్తారు. అఘాయిత్యాలకు గురై తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉండే బాధితుల్లో ఆత్మస్థైర్యాన్ని తట్టి లేపి, వాళ్ల కాళ్లపై వారు నిలబడేలా అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తారు. న్యాయపరమైన సేవలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు సేవలు కూడా అక్కడే అందిస్తారు. బాధితులకు అవసరమైన వైద్య సేవలను ఇప్పటి వరకు భరోసా కేంద్రం నుంచి దవాఖానకు తీసి కెళ్తున్నారు. ఇకపై వైద్యులే భరోసా కేంద్రానికి వచ్చి బాధితులకు వైద్య సేవలు అందించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని షీ టీమ్స్ ఇన్‌చార్జి, నగర అదనపు పోలీస్ కమిషనర్ స్వాతిలక్రా తెలిపారు. ఇకపై బాధితులకు భరోసా కేంద్రంలోనే వైద్య సేవలు అందించనున్నట్టు ఆమె వివరించారు. బాధితులకు కావాల్సిన న్యాయ, వైద్య సేవలు అందిస్తూ వారికి స్వయం ఉపాధిపై పట్టు సాధించేందుకు పునరావాస కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధితుల ఆసక్తిని బట్టి ఆయా రంగాల్లో శిక్షణ ఇప్పించడం, ఆ తర్వాత వారికి ఉద్యోగాలు, స్వయం ఉపాధికి తగిన సూచనలు, సలహాలు, సహాయాన్ని భరోసా కేంద్రం నుంచి అందిస్తున్నారు.



బంజారా తీజ్ మేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కల్వకుంట్ల కవిత

29న బంజారా తీజ్ మేళా

- రవీంద్రభారతిలో ప్రారంభించనున్న ఎంపీ కల్వకుంట్ల కవిత

ఖైరతాబాద్: గిరిజనులు పవిత్రంగా జరుపుకొనే తీజ్ పండుగ విశిష్టతను విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో ఈ నెల 29న నగరంలోని రవీంద్రభారతిలో బంజారా తీజ్ మేళాను నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కిషన్ సింగ్ తెలిపారు. సోమవారం తీజ్ మేళా, బంజారా కీర్తి పురస్కారాల కార్యక్రమ బ్రోచర్‌ను నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆమె నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్‌సింగ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పాండురంగానాయక్, జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్‌సింగ్, బంజారా సమాచార్ పత్రిక ఎడిటర్ వంశీనాయక్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్రా మోతిలాల్ నాయక్ కార్యక్రమ విశేషాలను వివరించారు. బంజారాల సంస్కృతికి చిహ్నంగా నిలిచే తీజ్ పండుగను తొమ్మిది రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారని, ప్రత్యేకించి తండాల్లో పెండ్లికాని ఆడపిల్లలు ఈ పండుగను వేడుకగా జరుపుకొంటారని తెలిపారు. బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ ఈ తీజ్ మహోత్సవానికి బీజం వేశారని, నాటి నుంచి ఆనవాయితీగా వస్తున్నదన్నారు. ప్రకృతితో ముడిపడిన ఈ పండుగను కాపాడుకోవాల్సిన బాధ్యత బంజారాలందరిపై ఉన్నదన్నారు. 29న మేళాతోపాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి బంజారాకీర్తి పురస్కారాలు అందజేస్తామని, ఇప్పటికే మంత్రి చందూలాల్ చైర్మన్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. www.eventskhoj.com వెబ్‌సైట్‌కు ఈ నెల 24వ తేదీలోగా తమ నామినేషన్లను పంపించాలన్నారు. మేళాకు ఎంపీ కవిత, వాటర్ మెన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన డాక్టర్ రాజేందర్‌సింగ్, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ హాజరవుతారని వివరించారు. సమావేశంలో జుక్కి బాయి, డాక్టర్ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి ఉపశమనం

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కలుషిత జలాల మళ్లింపునకు చర్యలు

రూ.1.88 కోట్లతో డైవర్షన్ చానల్, పర్క్యులేషన్ ట్యాంక్ నిర్మాణం



కలుషిత జలాల మళ్లింపునకు ఏర్పాటు చేసిన కాల్వ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్ పరిసర గ్రామాల ప్రజలకు త్వరలోనే కాలుష్యం నుంచి విముక్తి లభించనున్నది. డంపింగ్‌యార్డ్ నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలు (లీచెట్), వర్షపు నీరు కలుస్తుండడంతో పరిసర గ్రామాల్లోని చెరువులు, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో వ్యర్థ జలాలు వర్షపు నీటితో కలువకుండా జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకున్నది. కలుషిత జలాలను మళ్లించేందుకు డైవర్షన్ చానల్, వాటిని నిల్వ చేసేందుకు పర్క్యులేషన్ ట్యాంక్ (చెరువు) నిర్మించింది. పనులు ఇటీవలే పూర్తవడంతో జవహర్‌నగర్ హరిదాసుపల్లి, చీర్యాల గ్రామాలకు కాలుష్య జలాల నుంచి విముక్తి లభించింది.

రూ.1.88 కోట్లతో పనులు..

2002లో శామీర్‌పేట మండలం జవహర్‌నగర్‌లోని 339 ఎకరాల్లో డంప్‌యార్డ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1.4 కోట్ల టన్నులకు పైగా చెత్త పేరుకున్నది. వర్షాకాలంలో డంపింగ్‌యార్డ్‌లోని కలుషిత పదార్థాలు వాననీటితో కలిసి కాలుష్య కారక జలాలు (లీచెట్)గా మారుతున్నాయి. ఈ నీరు యార్డ్ సమీపంలోని హరిదాసుపల్లి, చీర్యాల తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి చేరడంతోపాటు, భూమిలోకి ఇంకిపోతుండడంతో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. దీంతో గ్రామాల్లో కాలుష్యం పెరిగిపోయింది. కాలుష్యం బారి నుంచి రక్షించాలని కోరుతూ మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నేతృత్వంలో జవహర్‌నగర్ పరిసర గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కలిసి నగర మేయర్ బొంతు రామ్మోహన్‌కు విజ్ఞప్తిచేశారు. దీంతో మేయర్ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డైవర్షన్ చానల్, పర్క్యులేషన్ ట్యాంక్ నిర్మించాలని ప్రతిపాదించడంతో రూ.1.83 కోట్లు కేటాయించారు. దీంతో కాలుష్య జలాలను నేరుగా గుండ్లకమ్మ చెరువుకు మళ్లించడానికి నిర్మాణాలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో పనులు వేగంగా పూర్తయ్యాయి. గత జూన్‌లో అధికారులు ఈ రెండు నిర్మాణాలను ప్రారంభించారు. కలుషిత జలాలను నేరుగా గుండ్లకమ్మ చెరువుకు మళ్లించారు. దీంతో జవహర్‌నగర్, హరిదాసుపల్లి, చీర్యాల తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రొఫెషనల్ బూతు దందా!

'థాయ్ సెక్స్ రాకెట్' కేసులో ఆసక్తికరమైన కోణాలు.. 12 స్పా సెంటర్లలో 'అన్ని' సేవలకు ప్రత్యేక మెనూ

నెల రోజులు నిఘా పెట్టి గుట్టు రట్టు చేసిన పోలీసులు.. స్వయంగా రంగంలోకి దిగిన సైబరాబాద్ సీపీ.. ఆధారాలు సేకరించేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక కిట్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: చేసేది బూతు దందా.. అయినా పక్కా ప్రొఫెషనల్. మసాజ్ నుంచి 'అన్ని' సేవలకూ ప్రత్యేక మెనూ. ప్రత్యేక ధరలు. ప్రత్యేక సౌకర్యాలు. పోలీసులకు దొరుకకుండా ఎప్పటికప్పుడు ఆధారాలు నాశనం చేయడం.. హైదరాబాద్‌లోని 12 మసాజ్ సెంటర్లలో బయటపడిన 'థాయ్ సెక్స్ రాకెట్' దర్యాప్తులో వెలుగుచూస్తున్న ఆసక్తికర కోణాలివి. ఈ అక్రమ దందాపై ఓ పౌరుడు ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య స్వయంగా రంగంలోకి దిగడం.. నెల రోజులపాటు తన పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు చేయించి చీకటి వ్యాపారం గుట్టును రట్టు చేయడం మరో విశేషం. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 12 స్పా కేంద్రాలపై శనివారం రాత్రి పోలీసులు దాడులు జరిపారు. ఈ కేంద్రాల్లో మసాజ్ పేరుతో వ్యభిచారం నడుపుతున్నారని గుర్తించారు. ప్రధాన సూత్రధారి సిద్ధార్థ్‌తోపాటు మరో 18 మందిని అరెస్ట్ చేశారు. 34 మంది థాయిలాండ్ దేశానికి చెందిన యువతులతో పాటు పంజాబ్, ఉత్తరాది రాష్ట్రాలు, హైదరాబాద్‌కు చెందిన మరో 31 మంది యువతులను పోలీసులు కాపాడి పునరావాస కేంద్రాలకు తరలించారు. థాయ్‌లాండ్‌కు చెందిన యువతులను రప్పించేందుకు ప్రత్యేకంగా ఓ మహిళను మధ్యవర్తిగా నియమించుకున్నారని తేలింది. ఉద్యోగాల పేరుతో రప్పించి వీసాలను బలవంతంగా గుంజుకొని ఈ రొంపిలోకి దింపినట్టు ఆధారాలు లభ్యమయ్యాయి. విటుల కోసం ప్రత్యేక మెనూ తయారు చేశారని, ఆన్‌లైన్ బుకింగ్ సైతం అందుబాటులో ఉంచి భారీ స్థాయిలో దందా నడుపుతున్నారని తేలింది.



ఓ స్పాలో ఏర్పాటు చేసిన బెడ్‌రూంలు

ఢిల్లీ నుంచి కిట్‌లు..

లైంగిక కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలను నిర్వాహకులు ఎప్పటికప్పుడు చెరిపివేస్తున్నారని, టాయ్‌లెట్‌లో వేసి ఫ్లష్ చేస్తున్నారని గుర్తించారు. దీంతో ఆకస్మిక దాడులు చేసినప్పుడు ఆధారాలు సేకరించేందుకు ప్రత్యేక వైద్య పరికరాలు అవసరమని నిర్ధారించారు. ఈమేరకు సీపీ 50 కిట్‌లను ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా తెప్పించారు. పక్కాగా నిర్ధారించుకున్న తర్వాత శనివారం సీపీ సందీప్ శాండిల్య, ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, షీ టీమ్స్, 14 మంది ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది రంగంలోకి దిగారు. మొత్తం 12 స్పా, మసాజ్ సెంటర్లలో కొనసాగుతున్న సెక్స్ రాకెట్ గుట్టును రట్టు చేశారు. ఇప్పుడు నిందితుల కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. ఈ దాడులు స్పా, మసాజ్ సెంటర్ల నిర్వాహకుల్లో గుబులు రేపింది. దీంతో వారు తమ రికార్డులను సరిచేసుకుంటున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారికి వెన్నులో వణుకు పుట్టింది. అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వసతులను తొలగించే పనిలో పడ్డారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నారు.



ప్రధాన సూత్రధారి సిద్ధార్థ్

పౌరుడి ఫిర్యాదు.. సీపీ వ్యక్తిగత విచారణ

స్పా సెంటర్లలో కొనసాగుతున్న సెక్స్ రాకెట్‌పై ఓ పౌరుడు ఫిర్యాదు చేయగా, సీపీ నేరుగా రంగంలోకి దిగారు. స్థానిక పోలీసులకు తెలియకుండా ప్రత్యేక బృందంతో నెల రోజులపాటు నిఘా వేయించి గుట్టు రట్టు చేశారు. నెల రోజుల కిందట ఓ వ్యక్తి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్‌శాండిల్యను కలిశారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ప్రాంతాల్లోని పలు స్పా, మసాజ్ సెంటర్లలో వ్యభిచారం నడుపుతున్నారని, సంపన్న కుటుంబాల వ్యక్తులు వచ్చినప్పుడు మెనూ కార్డులు చూపెట్టి దందా నడుపుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సీపీ.. స్వయంగా రంగంలోకి దిగారు. నేరుగా రెండు, మూడు స్పా కేంద్రాలను విజిట్ చేసి వాటి మెనూలను పరిశీలించి వచ్చారు. అనంతరం ముగ్గురు అధికారులతో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని స్థానిక పోలీసులతో సంబంధం లేకుండా నిఘా ఆపరేషన్ చేయించారు. వారు స్పా కేంద్రాలకు వెళ్లి అక్కడ జరిగే చీకటి దందాపై పూర్తి సమాచారం సేకరించారు. నిర్వాహకులను అరెస్ట్ చేస్తే శిక్ష నుంచి తప్పించుకోకుండా ఉండేందుకు కావాల్సిన సాక్ష్యాలు, ఆధారాలపై పోలీసులు అధ్యయనం చేశారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడేందుకే...



హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతినకుండా ఉండేందుకే ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాం. ఓ బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు స్వయంగా స్పా, మసాజ్ కేంద్రాల వ్యవహారాలపై నిఘా పెట్టా. ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపి పూర్తి ఆధారాలను సేకరించాం. మెనూ కార్డు పెట్టి మరీ చీకటి దందా చేస్తున్నట్టు గుర్తించాం. నిర్వాహకులు తప్పించుకోకుండా వారి నేరాన్ని నిరూపించేందుకు ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి వైద్యపరికరాల కిట్‌లను తెప్పించాం. అక్రమాలపై ప్రజలు ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చు.

- సందీప్ శాండిల్య, సైబరాబాద్ పోలీస్ కమిషనర్

ఎమ్మార్డీసీకి పాత మెట్రో కార్యాలయం కేటాయింపు

- మూసీ సుందరీకరణలో ముందడుగు
- రుణాలివ్వడానికి ముందుకొస్తున్న బ్యాంకులు
- దశలవారీగా అభివృద్ధికి ప్రణాళిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అహ్మదాబాద్‌లోని సబర్మతి నది తరహాలో మూసీ నదికి పూర్వవైభవం తేవడానికి పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు సంకల్పించారు. ఇందుకు సంబంధించి మరో ముందడుగు పడింది. కొంతకాలం నుంచి ఖాళీగా ఉన్న లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ మెట్రో రైలు ఆఫీసులో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎమ్మార్డీసీ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు మంత్రి కేటీఆర్ సానుకూలత వ్యక్తం చేసినట్టు సమాచారం. బుధవారం ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిసింది. ఇప్పటికే ఈ విభాగానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కొంత సిబ్బందిని కేటాయించినట్టు సమాచారం. మొత్తానికి మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనుల్లో వేగం పెరుగనున్నది. ఇప్పటికే వివిధ బ్యాంకులు ఈ ప్రాజెక్టుకు రుణమివ్వడానికి ముందుకొచ్చాయి. విజయ బ్యాంకు మొదటివిడుతలో భాగంగా దాదాపు రూ.750 కోట్లను మంజూరు చేయడానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో ప్రవహించే మూసీనది గత దశాబ్దకాలంలో అధ్వాన్నంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ పరిరక్షణ పనుల్లో కదలిక మొదలైంది. నదీ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే బృహత్ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకున్నది. ఇందులోభాగంగా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి గౌరెల్లి వరకు సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది.

దశలవారీగా అభివృద్ధి


- ఫేజ్-1లో భాగంగా మూసీనదిలోకి మురుగునీరు రాకుండా నిరోధిస్తారు. గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగిస్తారు. రసాయన వ్యర్థజలాలు, వ్యర్థాలు, దుర్గంధాన్ని సంపూర్ణంగా శుభ్రం చేస్తారు. నదిలో, నదిఒడ్డున ఉన్న గడ్డిని తొలగించాక సుందరీకరణపై దృష్టి పెడుతారు.
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి మూసీ, ఈసీ నది ప్రవహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతారు. మూసీనది తీర ప్రాంతాలను శుద్ధిచేసి ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేస్తారు. పదకొండు మీటర్ల వెడల్పుతో నడకదారులను ఏర్పాటు చేస్తారు.
- ఈసీ ఒడ్డున 64 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతులో 2.4 కిలోమీటర్ల మేర పడవలు తిరుగడానికి వీలుగా రోయింగ్ కోర్సు ఏర్పాటు చేయనున్నారు.
- సైక్లింగ్, జాగింగ్ ట్రాక్ కోసం మూడు మీటర్ల కారిడార్ నిర్మిస్తారు.
- గండిపేట్ దగ్గర నాలెడ్జ్ పార్క్, గేమ్స్, ఎకో టూరిజం అభివృద్ధి
- ఈసీ, మూసీ ఒడ్డున రెండింటినీ అనుసంధానం చేసేవిధంగా మూడు ప్రాంతాల్లో పాదచారుల కోసం సింగిల్‌లేన్ స్టీల్ వంతెనలు ఏర్పాటు చేస్తారు.
- నదీతీర ప్రాంతాల్లో చెక్‌డ్యాముల తరహాలో వాటర్ పూళ్లను అభివృద్ధి చేస్తారు.

ఎకో గణేశ్‌లనే పూజించాలి



అమీన్‌పూర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ తేజ్‌దీప్ కౌర్ పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకొని సోమవారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని ఎస్‌ఎన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో టీఎస్ ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలతో చెరువుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన వినాయకులను నిమజ్జనం చేయడం వల్ల చెరువు నీరు కలుషితం అవడంతోపాటు అనేక అనర్థాలకు దారితీస్తున్నదన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులతోనే ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ కమాండెంట్స్ జంగయ్య, ఎస్‌ఎం భాషా, దేవీదాస్, అమీన్‌పూర్ పాలక మండలి సభ్యులు, ఎంపీటీసీలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

• ఆవు పంచకం.. పేడతో గణపయ్య



పర్యావరణ హితం కోరి సంగారెడ్డి సమీపంలోని శ్రీవైకుంఠపురం ఆలయ ఆవరణలో ఆవు పంచకం, పేడతో గణపతి విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. 18 అగుడుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకు రెండు టిప్పర్ల బంకమట్టి, ఒక ట్రాక్టర్ ఆవుపేడ, 20 మోపుల వరిగడ్డి, 400 లీటర్ల ఆవు పంచకం వినియోగిస్తున్నారు. మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన కళాకారులు విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. గత ఏడాది ఏడు అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, ఈసారి 18 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను కాంక్షించి ఈ విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నట్టు శ్రీవైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు 'నమస్తే తెలంగాణ'ప్రతినిధితో చెప్పారు. ప్రతిష్టిస్తున్న చోటే నిర్మించి.. అక్కడే నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుడి వాహనమైన మూషిక విగ్రహాన్ని కూడా ఆవు పంచకం, పేడతో ఆరు అడుగుల ఎత్తుతో తయారు చేస్తున్నారు.

-సంగారెడ్డి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి

'సిగరెట్' దొంగల కోసం వేట

ఇతర రాష్ట్రాలకు వెళ్లనున్న ప్రత్యేక బృందాలు.. అనుమానిత ప్రాంతాల్లో కాల్ డేటాను విశ్లేషిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పక్కా ప్లాన్‌తో కంటెయినర్ నుంచి రూ.4 కోట్లు విలువ చేసే సిగరెట్లను దోపిడీ చేసిన ముఠాను పట్టుకునేందుకు రాచకొండ కమిషనరేట్ ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలే ఈ దోపిడీకి పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. శనివారం రాత్రి రూ.4 కోట్లు విలువచేసే సిగరెట్ల లోడ్‌తో ముషీరాబాద్ ఐటీసీ కంపెనీ నుంచి కంటెయినర్ బయలుదేరగా.. అర్ధరాత్రి పెద్ద అంబర్‌పేట్ వద్ద రెండు సుమోలు, లారీల్లో వచ్చిన 30 మంది గుర్తుతెలియని దుండగులు అడ్డగించి, డ్రైవర్‌ను కట్టేసి సిగరెట్లను దోచుకెళ్లిన సంగతి తెలిసిందే. దర్యాప్తులో భాగంగా సోమవారం పోలీసులు ముషీరాబాద్ ఐటీసీ కంపెనీ నుంచి దోపిడీ జరిగిన ప్రాంతం వరకు క్రైమ్ సీన్‌ను పరిశీలించారు. ఐటీసీ కంపెనీ సిబ్బందితో పాటు డ్రైవర్ అఖిలేష్ యాదవ్, కంటెయినర్‌లో ఉప్పల్ వరకు వచ్చిన రామును ప్రశ్నించారు. ఈ మార్గంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను సేకరించారు. పెద్ద అంబర్‌పేట్ వద్ద అటకాయించిన సుమోలు, లారీలు ఎటువైపు నుంచి వచ్చాయో నిర్ధారించుకోవడానికి పోలీసులు పలు ప్రాంతాల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కొన్ని చోట్ల గుర్తుతెలియని వాహనాలు కంటెయినర్‌ను ఫాలో అయినట్టు కనిపించినా స్పష్టంగా కనిపించడం లేదని తెలిసింది. ఈ ముఠా ముషీరాబాద్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో తిష్ట వేసి కంటెయినర్ గురించిన సమాచారాన్ని ఫోన్‌ల ద్వారా ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకొన్నారని.. పెద్ద అంబర్‌పేట్ వద్ద దోపిడీకి పాల్పడ్డారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మార్గంతోపాటు, అనుమానిత ప్రాంతాల్లోని సెల్‌ఫోన్ కాల్‌డేటాను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మరోవైపు ఇదే తరహాలో దోపిడీలు చేసిన చరిత్ర ఉన్న ముఠాల గురించి ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఈ తరహా ముఠాలు రాజస్థాన్, కర్ణాటక, చెన్నై, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో ఉన్నాయని పోలీసులకు కొంత సమాచారం దొరికింది. దీంతో ఆయా రాష్ట్రాల పోలీస్ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ దర్యాప్తును వేగవంతం చేశారు. మంగళవారం ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలు బయలుదేరుతున్నాయి. డ్రైవర్ అఖిలేష్ యాదవ్ చెప్పిన వివరాల్లో దుండగులు మాట్లాడిన భాష, యాస ప్రత్యేకంగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ యాసలో మాట్లాడే ముఠాలపైనా సమాచారం సేకరిస్తున్నారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. దారిదోపిడీలకు పాల్పడే ముఠాలను సైతం అనుమానిస్తున్నారు.

చేతులు మారిన సొత్తు?

దుండగులు దోచుకెళ్లిన రూ.4 కోట్ల విలువైన సిగరెట్ ప్యాకెట్ల సంచులను ఇప్పటికే వేరుచేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దోపిడీకి ముందుగానే ఈ సొత్తును కొనుగోలు చేసేలా కొందరు డీలర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారని అనుమానిస్తున్నారు. దోచుకున్న తర్వాత సిగరెట్ ప్యాకెట్లను డీలర్లకు అప్పగించి ఉంటారని భావిస్తున్నారు. లేదా ముఠాలో ఉన్న సభ్యులు వాటాల కింద వేసుకొని సిగరెట్లు పట్టుకుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. వాటిని వారి సొంత గ్రామాలు లేదా పరిసర పట్టణాల్లో తక్కువ ధరకు విక్రయించి ఉంటారని భావిస్తున్నారు. ఇలా చేస్తే చాలా మంది కొనుగోలుదారులు ఉంటారని, సొమ్ము రికవరీ కష్టంగా మారే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.



నిందితులను, గుట్కా బస్తాలను మీడియాకు చూపుతున్న డీసీపీ లింబారెడ్డి

54 లక్షల విలువైన గుట్కా స్వాధీనం

మారేడ్‌పల్లి: నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నగరానికి తరలించి విక్రయిస్తున్న ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.54 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు, రెండు ట్రక్కులు, 10 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ లింబారెడ్డి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఇసామియాబజార్‌కు చెందిన ముత్యం సూర్యనారాయణ అలియాస్ సురేశ్(53), ముత్యం రమేశ్(41) అన్నదమ్ములు. గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు నిషేధం లేనప్పుడు నగరంలో వీఎం ట్రేడర్స్ పేరుతో గుట్కా డిస్ట్రిబ్యూటర్లుగా పని చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వం గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను నిషేధించడంతో వీటికి డిమాండ్ మరింత పెరిగింది. దీంతో ఈ అన్నదమ్ములిద్దరూ మూడేండ్ల కిందట కర్ణాటకలోని బీదర్‌లో ఎస్‌ఆర్ ఏజెన్సీ పేరుతో గుట్కా, పొగాకు ఉత్పత్తుల వ్యాపారాన్ని ప్రారంభించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఓబుల్‌శెట్టి హరిబాబు(46) వీరి వద్ద పెద్ద మొత్తంలో గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాడు. గుట్కా, పొగాకు ఉత్పత్తులను గుంటూరు నుంచి హైదరాబాద్‌కు కింగ్‌కోఠిలోని కావేరి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో సరఫరా చేస్తున్నారు. సోమవారం కావేరి రోడ్ క్యారియర్స్ మేనేజర్ చుంచు రాములు(56), డ్రైవర్ మహ్మద్ కమ్రాన్ (25), ఆఫీస్ బాయ్ కలాల్ బాల్‌రాజ్(23) కింగ్‌కోఠిలో గుట్కాలను లోడ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకుని ముగ్గురినీ అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లిలోని కావేరి రోడ్ క్యారియర్స్ ప్రధాన కార్యాలయంలోనూ తనిఖీ చేయగా, పొగాకు ఉత్పత్తులు లభించాయి. బ్రాంచ్ మేనేజర్ జీ నరేంద్ర(41), గుంటూరు జిల్లాకు చెందిన ఓబుల్‌శెట్టి హరిబాబుకు సహకరించిన అదే ప్రాంతానికి చెందిన మద్దుల లక్ష్మణ, హన్మంత్ ప్రసాద్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు తిమ్మప్ప, కాంతరెడ్డి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కల్తీ చిప్స్ తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్



బాలాజీ ఫుడ్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ: కల్తీ పదార్థాలతో చిప్స్, ఇతర ఆహార పదార్థాలను తయారు చేసి సరఫరా చేస్తున్న కంపెనీపై సోమవారం ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. యజమానిని అదుపులోకి తీసుకున్నారు. సనత్‌నగర్‌కు చెందిన ధన్‌జీ పటేల్ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ పారిశ్రామికవాడలో బాలాజీ ఫుడ్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేశాడు. అందులో కల్తీ పదార్థాలతో ఆలు చిప్స్, నమ్‌కిన్ ఐటమ్స్ తయారు చేసి సరఫరా చేస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు కంపెనీపై దాడి చేసి యజమాని ధన్‌జీ పటేల్‌ను అదుపులో తీసుకుని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలు

గంటకు 350 కి.మీ వేగం • వచ్చేనెల 21న ప్రారంభించనున్న చైనా



బీజింగ్: ప్రపంచంలోనే అత్యంత వేగంగా గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే బుల్లెట్ రైలును చైనా వచ్చేనెల 21న ప్రారంభించనున్నది. దేశ రాజధాని బీజింగ్ నుంచి వాణిజ్యకేంద్రమైన షాంఘై మధ్య నడిచే ఈ రైలు 1,250 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 4.5 గంటల్లోనే చేరుకోగలదు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య (జమ్మూ-భోపాల్ దూరంతో సమానం) ప్రయాణించడానికి ఆరు గంటల సమయం పడుతున్నది. ఈ కొత్త తరం బుల్లెట్ రైలు వల్ల గంటన్నర సమయం ఆదా కానున్నది. ప్రపంచంలో అతివేగంగా నడిచే వాణిజ్య బుల్లెట్ రైలుగా ఇది ఖ్యాతిగడిస్తుందని చైనా రైల్వే కార్పొరేషన్ తెలిపింది. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో నడిచే తొలి బుల్లెట్ రైలును 2008లోనే బీజింగ్-తియాన్‌జిన్ నగరాల మధ్య చైనా నడిపింది. తర్వాతకాలంలో దేశవ్యాప్తంగా ఇలాంటి మరో మూడు రైళ్లను కూడా తీసుకొచ్చింది. అయితే, 2011 జూలైలో భారీ రైలు ప్రమాదం జరుగడంతో బుల్లెట్ రైళ్లవేగాన్ని గంటకు 300 నుంచి 250కి తగ్గించింది. అప్పట్లో రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పైకి వచ్చి ఢీకొనడంతో 40 మంది చనిపోగా, 190 మందికి గాయాలయ్యాయి.





ఆదివారం కెనడాలోని మాంట్రియేల్‌లో జరిగిన 71వ భారత స్వాతంత్ర్య దినోత్సవాల్లో భారతీయ వస్త్రధారణతో పాల్గొన్న కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడూ; ఆదివారం అమెరికాలోని న్యూయార్క్ తదితర నగరాల్లోనూ భారతీయ అమెరికన్లు పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. న్యూయార్క్‌లో జరిగిన వేడుకల్లో టాలీవుడ్ సినీనటులు రానా, తమన్నా కూడా పాల్గొన్నారు.

ఒక్కటైన పళని, పన్నీర్

- అన్నాడీఎంకే ప్రత్యర్థి వర్గాల విలీనం
- ఉపముఖ్యమంత్రిగా పన్నీర్‌సెల్వం
- ఆర్థికశాఖ కేటాయింపు
- అంతా అమ్మ బిడ్డలమన్న సీఎం పళని
- త్వరలో శశికళపై వేటు?





సోమవారం చెన్నైలోని రాజ్‌భవన్‌లో ఆర్థికశాఖ మంత్రిగా ప్రమాణం చేస్తున్న పన్నీర్ సెల్వం

గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు సమక్షంలో సీఎం పళని స్వామి, ఉప ముఖ్య మంత్రి పన్నీర్ సెల్వం కరచాలనం

చెన్నై, ఆగస్టు 21: తమిళనాడులో ఆరునెలల రాజకీయ అనిశ్చితికి తెరపడింది. అన్నాడీఎంకే ప్రత్యర్థి వర్గాలు ఏకమయ్యాయి. అధికార పంపిణీ ఒప్పందంలో భాగంగా పన్నీర్‌సెల్వం ఉపముఖ్యమంత్రి పదవి చేపట్టారు. జయ నెచ్చెలి శశికళ, ఆమె అనుయాయుల పరిస్థితి డోలాయమానంలో పడింది. మంగళవారం గవర్నర్‌ను కలువబోతున్నట్టు దినకరన్ వర్గం ప్రకటించింది. విలీనం సర్దుబాట్ల కింద ముఖ్యమంత్రి పళనిస్వామి పార్టీ సమన్వయకర్తగా ఉంటారు. ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సహ-సమన్వయకర్తగా కొనసాగుతారు. త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని అధికారపార్టీ నేతలు ప్రకటించారు. ముందుగా సీఎం పళనిస్వామి పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి పన్నీర్‌సెల్వం వచ్చారు. ఏడుమాసాల విరామం తర్వాత పార్టీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన సెల్వంకు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నేతలిద్దరూ కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇరువర్గాలు విలీనమైనట్టు ప్రకటించారు. అందుకు సంకేతంగా ఇద్దరూ నవ్వుతూ కరచాలనం చేశారు. 'పార్టీ కార్యకర్తల కోరిక మేరకు రెండు వర్గాలను విలీనం చేస్తున్నాం.. పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్, అమ్మ జయలలిత నిర్దేశించిన లక్ష్యాల సాధనకు ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పన్నీర్‌సెల్వం ప్రకటించారు. అన్నాడీఎంకే ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉంటుందని అన్నారు. విలీనం కోసం కృషి చేసిన సీఎం పళనిస్వామికి పన్నీర్‌సెల్వం కృతజ్ఞతలు తెలిపారు. 'ఇప్పుడు నా మనసులోని భారమంతా దిగిపోయింది. మేమంతా అమ్మ బిడ్డలమే.. మేమందరం అన్నదమ్ములం. మమ్మల్ని ఎవరూ విడదీయలేరు. రెండు వర్గాల విలీనం జరిగిన ఈరోజు ఎంజీఆర్, జయలలిత ఉంటే ఎంతో సంతోషించేవారు. గత ఆరు మాసాల్లో మేం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది' అని డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం అన్నారు. ఇక రెండాకుల గుర్తు దక్కించుకోవడం మీద దృష్టి పెడుతామని అన్నారు. అమ్మ ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నిటిని పూర్తిచేస్తామని చెప్పారు. తర్వాత పళనిస్వామి, పన్నీర్‌సెల్వం చెట్టపట్టాలుగా జయలలిత సమాధి వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్, ద్రవిడ రాజకీయ మూల పురుషుడు అన్నాదురై సమాధుల వద్ద కూడా వారు నివాళులు అర్పించారు. అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లారు. రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు.. పన్నీర్‌సెల్వం, ఆయన సన్నిహిత సహచరుడు పాండ్యరాజన్ చేత మంత్రులుగా పదవీ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి పళనిస్వామి సిఫారసు మేరకు సెల్వంకు ఆర్థికశాఖ కేటాయిస్తున్నట్టు, ఉపముఖ్యమంత్రి హోదా కల్పిస్తున్నట్టు రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. పాండ్యరాజన్‌కు తమిళ అధికారభాష, తమిళ సంస్కృతి శాఖలు కేటాయంచారు. శశికళ విషయంలో ఏం చర్య తీసుకుంటారనేది ఇంకా తేలలేదు. త్వరలో జరిగే పార్టీ సర్వ సభ్య సమావేశంలో దీనిపై నిర్ణయం ఉంటుందని అంటున్నారు. అనాడీఎంకే ప్రత్యర్థి వర్గాల విలీనంపై శశికళ వర్గీయులు మండిపడుతున్నారు. అవసరమైతే కోర్టుకు వెళ్తామని దినకరన్ సన్నిహితులు మీడియాకు చెప్పారు. మంగళవారం గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిసి తమ వాదన వినిపిస్తామని దినకరన్ వర్గీయుడైన ఎమ్మెల్యే పీ వెట్రివేల్ చెప్పారు. సోమవారం జయ సమాధి వద్ద ధ్యానంలో పాల్గొన్న దినకరన్ వర్గం ఎమ్మెల్యేల్లో వెట్రివేల్ కూడా ఉన్నారు. తమకు 25 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ఆయన చెప్పారు. పళని, పన్నీర్ ఇద్దరినీ సీఎంలను చేసింది శశికళేనని, ఇప్పుడు వారు ఆమె బహిష్కరణకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ అభినందనలు

ఉపముఖ్యమంత్రి పదవి చేపట్టిన పన్నీర్‌సెల్వంను, ఇతర మంత్రులను ప్రధాని నరేంద్రమోదీ ట్విట్టర్‌లో అభినందించారు. తమిళనాడు రాబోయే సంవత్సరాల్లో అభివృద్ధిలో కొత్తపుంతలు తొక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం పళనిస్వామికి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వంకు తమిళనాడు అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు.

తమిళ పెద్ద తలపై జోకర్‌టోపీ

విలీనంపై హీరో కమల్ వ్యంగ్యాస్త్రాలు



చెన్నై: విలీనం పేరిట అన్నాడీఎంకే నేతలు ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారని ప్రముఖ నటుడు కమలహాసన్ దుయ్యబట్టారు. నిన్న విడిపోవడం నేడు కలువడం రెండూ నాటకాలేనని అన్నారు. తమిళపెద్ద తలపై ఇప్పుడు జోకర్‌టోపీ అమిరిందని పేర్కొన్నారు. 'గాంధీటోపీ, కాషాయటోపీ, కశ్మీర్‌టోపీ.. ఇప్పుడు జోకర్ టోపీ. చాలా? ఇంకా ఏమన్నా కావాలా?' అని విమర్శలు ఎక్కుపెట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పళనిస్వామి రాజీనామాకు కమల్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

భవితవ్యం ప్రశ్నార్థకం

విలీనంతో మన్నార్‌గుడి మాఫియా ఔట్



చెన్నై: అమ్మ జయలలిత మృతితో అందలం ఎక్కుతుందనుకున్న శశికళ అక్రమాస్తుల కేసులో జైలుపాలయ్యారు. పోతూపోతూ తన అన్నకొడుకు టీటీవీ దినకరన్‌ను పార్టీ ఉప ప్రధానకార్యదర్శిగా నియమించి పార్టీపై పట్టు కొనసాగించాలని అనుకున్నారు. ఇటీవలే పళనిస్వామి వర్గం పన్నీర్‌సెల్వం వర్గం డిమాండ్ మేరకు దినకరన్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. ఇప్పుడు విలీనం జరిగిపోయింది కనుక ప్రధాన డిమాండ్ అయిన శశికళ తొలగింపుపై రెండు వర్గాలు దృష్టి పెట్టబోతున్నాయి. అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పదవి నుంచి శశికళను తప్పించేందుకు త్వరలో పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ వైదిలింగం ప్రకటించారు. సర్వసభ్య సమావేశం ఆమెను ప్రధాన కార్యదర్శిగా నియమించింది కనుక తొలగింపు కూడా సర్వసభ్య సమావేశంలోనే జరుగాలనేది పార్టీ నేతల అభిప్రాయం. జయలలిత సహాయకురాలిగా తప్ప మరేఇతర పదవి గతంలో నిర్వహించని శశికళ జయ మృతితో ఒక్కసారిగా అధికారానికి దగ్గరయ్యారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులై తమిళ సీఎం పదవికి చేరువయ్యారు. ఆ తర్వాత పార్టీ శాసనసభా పక్షనేతగా ఎన్నికై సీఎం పదవికి అర్హత సంపాదించారు. కానీ ప్రమాణస్వీకారం జరిగేలోపు అక్రమాస్తుల కేసు ఆమె ఆశలపై నీళ్లు చల్లింది. సమీపబంధువు దినకరన్‌కు పార్టీ పగ్గాలు, తన వర్గీయుడుగా భావించినల పళనిస్వామికి ప్రభుత్వ పగ్గాలు అప్పగించి జైలుకు వెళ్లారు. కానీ మాజీ సీఎం పన్నీర్‌సెల్వం వర్గీయులు ఎగురేసిన తిరుగుబాటు బావుటా ఆమె పాలిట ఉచ్చులా మారింది. శశికళను, ఆమెను నీడలా వెన్నంటి ఉంటూ చక్రం తిప్పే మన్నార్‌గుడి మాఫియాను దూరం పెట్టడం విలీనానికి షరతులుగా పన్నీర్‌వర్గం ముందుకు తెచ్చింది. ఇప్పుడు లాంఛనంగా విలీనం జరిగిపోయింది. ఇక మిగిలింది శశికళను, ఆమె మన్నార్‌గుడి మాఫియాను పక్కన పెట్టడం ఒక్కటే మిగిలిందని అంటున్నారు.

లెఫ్టినెంట్ కర్నల్ పురోహిత్‌కు బెయిల్

మాలేగావ్ కేసులో తొమ్మిదేండ్ల తర్వాత మంజూరు



న్యూఢిల్లీ: మాలేగావ్ వరుస బాంబు పేలుళ్ల కేసులో తొమ్మిదేండ్లపాటు జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ సైనిక అధికారి, లెఫ్టినెంట్ కర్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌కు ఎట్టకేలకు బెయిల్ లభించింది. సుప్రీంకోర్టు సోమవారం ఆయనకు పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఆయనకు బెయిల్‌ను నిరాకరిస్తూ బాంబే హైకోర్టు జారీచేసిన ఆదేశాలను పక్కనపెడుతున్నట్లు జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఏఎం సాప్రేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొన్నది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పురోహిత్‌కు బెయిల్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. బాంబే హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడంతో పురోహిత్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాంబులు సరఫరా చేశానని తనపై ఆరోపణలు చేశారని, ఒకవేళ అవి నిరూపితమైనా తనకు ఏడేండ్ల జైలు శిక్ష పడేదని, దాని ప్రకారం రెండేండ్ల కిందటే తన శిక్షాకాలం ముగిసి ఉండేదని పురోహిత్ వివరించారు. మహారాష్ట్ర వ్యవస్థీకృత నేర నియంత్రణ చట్టం (ఎంసీవోసీఏ) ప్రకారం పురోహిత్‌పై చేసిన ఆరోపణలు నిరూపితం కాలేదని పురోహిత్ తరపు న్యాయవాది హరీశ్ సాల్వే కోర్టుకు నివేదించారు. ఎన్ఐఏ తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ మణిందర్‌సింగ్ పేలుళ్లలో పురోహిత్ పాత్ర ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. 2008 సెప్టెంబర్ 29న మహారాష్ట్ర నాసిక్ జిల్లాలోని మాలేగావ్‌లో బాంబు పేలుళ్లలో ఏడుగురు చనిపోయారు. ఈ కేసులో సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్‌కు ఎన్ఐఏ గతేడాది క్లీన్‌చిట్ ఇచ్చింది. తాజాగా పురోహిత్‌కు బెయిల్ మంజూరైంది.

ఆరెస్సెస్ సమర్థకులకు సర్కార్ వత్తాసు

ఆరెస్సెస్ సమర్థకులకు సర్కార్ వత్తాసు ఇస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధిపతికి రెండోసారి పదవీకాలం పొడిగించడంపై కూడా కాంగ్రెస్ మండిపడింది. పురోహిత్‌కు బెయిల్ ఊహించిందేనని, బాంబుపేలుళ్ల కేసు నిందితుల్లో ఆరెస్సెస్ మద్దతుదారులకు ప్రస్తుత ప్రభుత్వం అండదండలు అందిస్తున్నదని సీనియర్ కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ ట్విట్టర్‌లో విమర్శించారు.



(ఫైల్)

రాయ్‌పూర్ దవాఖానలో ముగ్గురు నవజాత శిశువులు మృతి

మద్యం మత్తులో మూడు గంటలు ఆక్సిజన్ సరఫరాను నిలిపేసిన ఉద్యోగి అరెస్ట్

రాయ్‌పూర్, ఆగస్టు 21: ఆక్సిజన్ కొరతతో ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో పసిపిల్లలు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయింది. అయినప్పటికీ ప్రభుత్వ దవాఖానల తీరు మారినట్టు కనిపించడంలేదు. తాజాగా ఇలాంటి ఉదంతమే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనూ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాయ్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ దవాఖానలో ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ముగ్గురు నవజాత శిశువులు సోమవారం మృతి చెందారు. ఆక్సిజన్ ప్లాంట్‌లో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి మద్యంమత్తులో మూడు గంటలపాటు ఆక్సిజన్ సరఫరాను నిలిపివేశాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. 'నేను హెల్త్ డైరెక్టర్‌తో మాట్లాడాను. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగిని సంఘటనకు బాధ్యుడని విచారణలో తేలింది.. అతడిపై చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు' అని ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ తెలిపారు. విచారణకు ముందు.. శిశువుల మృతికి ఆక్సిజన్ సరఫరాలో అంతరాయమే కారణమని బంధువులు ఆరోపించగా.. ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ఖండించారు. శిశువులకు అనేక ఆరోగ్య సమస్యలు ఉండటంతోనే వెంటిలేటర్‌పై ఉంచామని వారు చెప్పారు. 'నవజాత శిశు విభాగంలో చనిపోయిన ముగ్గురు శిశువులు విభిన్న కారణాలతో మృతి చెందారు. దీనికి ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం కారణం కాదు. మధ్యాహ్నం 12.30 గంటలకు తక్కువ బరువుతో జన్మించడం, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా ఒక శిశువు మృతి చెందగా.. 1.30 గంటలకు శ్వాసకోశ వైఫల్యం, హృదయ సమస్యలతో మరో శిశువు.. రాత్రి 10 గంటలకు శ్వాసకోశ వైఫల్యం, ఇతర సమస్యలతో మూడో శిశువు మృతి చెందడం జరిగింది' అని ఆరోగ్యశాఖ కార్యదర్శి సుబ్రత్ సాహూ తెలిపారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఆక్సిజన్ పీడియాట్రిక్ యూనిట్‌కు చెందిన ఓ డాక్టర్ ఆక్సిజన్ రిజర్వాయర్‌లో నిల్వలు తగ్గినట్టుగా గుర్తించి, సరఫరా విభాగంలో విధుల్లో ఉన్న ఉద్యోగి రవిచంద్రను సంప్రదించేందుకు ప్రయత్నించినా.. అతడు స్పందించలేదు. ఆ తర్వాత అతడు మద్యం మత్తులో కనిపించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా రవిచంద్రను అరెస్ట్ చేశారని సాహూ తెలిపారు. పదిహేను నిమిషాల్లో తిరిగి ఆక్సిజన్ రిజర్వాయర్‌ను నింపడం జరిగిందని, కావున సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. శిశువుల మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరగాల్సి ఉందని ఆయన చెప్పారు.

భగవద్గీత పఠన పోటీల విజేతల్లో ముస్లిం విద్యార్థులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని సోదేపూర్‌లో నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల్లో ముస్లిం విద్యార్థులు విజేతలుగా నిలిచి అందరినీ ఆశ్చర్యపర్చారు. కోల్‌కతాకు చెందిన శంఖనాథ్ సమరసతా మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో హౌరా, హుగ్లీ, ఉత్తర, దక్షిణ పరగణాల జిల్లాల్లోని 65 పాఠశాలలకు చెందిన 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 286 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఇందులో మొదటి 13 స్థానాలను ముస్లిం విద్యార్థులు కైవసం చేసుకోవడం విశేషం. త్రిపుర గవర్నర్ తథాగత్ రాయ్ సోమవారం ఈ పోటీలను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థుల్లో భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న శంఖనాథ్ సంస్థను ఆయన అభినందించారు.



సోమవారం ఇరువర్గాల విలీనం తర్వాత జయలలిత సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సీఎం పళనిస్వామి, పన్నీర్‌సెల్వం

పరిణామక్రమం

- **2016 డిసెంబర్ 5:** దవాఖానలో 75 రోజులుగా చికిత్స పొందుతూ గుండెపోటుతో జయలలిత మృతి. ఆగమేఘాల మీద పన్నీర్‌సెల్వం సీఎంగా ప్రమాణం.
- **డిసెంబర్ 29:** పార్టీ సర్వసభ్యమావేశంలో ప్రధాన కార్యదర్శిగా శశికళ ఏకగ్రీవ ఎన్నిక.
- **2017 ఫిబ్రవరి 5:** అన్నాడీఎంకేఎల్పీ నేతగా ఎన్నికైన శశికళ కోసం పదవి నుంచి తప్పుకున్న పన్నీర్‌సెల్వం.
- **ఫిబ్రవరి 7:** జయలలిత సమాధి వద్ద పన్నీర్‌సెల్వం ధ్యానముద్ర. అనంతరం శశికళపై తిరుగుబాటు.
- **ఫిబ్రవరి 10:** 120 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన శశికళ వర్గం.
- **ఫిబ్రవరి 14:** అక్రమాస్తుల కేసులో శశికళ దోషి అంటూ సుప్రీంకోర్టు తీర్పు. పళనిస్వామి శాసనసభా పక్షనేతగా ఎంపిక.
- **ఫిబ్రవరి 16:** సీఎంగా పళనిస్వామి ప్రమాణ స్వీకారం.
- **ఏప్రిల్ 17:** రెండాకుల గుర్తు కోసం ఎన్నికల సంఘం అధికారికి లంచం ఇవ్వజూపాడని దినకరన్‌పై ఢిల్లీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు.
- **ఆగస్టు 10:** దినకరన్ తొలగింపునకు పళని వర్గం సరే నడంతో విలీనంపై చిగురించిన ఆశలు.
- **ఆగస్టు 17:** ఓపీఎస్ డిమాండ్ మేరకు అమ్మ జయలలిత మృతిపై విచారణకు సీఎం పళని ఆదేశం.
- **ఆగస్టు 19:** విలీనంపై రెండు వర్గాల ఆశాభావం.
- **ఆగస్టు 21:** పళని, పన్నీర్ వర్గాల విలీనం.

త్వరలో రజనీ రంగప్రవేశం!



తిరుచిరాపల్లి: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తారని రచయిత తమీజరువి మనీయన్ చెప్పారు. రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్ నిర్ణయించుకున్నట్లు చెప్పారని ఆదివారం తెలిపారు. డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా కొత్త పార్టీ ఉంటుందన్నారు. రజనీకాంత్ స్వచ్ఛమైన, మంచి పాలన అందిస్తారన్నారు. రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందించడమే రజనీ లక్ష్యమని చెప్పారు. గత 20 ఏండ్లుగా రజనీ రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నారన్నారు.

చైనా యుద్ధ సన్నాహాలు

- టిబెట్‌లో సైనిక విన్యాసాలు
- డోక్లాంపై సానుకూల పరిష్కారం: రాజ్‌నాథ్



(ఫైల్)

న్యూఢిల్లీ/ బీజింగ్: డోక్లాం ముక్కోణ జంక్షన్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో చైనా ప్రజావిమోచన సైన్యం (పీఎల్ఏ) భారత సరిహద్దుల్లో గతవారం సైనిక విన్యాసాలు జరిపినట్లు చైనా అధికార వార్తా పత్రిక గ్లోబల్ టైమ్స్, టీవీ చానెల్ చైనా సెంట్రల్ వార్తాకథనాలు వెలువరించాయి. డోక్లాం వివాదం గురించి ప్రస్తావించకుండానే మూడు నెలలు సైనికుల శిక్షణ కోసం టిబెట్‌లో విన్యాసాలు జరిపినట్లు తెలిపాయి. కాగా, జమ్ముకశ్మీర్‌లోని లడఖ్ ప్రాంతం వద్ద పాంగోంగ్ లేక్ వద్ద తమ బలగాలు సాధారణ పెట్రోలింగ్ చేస్తుంటే భారత్ సైన్యం హింసాత్మక చర్యలకు దిగిందని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చున్‌యింగ్ ఆరోపించారు. డోక్లాం వివాద పరిష్కారం కోసం చైనా సానుకూలంగా స్పందిస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆశాభావం వ్యక్తంచేశారు. భారత్ ఎల్లవేళలా శాంతియుత సంబంధాలనే కోరుకుంటుందన్నారు. తమ దేశ సార్వభౌమత్వ పరిరక్షణ తమకు తెలుసునని సోమవారం ఆయన ఐటీబీపీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో అన్నారు.

జైలులో శశికళ ఇష్టారాజ్యం

- స్వేచ్ఛగా బయటకు వెళ్లి వస్తున్న వైనం
- సీసీటీవీ కెమెరాలో రికార్డు



బయటి నుంచి జైలులోకి శశికళ వెళ్తున్నపుడు సీసీ కెమెరా ఫుటేజ్

బెంగళూరు: తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు, అక్రమాస్తుల కేసులో బెంగళూరులోని పరప్పన అగ్రహారం సెంట్రల్ జైలులో జైలుశిక్ష అనుభవిస్తున్న వీకే శశికళా నటరాజన్ వరుస సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఆమె జైలులో ఉన్నప్పటికీ స్వేచ్ఛగా బయటకెళ్లి వస్తున్నారని ఆరోపణలు వెలువడ్డాయి. పోలీసుల సమక్షంలో ఒక ఖైదీగా ఆమె సాధారణ దుస్తుల్లో బయట నుంచి జైలులోకి వెళుతున్న సీసీటీవీ కెమెరా దృశ్యాలు వెలుగు చూశాయి. ఆమె వెనుక సహ ఖైదీ ఇలవరసి వెళుతున్న దృశ్యం కూడా కనిపిస్తున్నది. దీంతో జైలులో ఆమెకు వీఐపీ మర్యాదలు జరుగుతున్నాయా? అన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జైలులో ఆమె పొందుతున్న వసతులపై దర్యాప్తు చేసిన మాజీ డీఐజీ డీ రూప ఈ మేరకు తన దర్యాప్తు నివేదికతోపాటు సదరు సీసీటీవీ కెమెరా ఫుటేజ్‌లను ఏసీబీకి శనివారం సమర్పించారు. శశికళ కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వంటవారితో భోజనం తదితర వసతులు కల్పించారని మాజీ డీఐజీ గత నివేదికలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూప మాట్లాడుతూ 'సాధారణ దుస్తుల్లో బయట నుంచి జైలులోకి శశికళ వస్తున్న దృశ్యం సీసీటీవీ కెమెరాల్లో కనిపిస్తున్నది. ఈ అంశంపైనా దర్యాప్తు జరుపుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నా' అని అన్నారు.

ఫ్రాన్స్‌లో బస్టాప్‌లపై వాహనంతో దాడి

మహిళ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మార్సిలె: ఫ్రాన్స్‌లోని మార్సిలె నగరంలో ఒక వ్యాన్ రెండు బస్టాప్‌ల వద్ద ప్రజల మీదికి దూసుకెళ్లడంతో ఒక మహిళ మరణించగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం ఉదయం 9 గంటలప్పుడు ఈ ఘటన జరిగిందని, వ్యాన్ డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. నిందితుడు మానసిక రోగి అని భావిస్తున్నామని, ఆ మేరకు అతని వద్ద ఒక లేఖ లభించిందని మార్సిలె ప్రాసిక్యూటర్ జేవియర్ టారా బ్యూక్స్ చెప్పారు. ఆ వ్యాన్ మొదట ఒక బస్టాప్ వద్ద ఉన్న ప్రయాణికులను ఢీకొట్టి వెళ్లడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తరువాత మరో బస్టాప్ వద్ద కూడా జనం పైకి దూసుకువెళ్లడంతో అక్కడ మహిళ చనిపోయారు. దాడి చేసిన వ్యక్తి యువకుడని, లోగడ డ్రగ్స్, ఆయుధ నేరాలకు పాల్పడ్డాడని స్థానిక పత్రికలు తెలిపాయి.

ట్యాంకర్‌ను ఢీకొన్న జాన్ ఎస్ మెక్‌కాయిన్ యుద్ధనౌక
10 మంది అమెరికా నావికుల గల్లంతు

సింగపూర్: తూర్పు సింగపూర్‌లో అమెరికా యుద్ధనౌక, లైబీరియా ట్యాంకర్‌ను ఢీ కొనడంతో పదిమంది నావికులు గల్లంతవగా.. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక అధికారుల సమన్వయంతో సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు యూఎస్ నేవీ తెలిపింది. సోమవారం ఉదయం 5.24 గంటలకు సింగపూర్‌లో ఆగి ఉన్న లైబేరియా ట్యాంకర్‌ను యూఎస్‌కు చెందిన జాన్ ఎస్ మెక్‌కాయిన్ క్షిపణి విధ్వంసక నౌక ఢీకొట్టింది. గల్లంతైన అమెరికా నావికుల ఆచూకీ కోసం సింగపూర్, మలేషియా, అమెరికా సిబ్బంది విమానాల్లో గాలింపు చేపట్టారు. ఇటీవల అమెరికా యుద్ధనౌకలు ప్రమాదానికి గురవడం ఇది రెండోసారి. జూన్‌లో జపాన్ తీరప్రాంతంలో అమెరికాకు చెందిన యూఎస్ఎస్ ఫిట్జ్‌గెరాల్డ్ నౌక ఫిలిప్పైన్స్ రవాణా నౌకను ఢీకొట్టడంతో ఏడుగురు నావికులు మృతి చెందారు.



యంగ్ అండ్ డైనమిక్

కలలు అందరూ కంటారు. కానీ వాటిని కొందరే సాకారం చేసుకుంటారు. ఆ కోవకు చెందిన వారే ఈ లేడీ ఐపీఎస్ ఆఫీసర్.

ఇరువై ఏడేళ్ల మెరిన్ జోసెఫ్ ఇప్పుడు వార్తల్లో వ్యక్తిగా మారారు. ఎందుకంటే కేరళ ఆర్మ్‌డ్ పోలీస్ విభాగానికి ఆమె తొలి మహిళా కమాండెంట్ కాబోతున్నారు. ఆరో తరగతి చదువుతుండగానే ఆమె సివిల్ ఫోర్సెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఢిల్లీలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె, ఎంఏ హిస్టరీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. కఠోర సాధనచేసి 2012లో ఐపీఎస్ పాసయ్యారు. తొలి ప్రయత్నంలోనే అనుకున్నది సాధించారు. ఆ తర్వాత ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. విధి నిర్వహణలో కఠినంగా ఉంటూ యంగ్ అండ్ డైనమిక్‌గా పేరుపొందారు. ఆమె చురుకైనదే కాదు, అందమైన రూపం కలిగిన వ్యక్తి కూడా. అందుకే ఆమెపై 2016లో పబ్లిష్ అయిన లిస్ట్ ఆఫ్ బ్యూటీఫుల్ ఆఫీసర్ అనే ఆర్టికల్‌లో ఆమె ప్రస్తావన కూడా వచ్చింది. ఆ విషయాన్ని మెరిన్, తన ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేశారు.

పిల్లలకు కథలు చెప్పండి!

పిల్లలకు కథలు చెప్తున్నారా? లేదా?. టోరొంటో యూనివర్సిటీకి చెందిన 'ఓంటారియో ఇనిస్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ పరిశోధకులు పిల్లలకు కథలు చెప్పాలని సూచిస్తున్నారు.

'అనగనగా ఒక అడవి ఉంటుంది. ఆ అడవిలో..' లాంటి నీతి కథలు వెనుకటికి ఏ ఇంట్లో చూసినా రేడియో చానళ్లలాగా వినిపిస్తుండేవి. ఇప్పుడు కావాలనుకుంటే 'స్టోరీ టెల్లింగ్ క్లాసెస్'ద్వారా ఎంతో కొంత చెప్పించిన అనుభూతి పొందుతున్నారు తల్లిదండ్రులు. అయితే పిల్లలకు నీతి కథలు చెప్పడంవల్ల వారి ఆలోచనా విధానం.. ప్రవర్తన.. ప్రతిభ మెరుగుపడుతాయని పరిశోధకులు చెప్తున్నారు. ఇలాంటివి లేకపోవడం వల్లే పిల్లలకు ఆక్రమణ.. స్వార్థం.. సంపాదన వంటి గుణాలు అలవడుతున్నట్లు పరిశీలనలో తేలింది. ఇలాంటి గుణాలకు పిల్లలు దూరంగా ఉండాలంటే.. జంతువులు.. పక్షులకు సంబంధించిన నీతి కథలు చెప్పాలని వాళ్లు సూచిస్తున్నారు. ఆరేండ్ల వయసు వరకు పిల్లలకు కీలక దశ అనీ.. ఈ సమయంలో వారికి నీతికథలు చెప్పడం వల్ల మంచి భవిష్యత్‌ను అందిచినవాళ్లమవుతామనేది వారి సూచన.



జిందగీ పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



మోదక ప్రియా!

స్వాగతం వినాయకా.. సుస్వాగతం గణనాయకా.. ఏకదంతా.. మోదక ప్రియా.. లంబోదరా.. గజననా..
అంటూ ఆ విఘ్నేశ్వరుడిని భక్తితో పూజించడానికి అందరూ సిద్ధమే కదా!
ఆ లంబోదరుడికి ప్రీతి పాత్రమైన కుడుములను, లడ్డూలను సమర్పించడం పరిపాటి..
గణేషుడు మోదక ప్రియుడు కదా..
ఈ వినాయక చవితికి ప్రత్యేకమైన మోదకాలను భక్తితో సమర్పించండి..
ఆ గణనాథుడి కృపకు పాత్రులుకండి..



డ్రై ఫ్రూట్స్ మోదక్

కావాల్సినవి :

బాదం, కాజూ, పల్లీలు, వాల్‌నట్స్, పిస్తా : 250 గ్రా., ఖర్జూరాలు : 8, ఆప్రికాట్స్ : 5, కిస్‌మిస్ : 10, అత్తిపండ్లు : 4, నెయ్యి : తగినంత

తయారీ :

బాదం, కాజూ, పల్లీలు, వాల్‌నట్స్, పిస్తాలను చిన్న ముక్కలుగా చేసుకోవాలి. వీటిని కడాయిలో నూనె పోసి వేయించాలి. కాస్త చల్లారిన తర్వాత వీటిని గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. ఖర్జూరాల్లో గింజలు తీసేయాలి. వీటితో పాటు ఆప్రికాట్స్, కిస్‌మిస్, అత్తిపండ్లను కూడా మిక్సీలో వేసి బాగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముందు చేసుకున్న మిశ్రమంలో వేసి కలుపాలి. మోదకాలకు చెందిన ప్రెస్ దొరుకుతుంది. దానికి కాస్త నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేసి ఒత్తాలి. డ్రై ఫ్రూట్స్ మోదక్ రెడీ!



మలాయ్ మోదక్

కావాల్సినవి :

పాలు : 2 లీటర్లు , **చక్కెర** : అర కప్పు, **నిమ్మరసం** : 2 టేబుల్‌స్పూన్స్, **యాలకుల పొడి** : చిటికెడు, **కుంకుమపువ్వు** : కొద్దిగా, **నట్స్** : తగినన్ని

తయారీ :

పాలను మరిగించి అందులో రెండు కప్పులు తీసి పక్కన పెట్టాలి. మిగిలిన పాలను మళ్లీ పెట్టి నిమ్మరసం పోసి వేడి చేయాలి. నిమ్మరసం పోయడం వల్ల పాలు విరిగిపోయి పన్నీర్ తయారవుతుంది. దీన్ని ఒక గుడ్డలో కట్టి నీళ్లు పోయేవరకు అలా ఉంచాలి. ఈలోపు మిగిలిన పాలల్లో చక్కెర వేసి మరిగించాలి. పాలు సగమయ్యే వరకు అలాగే ఉంచి ఆ పన్నీర్‌ని వేసేయాలి. ఇప్పుడు యాలకుల పొడి, కుంకుమపువ్వు వేసి మరికాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత దించి మోదక్ మోల్డ్స్‌లో ఈ మిశ్రమాన్ని వేసి ఒత్తాలి. పైన నట్స్‌తో అందంగా గార్నిష్ చేస్తే తియ్యటి మోదకాలు మీ ముందుంటాయి.



ఫ్రైడ్ మోదక్

కావాల్సినవి :

మైదా : 1 1/2 కప్పులు, **నెయ్యి** : 2 టేబుల్‌స్పూన్స్ , **కొబ్బరి తురుము** : ఒక కప్పు , **బెల్లం** : అర కప్పు, **జీడిపప్పులు** : 6 **యాలకుల పొడి** : 2 టీస్పూన్స్, **ఉప్పు, నూనె** : తగినంత

తయారీ :

మైదాలో నెయ్యి వేసి, నీళ్లు, ఉప్పు వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. దీనిపై మూత పెట్టి పది నిమిషాలు పక్కన పెట్టాలి. గిన్నెలో బెల్లం, నీళ్లు పోసి చిక్కగా అయ్యేంత వరకు ఉంచాలి. దీంట్లో కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి దించేయాలి. జీడిపప్పులను పేస్ట్ చేసి కొబ్బరితురుము మిశ్రమంలో కలుపుకోవాలి. వీటిని లడ్డూల్లా చేసి పక్కన పెట్టాలి. మైదాని పూరీల్లా చేసి కొబ్బరితురుము మిశ్రమాన్ని వేయాలి. మోదక్ మౌల్డ్‌ల్లో దీన్ని పెట్టి ప్రెస్ చేయాలి. ఆ తర్వాత కడాయిలో నూనె పోసి వీటిని బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించాలి.



చాక్లెట్ మోదక్

కావాల్సినవి :

కోకో పౌడర్ : 2 1/2 టేబుల్‌స్పూన్స్
చక్కెర : ఒక కప్పు
కోవా : 320 గ్రా.
నెయ్యి : ఒక టేబుల్‌స్పూన్

తయారీ :

కోవాని తురిమి పెట్టుకోవాలి. దీంట్లో చక్కెర వేసి సన్న మంట మీద వేడి చేయాలి. అవి వేడికి మరింత చిక్కగా అవుతాయి. పది నిమిషాల తర్వాత నెయ్యి వేసి మళ్లీ కలుపుతుండాలి. కోకో పౌడర్ వేసి మరికాసేపు ఉంచి దించేయాలి. రెండు నిమిషాల పాటు ఈ మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. మరి చల్లారితే గట్టి పడుతాయి. ఇప్పుడు మోదక్ మౌల్డ్‌కి కాస్త నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేసి ఒత్తాలి. ఇలా మిశ్రమం మొత్తంతో మోదక్ చేసి పెట్టుకోవాలి. చాక్లెట్ మోదక్ మీ నోరూరిస్తాయి.



రాగి మోదక్

కావాల్సినవి :

రాగి పిండి : ఒక కప్పు, **బెల్లం** : అర కప్పు, **పాలు** : ఒక కప్పు
యాలకుల పొడి : అర టీస్పూన్, **నెయ్యి** : 3 టేబుల్‌స్పూన్స్
కొబ్బరితురుము : ఒక కప్పు, **నువ్వులు** : 2 టేబుల్‌స్పూన్స్

తయారీ :

రెండు టేబుల్‌స్పూన్ల బెల్లంలో నాలుగు టేబుల్‌స్పూన్ల నీళ్లు పోసి వేడి చేయాలి. అది పూర్తిగా కరిగాక పక్కన పెట్టాలి. కడాయిలో నెయ్యి వేసి రాగి పిండి వేసి నాలుగు నిమిషాల పాటు వేయించాలి. దీంట్లో పాలు, నీళ్లు పోయాలి. ఇలా పోస్తున్నప్పుడు ఉండలు కట్టకుండా జాగ్రత్త పడాలి. సన్నని మంట మీద కాసేపు అలాగే ఉండనివ్వాలి. ఆ తర్వాత నెయ్యి వేయాలి. దీంట్లోనే బెల్లం నీళ్లు పోసి ఉడికించాలి. పదినిమిషాలు దీన్ని కదుపకుండా అలాగే ఉంచాలి. ఇప్పుడు మిగిలిన బెల్లంలో పోసి కరుగనివ్వాలి. దీంట్లో కొబ్బరితురుము, యాలకుల పొడి వేసి చిక్కగా అయ్యేంత వరకు కలుపుతుండాలి. చివరగా నువ్వులు వేసి దించేయాలి. దీన్ని చిన్న ఉండలు చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు మోదక్ మోల్డ్‌లకు నెయ్యి రాసి రాగి మిశ్రమాన్ని వేసి మధ్యలో కొబ్బరితురుము లడ్డూలను పెట్టి ప్రెస్ చేయాలి. ఇలా అన్ని చేసి పెట్టుకున్న తర్వాత వాటిని ఇడ్లీ కుక్కర్‌లో వేసి ఆవిరి మీద ఐదు నిమిషాలు ఉడికించాలి. రాగి మోదకాలను వేడిగా గానీ, చల్లగా అయ్యాక గానీ లాగించేయొచ్చు.

బిట్స్ కార్నర్

హ్యాట్రిక్ అందాలరాణి!



యాంకర్‌గా చేస్తూనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టింది పంకురీ గిద్వానీ. ఇప్పటికే మూడు అందాల కిరీటాలు గెలుచుకున్న ఈ అమ్మాయి.. 2017 మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీల్లో మనదేశం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నది.


లక్నోకి చెందిన పంకురీ గిద్వానీ.. 'మిస్ గ్రాండ్ ఇండియా 2017'కిరీటాన్ని గెలుచుకున్నది. ఆమె ఈ కిరీటం గెలుచుకోవడం ఆమె కుటుంబానికి సర్‌ప్రైజ్ ఏమీ కాదు. ఎందుకంటే.. ఇప్పటికే ఆమె మూడు కిరీటాలను గెలుచుకున్నది. మిస్‌గ్రాండ్ గెలిచినందుకుగాను ఈ అమ్మడు మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్‌కి ఎంపికైంది. అక్టోబర్‌లో వియత్నాంలో జరిగే ఈ అందాల పోటీలో గెలుపొందాలని పంకురీ ఆశపడుతున్నది. 2013లో 'మిస్ ఇండియా ఢిల్లీ' కిరీటాన్ని గెలుచున్నది. 2014లో 'మిస్ ఏషియా పసిఫిక్ వరల్డ్'లో నాలుగవ రన్నరప్‌గా కిరీటాన్ని కైవసం చేసుకున్నది. గ్రాండ్ ఇండియాతో హ్యాట్రిక్ సాధించింది. డిట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఈ 23యేళ్ల అమ్మాయి చిన్నప్పుడు టామ్ బాయ్‌గా ఉండేది. చదువుల్లో ఎప్పుడూ టాపరే. యూనివర్సిటీలోకి అడుగుపెట్టాక అందం మీద ఆసక్తి పెరిగిందంటున్నది పంకురీ. ఆ తర్వాత మోడలింగ్, టీవీ షోలో పాల్గొనడంతో మంచి గుర్తింపు వచ్చింది.

జుట్టుకు వెరీ'గుడ్డు'



- గుడ్డులోని తెల్లసొనలో నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. ఆరిన తర్వాత తలస్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.
- చుండ్రును నివారించడంలో గుడ్డు.. వెరీగుడ్డుగా పనిచేస్తుంది. గుడ్డులోని తెల్లసొనలో టమాటా రసం కలిపి తలకు రాయాలి. పావుగంట తర్వాత కడిగేయాలి.
- తల దురదగా ఉందా? పేలు బాధిస్తున్నాయా? అయితే గుడ్డులోని తెల్లసొనలో వేప నూనె కలిపి రాసుకోండి. మంచి ఫలితం ఉంటుంది.
- జుట్టు షైనింగ్ రావాలంటే గుడ్డులోని తెల్లసొనలో రోజ్‌వాటర్‌ని మిక్స్ చేసి తలకు పట్టించాలి.
- ఎగ్‌వైట్‌లో పాలను మిక్స్ చేసి తలకు పట్టించాలి. జుట్టు పొడిబారి, రంగు మారుతుంటే ఈ రెమెడీ బాగా పనిచేస్తుంది.

కాలేజీకి వెళ్లగలనా?



నేను ఇంజినీరింగ్ చదువుతున్నాను. ప్రతి రోజూ కాలేజికి వెళ్లాలి అనుకుంటాను. కానీ సమయం కాగానే తర్వాత వెళ్దాములే అనిపిస్తున్నది. ఒకవేళ వెళ్తే లెక్చరర్స్ ఏమైనా ప్రశ్నలు వేస్తారేమో.. నిన్న ఎందుకు రాలేదు అని అడుగుతారేమో అని భయం. దానికి ఏం సమాధానం చెప్పలేనని క్లాస్‌లో అందరూ నన్నే చూస్తారని చాలా భయం. ఏం చేయాలో తోచక నేను క్లాస్‌లకు అటెండ్ కావడం లేదు. చేసేదేమీ లేక ఫ్రెండ్స్‌తో క్యాంటీన్‌లో కూర్చుని వస్తున్నాను. మా పేరెంట్స్‌కు ఈ విషయాలేవీ తెలియవు. దయచేసి నాకు ఈ సమస్యల నుంచి బయటపడే మార్గం చూపండి?

మహేష్, హైదరాబాద్



డాక్టర్ వీరేందర్
మానసిక నిపుణులు
యూ అండ్ మీ కౌన్సెలింగ్ సెంటర్
హైదరాబాద్

డియర్ మహేష్! ఇప్పటికైనా పరిష్కారం గురించి ఆలోచించావు. ఇది చాలా మంచి పరిణామం. ప్రతి రాత్రి రేపు ఎలాగైనా వెళ్తాను అనుకొని తెల్లవారాక కాలేజికి వెళ్లి క్లాస్‌కు వెళ్లకుండా క్యాంటీన్‌లో టైం పాస్ చేస్తూ, తల్లిదండ్రులకు అబద్ధాలు చెప్పడం, కేరీర్‌ను నాశనం చేసుకోవడం ఇవన్నీ యాంగ్జైటీ లక్షణాలు. కాలేజీ, సమయానికి గుండెలో దడ, కడుపులో ఏదో తెలియని అశాంతి. చుట్టుపక్కల అంతా మనకు వ్యతిరేకంగా ఉన్నట్టు భావన. దానికి తోడు స్నేహితుల ఓదార్పు, ఫర్వాలేదు సప్లిమెంటరీ రాసుకోవచ్చు, మేమేంతా లేమా అని ఇచ్చే ధీమా వల్ల ఇలాంటి తప్పులు జరుగుతాయి. వెంటనే సమస్య అర్థం చేసుకొని తల్లిదండ్రులతో చర్చించి, ఆందోళన తగ్గించేందుకు, పోయిన ఆసక్తిని తిరిగి తెచ్చుకునేందుకు వెంటనే సైకాలజిస్ట్‌ను సంప్రదించండి. మళ్లీ మీరు ఆందోళనను తగ్గించుకుని రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్లగలరు. ఇంజినీరింగ్ పాసై భవిష్యత్తును ఆనందంగా మార్చుకోగలరు. నైపుణ్యాలను సాధించగలరు.

వాట్సప్!

ట్వీట్

రకుల్ ప్రీత్ సింగ్
@Rakulpreet



రకుల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,129,548



నీరజా కోనకు అభినందనలు. నన్ను ఫ్యాషన్ రంగంలో కూడా రాణించేలా ప్రోత్సహించావు. ఈ అవార్డు నీకే అంకితమిస్తున్నాను.

సమ్‌థింగ్ స్పెషల్



ముగిసిన శ్రావణమాసం.. కోడిపుంజుల జేఏసీ అత్యవసర సమావేశం!

కామన్‌మ్యాన్ వాయిస్

పంది వీపునకు మొలిచిన వెంట్రుకని దిండుకింద పెట్టుకుంటే అదృష్టం తలుపు తట్టి, ధనలక్ష్మి దర్శనం ఇస్తుందంటే చాలు ఇక ఆ వెంట్రుకలకు డిమాండ్ ఉంటుంది. పదివేలు అన్నా సరే పుష్కలంగా అమ్ముడైపోతాయి.

Anamika Devi

దాసోజు శ్రవణ్ తనంతట తాను టీఆర్‌ఎస్ పార్టీని వదిలిపెట్టిపోలేదు, పార్టీయే ఆయనను మెడ పటుకొని బయటకు గెంటేసింది. ఎందుకంటే ఆయన చేస్తున్న దందాలు, పైరవీలు, బ్రోకరిజాలు పార్టీకి నచ్చలేదు. అందుకే ఆయనను పార్టీ గెట్ అవుట్ అని గెంటేసింది. టీఆర్‌ఎస్ పార్టీలో దొంగ తిండి దొరకకపోయేసరికి కోరికలు తీరకుండా చనిపోయిన వాళ్ల ప్రేతాత్మలుగా మారినట్టు శ్రవణ్ కూడా ప్రేతాత్మగా మారి అఘోరాల్లాంటి కాంగ్రెస్ వాళ్ల పంచన చేరి పశుపతిలా వ్యవహరిస్తున్నాడు.

నజీర్ మహ్మద్

వైరల్ వీడియో



భారతదేశంలో ఇంకా స్వాతంత్ర్య పోరాటం కొనసాగుతూ ఉంటే అల్లూరి, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను మీరు ఏమని పిలుచుకునే వారు? తీవ్రవాదులనా? లేక దేశభక్తులనా?
Okkadu Migiladu Theatrical Trailer | Manchu Manoj | Anisha Ambrose | #OkkaduMigiladu Telugu Movie
Total views : 731,772+
Published on Aug 18, 2017

షేరింగ్

మీ దగ్గర పైసల్ లేవా? అయితే వీలైనంత త్వరగా చచ్చిపోండి! మీ దోస్తుగాళ్లకు వారానికో హాఫ్, కనీసం క్వాటర్, ఎట్లీస్ట్ ఓ నైంటీ తాగిపియ్య స్థోమతలేని నీకు ఫ్రెండ్‌షిప్ చేసే క్వాలిఫికేషన్ ఎక్కడిది?
పెళ్లానికి పండక్కో పట్టుచీర, ఏడాదికో రవ్వల నెక్లెస్, మంత్లీ వన్స్ రెస్టారెంటుకు తీసుకుపోలేని నిన్ను భర్తగా ఎలా యాక్సెప్ట్ చేయమంటవ్?
కన్న తల్లిదండ్రులకు కడుపు నిండా తిండి, కట్టుకునేందుకు మంచి బట్టలు, తీర్థయాత్రలకు పంపేందుకు కావాల్సిన డబ్బులు సమకూర్చలేని నీకు.. కొడుకుగా చెప్పుకొని తిరిగే గట్స్ ఎక్కడివి?
పిల్లలను కార్పొరేట్ స్కూలుకు, వారానికోసారి పార్క్‌కు, పదిహేను రోజులకోసారి సినిమాకు తీసుకుపోలేని నీ దరిద్రం ముందు తండ్రిగా ఎలా విన్ అవుతావ్?
అందుకే వీలైనంత త్వరగా చచ్చిపో.. వచ్చే జన్మలో అంబానీలకు అల్లుడిగానో, టాటాలకు తమ్ముడిగానో, అదానీకి అన్నగానో పుట్టాలని కోరుకో.

Raju Athikam

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 22 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM



జీవితంలో ఒక అవకాశం చేజారితే పర్వాలేదు.. మరో అవకాశం దొరుకుతుందనే భరోసా ఉంటుంది.. కానీ జీవితమే చేజారే పరిస్థితి ఏర్పడితే..?! దానికి ముగింపే తప్ప మరో దారి లేదా? ముఖ్యంగా ఏ ఆసరా లేక పండుటాకుల్లా రాలిపోతున్న.. ముదుసలి జీవితాలకు మరో అవకాశం కల్పించేందుకు మేమున్నాం అంటూ ముందుకొస్తున్నది జాస్పర్ అండ్ టీమ్.. బతుకు భారమైన వారి మనుగడకు సెకండ్ చాన్స్ ఇస్తున్నది. అభాగ్యులను అక్కున చేరుకొని నీడ కల్పిస్తున్నది.

సెకండ్ చాన్స్

హైదరాబాద్ రోడ్లపై ఎందరో అభాగ్యులు కనిపిస్తుంటారు. వారిలో చాలా మంది కదల్లేని స్థితిలో, వివిధ రోగాలతో బాధపడుతుంటారు. అలాంటి వారిని చూడగానే జాస్పర్ పాల్ కాళ్లు ముందుకు కదులవు. వాళ్లకు సహాయం చేయాలని పరితపిస్తుంటాడు. వాళ్లను దగ్గర్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లడం, సరైన వైద్యం చేయించి ఒక షెల్టర్ చూపించడం.. కొన్నేళ్లుగా ఇదే అతని దినచర్య.

సేవపై మక్కువ

తమిళనాడుకు చెందిన జాస్పర్ చిన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చేశాడు. బీటెక్ వరకూ ఇక్కడే చదువుకున్నాడు. అనాథల కోసం ఏదైనా చేయాలనే తపన చిన్నప్పటి నుంచే ఉండేది. కానీ ఎలా చేయాలి? ఏం చేయాలనే విషయమై అవగాహన ఉండేది కాదు. అందుకే కాలేజీలోకి ఎంటరవగానే కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించాడు.

జీవితానికి రెండో అవకాశం

బీటెక్ పూర్తవగానే అందరిలా జాబ్ కోసం ప్రయత్నించలేదు జాస్పర్. తన సేవాకార్యక్రమాల్ని మరింత విస్తరించాలనుకున్నాడు. కొన్నాళ్ల కిందట తానే స్వయంగా 'సెకండ్ చాన్స్' పేరిట హైదరాబాద్, సైనిక్‌పురిలో ఒక ఓల్డేజ్ హోమ్‌ను ప్రారంభించాడు. రోడ్డుపక్కన అచేతనంగా పడి ఉన్న వృద్ధులకు నీడ కల్పిస్తున్నాడు. వారి ఆలనపాలన అన్నీ తానై చూస్తున్నాడు. ముగిసిపోయాయనుకున్న జీవితాలకు సెకండ్ చాన్స్ ఇస్తున్నాడు.

చర్చించి.. ఒప్పించి

రోడ్డుపై భిక్షాటన చేసేవాళ్లందరినీ జాస్పర్, తన హోమ్‌కు తీసుకెళ్లలేడు. వచ్చేందుకు వాళ్లు ఒప్పుకోరు కూడా. ఎందుకంటే, వాళ్లకు అక్కడ ఏదో ఒక రూపంలో ఆదాయం లభిస్తున్నది. అందుకే జాస్పర్ ధ్యాసంతా పిల్లలు సరిగా పట్టించుకోక రోడ్డుపాలైన వృద్ధులు, అనాథ వృద్ధులు, రోగాలపాలై అచేతనంగా పడిఉన్న వారిపైనే. వాళ్ల సమస్యలేమిటో తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాడు. కుటుంబ సమస్యలైతే వారి పిల్లలతో చర్చించి ఒప్పించేందుకు ప్రయత్నిస్తాడు. ఆరోగ్య సమస్యలైతే దవాఖానకు తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాడు.

ఫోన్ చేస్తే చాలు..

ఒళ్లంతా గాయాలై, పురుగులు పట్టిన శరీరంతో బాధపడే వాళ్లను చూస్తే చాలామంది దూరంగా జరిగిపోతారు. కానీ అలాంటి వారి కోసం తన జీవితాన్ని అంకితం చేశాడు ఈ యువకుడు. నలుగురు సిబ్బందిని నియమించి, ఎక్కడ ఇలాంటి వాళ్లు కనిపించినా వెంటనే హోమ్‌కు తరలించే ఏర్పాట్లు చేశాడు. వీధుల్లో అలాంటి వ్యక్తుల్ని చూసి ఎవరైనా ఫోన్ చేస్తే వెంటనే అక్కడ వాలిపోతుంది జాస్పర్ అండ్ టీమ్. వీరు చేస్తున్న మంచి పనికి పలువురు డాక్టర్లు కూడా సహకారం అందిస్తున్నారు. తరుచూ వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

అన్నీ తానై అంత్యక్రియలు

ఒకవేళ హోమ్‌లో ఉంటూ ఎవరైనా చనిపోతే.. ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తారు. అనంతరం వాళ్ల కుటుంబీకులకు విషయాన్ని చెప్తారు. వాళ్లు తీసుకెళ్లేందుకు అంగీకరించకపోతే అన్నీ తానై వారి ఆచారాలకు అనుగుణంగా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నాడు జాస్పర్.

చేయూతనిస్తున్న దాతలు

పదుల సంఖ్యలో వృద్ధులు ఈ సెకండ్ చాన్స్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హోమ్ నిర్వహణ కోసం బాగానే ఖర్చవుతున్నది. అందుకే జాస్పర్ తన సేవాకార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. దాతల నుంచి సాయం తీసుకుంటున్నాడు. తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం అందించేందుకు చాలామంది ముందుకు వస్తున్నారు. ఇక మరికొందరు వలంటీర్లు సైతం జాస్పర్‌కు సహాయం అందిస్తున్నారు.



సెకండ్ చాన్స్ దేవుడిదే!

ఒక యాక్సిడెంట్ నా జీవితాన్ని మార్చేసింది. నాకు దేవుడు సెకండ్ చాన్స్ ఇచ్చాడు. అలా అందరికీ సెకండ్ ఛాన్స్ కావాలనే ఆలోచన వచ్చింది నాకు. ఆ ఆలోచనతోనే ఈ సెకండ్ చాన్స్ ప్రారంభించాను. బతుకడమే భారంగా మారిన వారికి మరో అవకాశం కల్పించ గలుగుతున్నాను. చివరిదశలో వాళ్లు ఆనందంగా జీవించేందుకు కృషిచేస్తున్నాను.

- జాస్పర్ పాల్

ఎక్కువ హోమ్స్

నిజానికి ఇలాంటి వృద్ధాశ్రమాలు హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయి. పిల్లల ఆదరణకు నోచుకోని వృద్ధులు, ఎవరూ లేని అనాథలతో అవి కిక్కిరిసిపోతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారికి సరైన సేవ అందడం లేదు. అందుకే పిల్లలు పెద్దవాళ్ల పట్ల సహృదయంతో ఆలోచించాలి. రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోకుండా, తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటే, వృద్ధాశ్రమాల అవసరం ఉండదు. ఇక ఎవరూలేని అనాథ వృద్ధుల కోసం సెకండ్ చాన్స్ వంటి సంస్థలు ఉండనే ఉంటాయన్నది జాస్పర్ భావన. ఎక్కువ హోమ్స్‌ను ఏర్పాటు చేసి, తక్కువ మందికి ఆశ్రయం ఇవ్వగలిగితే వాళ్లు సౌకర్యవంతంగా ఉంటారన్నది అతని ఆలోచన. ఆ దిశగానే ప్రయత్నం చేస్తున్నాడు.

మలి వయసుకు అవసరం

మలి వయసులో పెద్ద పెద్ద వ్యాయామాలు చేయడం మంచిది కాదు. ఈ వయసులో వ్యాయామం ఎందుకు అని కూడా అనుకోకూడదు. చిన్నచిన్న వ్యాయామాలు చేసి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండొచ్చు.

నాడీ శోధన ప్రాణాయామం

సుఖాసనంలో కూర్చొని కుడి చేతి వేళ్లని ముఖం ముందుకు తీసుకురండి. చూపుడు వేలు, మధ్య వేలుని నెమ్మదిగా కనుబొమ్మల మధ్య ఉంచండి. బొటనవేలిని కుడి ముక్కు మీద, ఉంగరం వేలుని ఎడమ ముక్కుపైన ఉంచండి. చిటికెన వేలుని కొద్దిగా మడిచి విశ్రాంతిగా ఉంచండి. ఇప్పుడు మెల్లగా ఉంగరపు వేలు పైకి లేపి ఎడమ ముక్కు నుంచి మెల్లగా శ్వాస తీసుకోవాలి. ఆ తర్వాత ఎడమ ముక్కుని ఉంగరం వేలితో మూయాలి. ఇప్పుడు కుడి ముక్కు నుంచి మెల్లగా శ్వాసను వదులాలి. మళ్లీ కుడి ముక్కు నుంచి గాలి పీల్చుకొని ఎడమ ముక్కు నుంచి శ్వాస వదులాలి. ఇదే ప్రక్రియను రెండు నుంచి ఐదు నిమిషాల వరకు చేయాల్సి ఉంటుంది.



ఉపయోగాలు :

- శరీరంలోని నాడులు శుభ్రపడుతాయి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. • ముఖ కాంతి పెరుగుతుంది.
- శరీర క్రియలన్నీ మెరుగవుతాయి. • శరీరానికి, మనస్సుకి మధ్య సమన్వయం పెరుగుతుంది. • కోపం తగ్గి మనసుకి ప్రశాంతత చేకూరుతుంది. • ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.

యోగా

భ్రమరీ ప్రాణాయామం

సుఖాసనంలో నిటారుగా కూర్చొని కళ్లు మూసుకోవాలి. బొటన వేళ్లతో చెవులు మూసుకోవాలి. మధ్య, ఉంగరం, చిటికెన వేళ్లను కలిపి కనుకొనల దగ్గర ఉంచాలి. అలాగని గట్టిగా నొక్కకూడదు. చూపుడు వేళ్లను కనుబొమ్మలపై ఉంచాలి. ఇప్పుడు ముక్కు పుటల ద్వారా నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. తర్వాత గాలిని 'మ్..మ్..' అని శబ్దం చేస్తూ బయటకు వదిలేయాలి. మళ్లీ శ్వాసను లోపలికి తీసుకోవాలి. ఇలా రెండు నిమిషాల నుంచి ఐదు నిమిషాలు చేయాల్సి ఉంటుంది. చేతులు నొప్పి లేస్తే చేతులు మోకాలిపై పెట్టి కూడా ఈ ప్రాణాయామం చేయవచ్చు. ఇదెంత సులభవంతమైనదో అంత ప్రభావవంతమైనది.



ఉపయోగాలు :

- ఒత్తిడి తగ్గి.. నిద్ర బాగా పడుతుంది.
- తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. తద్వారా అన్ని రకాల తలనొప్పులు తగ్గుతాయి.
- థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగవుతుంది.
- మెదడు విశ్రాంతి పొందుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది.



జె. దుర్గేష్ కుమార్
యోగా ట్రైనర్,
సంతూస్ స్టూడియో
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్
9704229212

క్రియేటివ్ సర్పంచ్



'నన్ను గెలిపిస్తే ఊరికి రోడ్లేయిస్తా.. కరెంట్ సౌకర్యం తెప్పిస్తా.. నీటి సమస్య లేకుండా చేస్తా' ఇలాంటి వాగ్దానాలు సర్పంచ్ ఎన్నికల్లో చాలానే చూసి ఉంటాం. కానీ ఈ సర్పంచ్ ఏం చేశాడో తెలుసా?

గుజరాత్‌లోని సబర్‌కాంత జిల్లా పున్సారీ గ్రామం దేశంలో అత్యుత్తమ గ్రామాల్లో ఒకటిగా చాలామందికి తెలుసు. 2006లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో హిమాంశు పటేల్ గెలిచాడు. ఆ ఎన్నికల నాటికి అక్కడ కరెంట్, మంచినీటి సౌకర్యాలు లేవు. శాంతి భద్రతల సమస్య మరీ తీవ్రంగా ఉండేది. ఇలాంటి పరిస్థితుల్లో చదువుకున్న యువకుడిగా హిమాంశు సర్పంచ్‌గా పోటీ చేశాడు. ఎలాంటి హామీలివ్వకపోయినా గ్రామస్థులంతా హిమాంశు మీద నమ్మకంతో సర్పంచ్‌గా గెలిపించారు. ఇప్పుడు ఆ ఊరు మోడల్ విలేజ్‌గా ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. ఊరంతా సీసీ కెమెరాలు, ఉచిత వైఫై, సోలార్ విద్యుత్ లాంటి ఎన్నో సౌకర్యాల కల్పించాడు హిమాంశ్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్ని అధ్యయనం చేసి తనకున్న అధికారాలు, నిధులతో ఊరిని అభివృద్ధి వైపు నడిపించాడు. గ్రామ సమస్యలను పరిష్కరించాడు. 6 వేల జనాభా ఉన్న గ్రామాన్ని ఏక తాటిపైకి తెచ్చాడు. గ్రామస్తులు, టీచర్లు, అంగన్‌వాడీలు, యువకులతో కలిపి ఒక టీమ్ తయారుచేశాడు. ఆ టీమ్ వివిధ అంశాల గురించి చర్చించి, సమస్యలు, పరిష్కారాలు సూచిస్తుంది. ఊర్లో శాంతి భద్రతలు అదుపులో ఉంచుతుంది. ఊరిలో 12 మైకులు ఏర్పాటు చేసి గ్రామ సమాచారాన్ని, గ్రామ పంచాయితీ ప్రకటనలు అనౌన్స్ చేయిస్తున్నాడు. ఉత్తమ గ్రామపంచాయతీగా, ఉత్తమ సర్పంచ్‌గా, ఉత్తమ యువ సర్పంచ్‌గా అవార్డులూ, రివార్డులూ అందుకున్నాడు.

ఆస్తమాకు హోమియో



దీర్ఘకాలిక శ్వాసకోశ ఇబ్బందిని ఆస్తమా అని చెప్పవచ్చు. ఊపిరితిత్తులలో గాలి మార్గంలో అడ్డంకులు ఏర్పడి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. శ్వాస మార్గంలో వాపు వల్ల గాలి ప్రసరించే మార్గం కుంచించుకుపోతుంది. ఫలితంగా ఆస్తమా వస్తుంది.

ఆస్తమాకు కారణాలు ఏమిటి?

- చల్లని వాతావరణం.
- దుమ్ము, ధూళి, పొగ.
- ఫంగస్, వాతావరణ కాలుష్యం.
- వైరల్, ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు.
- పెంపుడు జంతువులు, రసాయనాలు, ఘాటు వాసనలు.

అస్తమా ఎలా వస్తుంది?

ఆస్తమా వ్యాధి అలర్జీకి సంబంధించింది. కొంతమందిలో ఇది వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. దీనిని ఎటోపి అంటారు. కొంతమందిలో శరీరానికి సరిపడని యాంటీజెన్‌లు శరీరంలోకి ప్రవేశించినపుడు ఈ యాంటీబాడీలు వెలువడి శరీరాన్ని రక్షించే ప్రయత్నం చేస్తాయి. ఈ క్రమంలో కణాల నుంచి వెలువడే రసాయనాల వల్ల శ్వాసనాళాల్లో శ్లేష్మం జమ అవుతుంది. అందువల్ల శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది.

ఆస్తమా నిర్ధారణ పరీక్షలు ఏమిటి?

- అలర్జీకి సంబంధించిన పరీక్షలు.
- ముక్కు, గొంతు, ఛాతి పరీక్షలు, కఫం పరీక్ష.
- చర్మానికి సంబంధించిన అలర్జీ పరీక్షలు.
- స్పైరో మెట్రీ, ఛాతి ఎక్స్‌రే.

ఆస్తమా లక్షణాలు ఎలా ఉంటాయి?

- ఎడతెరిపి లేని దగ్గు, పిల్లి కూతలు, ఆయాసం, జ్వరం, జలుబు, శ్వాస తీసుకోలేకపోవడం, మానసిక ఆందోళన.

ఆస్తమాకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

- ప్రతిరోజూ వ్యాయామం చెయ్యడం.
- పోషకాహారం తీసుకోవడం.
- ఎక్కువ శారీరక శ్రమ లేకుండా చూసుకోవడం.
- మనసుని ప్రశాంతంగా ఉంచుకోవడం.
- దుమ్ము, ధూళి, పొగ, కాలుష్యానికి దూరంగా ఉండడం.
- చల్లని వాతావరణంలో తిరుగకుండా ఉండడం.
- సరిపడని ఆహార పదార్థాలు తీసుకోకపోవడం.

హోమియో చికిత్స ఏమిటి?

హోమియోపతిలో కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో మానసిక, శారీరక స్థితిని పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించడం జరుగుతుంది. క్రమంగా రోగనిరోధక శక్తిని పెంచి వ్యాధి తీవ్రతను తగ్గించి వ్యాధిని మూలాల నుంచి తగ్గిస్తుంది.

డాక్టర్ ఎ. ఎం. రెడ్డి
సీనియర్ వైద్యులు
పాజిటివ్ హోమియోపతి
హైదరాబాద్, నిజామాబాద్
హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
903 056 1144
903 056 1177
www.drpositive.in




వాతావరణ నిర్మాణం

వాతావరణం అనేక పొరలను కలిగి ఉంటుంది. ప్రతి పొరలోని భౌతిక, రసాయనిక ధర్మాల్లో అనేక తేడాలు ఉంటాయి. ఒక పొర నుంచి మరొక పొరకు వెళ్లేకొద్ది క్రమంగా మారుతుంటాయి. పొరల మధ్య కచ్చితమైన సరిహద్దు ఉండక అతిపాతం చెంది ఉంటాయి. భూమిని ఆనుకొని ఉన్న వాతావరణ పొరలు మందంగాను పైకి వెళ్లేకొద్ది ఉండే వాతావరణ పొరలు పల్చగాను ఉంటాయి. ఎత్తుకు వెళ్లేకొద్ది భూమి గురుత్వాకర్షణ శక్తి తగ్గడంతోపాటు బరువైన వాయువుల శాతం తగ్గి తేలికైన వాయువుల శాతం పెరుగడమే ఇందుకు కారణం. కాబట్టి వాతావరణ లక్షణాలు, గుణగణాలు, భౌతిక, రసాయన ధర్మాలు, ఉష్ణోగ్రతా వ్యత్యాసాలను దృష్టిలో ఉంచుకొని వాతావరణాన్ని ఐదు ప్రధాన ఆవరణాలు/పొరలుగా విభజించారు.

ట్రోపో ఆవరణం

- భూ ఉపరితలం నుంచి దాదాపు 13 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న వాతావరణంలోని మొదటి పొర. భూమధ్యరేఖా ప్రాంతంలో 18 కి.మీ., ధ్రువాల వద్ద కేవలం 8 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. భూమధ్యరేఖా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంవల్ల వ్యాకోచించి, ధ్రువ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడంవల్ల సంకోచించి ఉంటాయి. ఈ ఆవరణంలో ప్రతి 1000 మీ.ఎత్తుకు 6.4 డిగ్రీల సెంటిగ్రేడ్ చొప్పున లేదా ప్రతి 165 మీ. ఎత్తుకు 1 డిగ్రీ సెంటీగ్రేడ్ చొప్పున ఉష్ణోగ్రతలు తగ్గుతుంటాయి. దీన్నే సాధారణ క్షీణతా క్రమం అని అంటారు. ఈ ఆవరణ పైభాగం కంటే కింది భాగంలో ఉష్ణోగ్రత అధికంగా ఉండి సంవహన క్రియకు దోహదపడుతుంది. భూ ఉపరితలం నుంచి వాతావరణంలో చేరే దుమ్ముధూళి కణాలు నీటి ఆవిరి అంశాలు భూమి గురుత్వాకర్షణ శక్తిని అధిగమించి ఈ ఆవరణం వరకే చేరుతాయి. దీంతోపాటు ద్రవీభవనం, మేఘాలు ఏర్పడటం, ఉరుములు, మెరుపులు, అల్పపీడనాలు, వర్షపాతం వంటి వాతావరణ అలజడులన్నీ ట్రోపో ఆవరణంలోనే జరుగుతాయి. ట్రోపో ఆవరణం పై సరిహద్దుల్లో పశ్చిమం నుంచి తూర్పునకు అత్యంత వేగంతో వంకరలు తిరుగుతూ కదిలే జియోస్ట్రోపిక్ పవనాలనే 'జెట్‌స్ట్రీమ్స్' అంటారు.



స్ట్రాటో ఆవరణం

- ట్రోపోపాస్‌ను ఆనుకొని భూ ఉపరితలం నుంచి దాదాపు 50 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉన్న వాతావరణంలోని రెండో పొరను స్ట్రాటో ఆవరణమని అంటారు. ఈ ఆవరణలో ఎత్తుకు వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత దాదాపు స్థిరంగా ఉంటుంది. అయితే, ఈ ఆవరణం 25-35 కి.మీ.ల ప్రాంతంలో ఓజోన్ పొర ఉండి అతి నీలలోహిత కిరణాలను హరించడం వల్ల పై సరిహద్దులో కొద్దిగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అందువల్ల ఇక్కడ ఎలాంటి వాతావరణ అలజడులు ఏర్పడక వాతావరణం ప్రశాంతంగా పారదర్శకంగా ఉండి విమానాలు ప్రయాణించడానికి అనుకూలంగా ఉంటుంది.
- ట్రోపో ఆవరణంతో పోల్చిచూస్తే ఈ ఆవరణంలో మేఘాలు, దుమ్ము, ధూళి కణాలు, నీటి ఆవిరి చాలా తక్కువగా ఉండి ఉన్నత మేఘాలైన సిర్రస్ మేఘాలు విస్తరించి ఉంటాయి. ఈ ఆవరణాన్ని ఓజోన్ ఆవరణం అని కూడా అంటారు.

మీసో ఆవరణం

- స్ట్రాటోపాస్ తర్వాత భూ ఉపరితలం నుంచి 80 కి.మీ. వరకు విస్తరించి ఉన్న వాతావరణంలోని మూడో పొర. ఈ ఆవరణంలో ఎత్తుకు వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత చాలా ఎక్కువ స్థాయిలో తగ్గుతుంది. దీంతో ఈ ప్రాంతంలోని వాయువు అణువులు చల్లబడి నిశ్చల స్థితిలో ఉంటాయి. కానీ, ఈ పొరపైన ఉన్న థర్మో ఆవరణంలో వాయువు అణువులు అత్యంత వేగంతో కదలడంవల్ల ఈ ప్రాంతంలో ఘర్షణ బలాలు నిరంతరం జనిస్తూ విశ్వాంతరాళం నుంచి భూ వాతావరణం వైపు కదిలే ఆస్టరాయిడ్స్, తోకచుక్కలు, ఉల్కలు తదితర ఖగోళ పదార్థాలు ఈ ప్రాంతంలోకి రాగానే పూర్తిగా మండించబడి, భూగోళాన్ని పరిరక్షించడంలో ఈ పొర కీలక పాత్ర వహిస్తుంది.
- ఈ ఆవరణంలో కూడా ఉష్ణోగ్రత క్షీణతాక్రమ పరిస్థితులు ఉండటంవల్ల దీన్ని బాహ్య ట్రోపో ఆవరణమని పిలుస్తారు.

థర్మో/ఐనో ఆవరణం

- మీసోపాస్‌ను ఆనుకొని దాదాపు 400 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉన్న ఆవరణాన్ని థర్మో ఆవరణం అంటారు. ఈ ఆవరణంలో ఎత్తుకు వెళ్లే కొద్దీ అనూహ్యంగా ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది. ఈ ఆవరణంలో వాయువులు అయనీకరణం చెందడంతో దీన్ని ఐనో ఆవరణమని కూడా అంటారు. ఈ ప్రాంతంలో వాయు అణువుల మధ్య జరిగే థర్మో న్యూక్లియర్ చర్యలవల్ల విద్యుదయస్కాంత తరంగాలు జనిస్తూ రేడియో, దూరదర్శిని తరంగాలను భూమి వైపు పరావర్తనం చెందిస్తాయి.

తెలంగాణ బతుకు 'చిత్రం'



గ్రూప్స్ ప్రత్యేకం

సినిమా రంగం

- తెలుగు చిత్ర పరిశ్రమ మొదట మద్రాసు నగరంలో ఉండేది. తర్వాత హైదరాబాద్‌కు తరలివచ్చింది.
- సినిమా నిడివి, లక్ష్యం, లక్షణం, విషయం, ఫార్మాట్ మొదలైన అంశాల ఆధారంగా సినిమాలను అనేక రకాలుగా విభజిస్తారు.

ఫీచర్ ఫిలిం

- ఏదైనా ఒక కథాంశానికి సంబంధించిన వివిధ సన్నివేశాలతో కూడిన సినిమాను ఫీచర్ ఫిలిం అంటారు.
- దీని ప్రదర్శన కాలవ్యవధి గంటకు పైగా, మూడు గంటల వరకు ఉండవచ్చు.

నాన్ ఫీచర్ ఫిలిం

- ఏదైనా ఒక అంశానికి సంబంధించిన సంఘటన జరుగుతున్న కాలంలో యథాతథంగా చిత్రీకరణ జరిపితే దానిని నాన్ ఫీచర్ ఫిలిం లేదా డాక్యుమెంటరీ ఫిలిం అంటారు.
- తెలంగాణ ప్రాంతంలో ప్రధానంగా 1970 దశకం తర్వాత ఫీచర్ ఫిలింలను అధికంగా చిత్రీకరించారు.
- మొదట తెలుగు సినిమాలో బి నర్సింగరావు తెలంగాణ జీవితము, కళలు, తెలంగాణ భాష మొదలైన వాటిని ప్రతిబింబిస్తూ సినిమాలు తీశారు.

బి. నర్సింగరావు

- మెదక్ జిల్లా ప్రజ్ఞాపూర్ అనే గ్రామంలో 1946లో జన్మించారు.
- బి. నర్సింగరావు తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటుడిగా, డైరెక్టర్‌గా, నిర్మాతగా చేశారు.
- ఇతను 6 అంతర్జాతీయ అవార్డులు, 4 జాతీయ పురస్కారాలు, ఆసియా ఫిలిం ఫెస్టివల్‌లో స్పెషల్ జ్యూరీ అవార్డును అందుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2010లో ప్రతిష్ఠాత్మక బీఎన్ రెడ్డి పురస్కారాన్ని అందజేసింది.
- ఈయన ముఖ్యంగా ఆనాటి తెలంగాణ పోరాటాలు, రజాకార్ల దురాగత పరిస్థితులను, తెలంగాణ చరిత్ర అంశాలను, తెలుగు చిత్రసీమకు మొదటిసారిగా పరిచయం చేసిన దర్శకుడిగా కీర్తి పొందారు.
- అనేక పరిశోధనలు, డాక్యుమెంటరీల రూపకల్పనలో శ్యాంబెనగల్‌తో కలిసి పనిచేశారు.
- ప్రముఖ సినిమాలు 1. మా భూమి, 2. రంగుల కల, 3. దాసి, 4. మా ఊరు, 5. మట్టిమనుషులు, 6. హరివిల్లు.

1. మా భూమి, 1946 తెలంగాణ



- **నిర్మించిన సంవత్సరం :** 1979
- **నిర్మాతలు :** బి. నర్సింగరావు, జి. రవీంద్రనాథ్
- **దర్శకుడు :** గౌతమ్ ఘోష్
- **సంగీతం :** వింజమూరి సీతాదేవి
- **నిర్మాణ సంస్థ :** చైతన్య చిత్ర ఇంటర్నేషనల్
- **తారాగణం :** సాయిచంద్, కాకరాల, రామిరెడ్డి, భూపాల్‌రెడ్డి, యాదగిరి
- **సినిమాటోగ్రఫీ :** కమల్‌నాయక్
- **కథ :** కిషన్‌చందర్
- **కళాదర్శకుడు :** తోట వైకుంఠం
- తెలంగాణ మట్టి చరిత్రలో నైజాంల నుంచి భారత ప్రభుత్వానికి అధికార బదిలీ జరిగిన ఘట్టానికి సంబంధించిన ప్రహసనంలో ఎన్నో ప్రాణాలు బలయ్యాయి. అన్నింటిని మించి రైతులందరి కంటే ఓ సామూహిక శ్రామికస్వర్గ స్వప్నం భగ్నమైంది. ఈ ఛిద్రమైన శకలాలకు భగ్నమైన స్వప్నాలకు హ్యూమన్ డాక్యుమెంట్‌గా నిర్మించిన సినిమా మా భూమి.
- కిషన్‌చందర్ రచించిన 'జబ్‌ఖేత్ జాగే' అనే నవల అనువాదమైన 'పొలాలు మేల్కొన్న జైత్రయాత్ర' ఆధారంగా 'మా భూమి' సినిమాను నిర్మించారు.
- 'జబ్‌ఖేత్ జాగే' అనే నవలను తెలుగులోకి అనువదించినవారు విశాలాంధ్ర.
- 'మా భూమి' సినిమా 1980లో విడుదలైంది. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలోని కొన్ని వాస్తవాలు, సంఘటనలు జోడించి స్క్రిప్టును అభివృద్ధి చేశారు.
- మెదక్ జిల్లాలోని మంగళ్‌పర్తిలోని గ్రామస్తులు ఈ సినిమాలోని ఒక సన్నివేశంలో నటించారు.
- **ఈ సినిమాలో ప్రధాన పాత్రలు**

1. త్రిపురనేని సాయిచంద్ (రామయ్య)
2. కాకరాల రామయ్య (వీరయ్య)
3. ఎంబీవీ ప్రసాద్‌రావు (జమీందార్)

- **ఈ సినిమాలోని ప్రముఖ పాటలు :**

1. 'పల్లెటూరి పిల్లగాడా పసులగాసే మొనగాడా' – సుద్దాల హన్మంతు (రచన), సంధ్య (గాయని)
2. 'బండెనక బండికట్టి పదహారు బండ్లు కట్టి' – బండి యాదగిరి (రచన)

అవార్డులు

1. బెస్ట్ ఫీచర్ ఫిలింగా నంది అవార్డు
2. ఫిలిం ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫిలిం

2. రంగుల కల

- **నిర్మించిన సంవత్సరం :** 1984
- **నిర్మాతలు :** జీ రవీంద్రనాథ్, బీ వెంకటేశ్వరరావు
- **దర్శకుడు :** బీ నర్సింగరావు
- **సంగీతం :** గద్దర్
- **నిర్మాణ సంస్థ :** సుచిత్ర ఇంటరేల్నషనల్
- **తారాగణం :** బీ నర్సింగరావు, సాయిచంద్, గద్దర్, రూప.
- కథాంశం పెయింటింగ్‌వేసే యువకుడి జీవితంలోని సంఘటనలు

ముఖ్యమైన పాటలు

1. మదనసుందారి మదనసుందారి – గద్దర్
2) జమ్‌జమాల్ మర్రి – గద్దర్
3) భద్రం కొడుకో నా కొడుకో– గద్దర్

- **అవార్డు :** నేషనల్ ఫిలిం అవార్డు ఫర్ బెస్ట్ ఫీచర్ ఫిలిం ఇన్ తెలుగు
- శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని ఈ సినిమా సారాంశం.
- 1984లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో, ఇండియన్ పనోరమలో ప్రదర్శితమయ్యింది.
- కళల గవాక్షంలోంచి మానవుని అంతరంగ అన్వేషణ రంగులకల.

3. దాసి, 1926 తెలంగాణ

- **నిర్మించిన సంవత్సరం :** 1988
- **కథ, దర్శకత్వం, నిర్మాత :** బీ నర్సింగరావు
- **తారాగణం :** అర్చన, భూపాల్‌రెడ్డి

అవార్డులు

- 5 జాతీయ అవార్డులు గెలుచుకుంది.

1. నేషనల్ ఫిలిం అవార్డు ఫర్ ఫీచర్ ఫిలిం – బీ నర్సింగరావు
2. నేషనల్ ఫిలిం అవార్డు ఫర్ సినిమాటోగ్రఫీ – ఏ కిషోర్ బిర్
3. నేషనల్ ఫిలిం అవార్డు ఫర్ బెస్ట్ హీరోయిన్ – అర్చన
4. నేషనల్ ఫిలిం అవార్డు ఫర్ బెస్ట్ కాస్టూమ్ డిజైనర్ – సుదర్శన్
5. నేషనల్ ఫిలిం అవార్డు ఫర్ బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్ – టీ వైకుంఠం

- ఈ సినిమా అంతర్జాతీయంగా 35కు పైగా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో 'దాసి' ప్రదర్శితమైంది.

4. మా ఊరు, 1953-55 తెలంగాణ

- ఇది డాక్యుమెంటరీ ఫిలిం
- **నిర్మించిన సంవత్సరం :** 1987
- **దర్శకత్వం :** బీ నర్సింగరావు
- **నిర్మాత :** బీ రామచంద్రరావు
- 51 నిమిషాల నిడివి ఉన్న ఈ డాక్యుమెంటరీ జాతీయ స్థాయిలో 1988లో బెస్ట్ ఆంత్రోపాలాజికల్ ఫిలింగాను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రజత నంది (1989) పురస్కారాన్ని సాధించింది.
- హంగేరిలో 1992లో జరిగిన ఇంటర్నేషనల్ మీడియా ఫెస్టివల్‌లోనే డాక్యుమెంటరీల్లో మొదటి బహుమతిని పొందింది.
- బొంబాయి (1990), విటెర్బో (1993), బ్రాటిస్లావా (1995), మ్యూనిచ్ (1999) లాంటి అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైన చిత్రం మా ఊరు.

5. మట్టిమనుషులు

- **నిర్మించిన సంవత్సరం :** 1990
- **దర్శకత్వం :** బీ నర్సింగరావు
- **నిర్మాతలు :** మణికొండ వేదకుమార్, చటర్జీ
- **తారాగణం :** అర్చన
- 1990లో ఈ సినిమాకు జాతీయస్థాయిలో ఉత్తమ తెలుగు సినిమా అవార్డు లభించింది.

6. హరివిల్లు

- **నిర్మించిన సంవత్సరం :** 2003
- **కథ, దర్శకత్వం, సంగీతం :** బీ నర్సింగరావు
- **నిర్మాత :** డీ రామానాయుడు
- **స్క్రీన్‌ప్లే :** ప్రాణ్‌రావు, పతంజలి శాస్త్రి
- **తారాగణం :** భానుచందర్, నిత్య, భూపాల్ రెడ్డి, సుధాకర్.

7. ది సిటీ (డాక్యుమెంటరీ)

- హైదరాబాద్ నగరంతో తనకు ఉన్న ఆత్మీయ బంధం, అవినాభావ సంబంధం గురించి నర్సింగరావు తీసిన డాక్యుమెంటరీనే ది సిటీ.
- **స్క్రీన్‌ప్లే , దర్శకత్వం, సంగీతం, నిర్మాత :** బీ నర్సింగరావు
- 96 నిమిషాల నిడివితో తీసిన ఈ డాక్యుమెంటరీ బొంబాయి (1990), తిరువనంతపురం (1998) ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమవ్వడమేగాక 1987లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ డాక్యుమెంటరీగా రజత నంది అవార్డును గెలుచుకుంది.

8. ఆకృతి (డాక్యుమెంటరీ)

- **స్క్రీన్‌ప్లే, దర్శకత్వం :** నర్సింగరావు
- ఈ సినిమాకు హరిప్రసాద్ చౌరాసియా వేణుగానాన్ని అందించాడు.
- 11 నిమిషాల నిడివిగల ఈ డాక్యుమెంటరీ జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు (1991), ఆంధ్రప్రదేశ్ రజత నంది పురస్కారం (1991) గెలుపొందింది.
- ఈ సినిమా ప్రేరణతో 'సేవ్ ది రాక్స్ సొసైటీ' వంటి సంస్థలను స్థాపించారు.

శ్యామ్ బెనెగల్

- ఈయన 1934 డిసెంబర్ 14న బ్రిటిష్ కంటోన్మెంట్ ఆధీనంలో ఉన్న తిరుమలగిరి (సికింద్రాబాద్)లో జన్మించారు.
- ఈయన తండ్రి శ్రీధర్ బెనెగల్ ప్రముఖ ఫొటోగ్రాఫర్.
- శ్యామ్ బెనెగల్ హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో చదివి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలోనే హైదరాబాద్ ఫిలిం సొసైటీని ఏర్పాటు చేశారు.
- శ్యామ్ బెనెగల్ సుప్రసిద్ధ భారతీయ చలనచిత్ర దర్శకుడు, రచయిత.
- తన వైవిధ్య చిత్రాలతో మధ్యతరం భారతీయ సినిమాలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిన దర్శకులు.
- 900 ప్రయోజిత కార్యక్రమాలు, ప్రకటనలు, డాక్యుమెంటరీలు రూపొందించి మంచి పేరు ప్రఖ్యాతులు పొందారు.
- 1966-73 మధ్యకాలంలో పుణెలోని ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో పాఠ్యాంశాలు బోధించారు.
- శ్యామ్ బెనెగల్ మొదటి చిత్రం అంకుర్ (1973). ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న ఆనాటి ఆర్థిక, లైంగిక దోపిడీలను ఇతివృత్తంగా తీసుకొని చిత్రించారు.
- శ్యామ్ బెనెగల్ 1980-86 మధ్యకాలంలో జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థకు సంచాలకుడిగా పనిచేశారు.
- 14వ, 31వ మాస్కో అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకు జ్యూరీ సభ్యుడిగా పనిచేశారు.
- ఈయన ప్రస్తుతం ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఇన్ ఇండియాకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.
- ది చార్మింగ్ విత్ విజయ్ టెండూల్కర్ (1984), సత్యజిత్‌రే (1988), మార్కెట్ ప్లేస్ (1989) వంటి మూడు ప్రముఖ పుస్తకాలను తాను తీసిన చిత్రాల ఆధారంగా శ్యామ్ బెనెగల్ రచించారు.
- చలనచిత్ర రంగంలో శ్యామ్ బెనెగల్ చేసిన విశేష కృషికి 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మభూషణ్, 2005లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, 2013లో అక్కినేని నాగేశ్వర్‌రావు జాతీయ అవార్డు అందుకున్నారు.

మందడి నాగార్జునరెడ్డి
9885748485



జమ్ముకశ్మీర్ - ప్రత్యేకత



దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి రాజా హరిసింగ్ పాలనలో జమ్ముకశ్మీర్ ఉంది. దేశ విభజన కాలం నాటి పరిస్థితులు పాకిస్థాన్ గిరిజన మూకల దాడిని దృష్టిలో ఉంచుకొని 1947, అక్టోబర్ 26న కశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేస్తూ రాజా హరిసింగ్ విలీన పత్రంపై సంతకాలు చేశారు.

- భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి కశ్మీర్ పార్ట్-బి రాష్ర్టాల జాబితాలో ఉండేది. 1956 రాష్ర్టాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా మన దేశంలోని ఇతర రాష్ర్టాల మాదిరిగానే కశ్మీర్‌ను రాజ్యాంగంలోని 1వ షెడ్యూల్‌లో చేర్చారు.
- దేశ విభజన కాలంనాటి పరిస్థితులు, కశ్మీర్ భారత్‌లో విలీనమైనప్పుడు ఒప్పంద పత్రంలోని అంశాలను ఆధారం చేసుకొని రాజ్యాంగ నిర్మాతలు జమ్ముకశ్మీర్‌కు 370 అధికరణ ద్వారా ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించారు.
- 1951లో ఏర్పడిన జమ్ముకశ్మీర్ రాజ్యాంగసభ 1957, జనవరి 26 నాటికి సొంత రాజ్యాంగాన్ని రూపొందించి అమల్లోకి తీసుకువచ్చింది. రాజ్యాంగం 21వ భాగంలోని 370వ అధికరణ ద్వారా కశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక సదుపాయాలు కేవలం తాత్కాలికమైనవిగా పేర్కొన్నారు. అయితే, 1975లో ఇందిరాగాంధీకి... షేక్ అబ్దుల్లాకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించడానికి ప్రజానిర్ణయ సేకరణ జరుపాలనే డిమాండ్‌ను షేక్ అబ్దుల్లా వదులుకున్నారు. రాజ్యాంగం ద్వారా కశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక సదుపాయాలు కొనసాగడానికి ఇందిరాగాంధీ అంగీకరించారు.
- 1954లో రాష్ట్రపతి ఉత్తర్వులను రాజ్యాంగ ప్రవేశిక, మొదటి, రెండు, మూడు భాగాల్లోని అంశాలు కొన్ని మార్పులతో జమ్ముకశ్మీర్‌కు వర్తించేటట్లు జారీ చేశారు. 1958లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా కాగ్ అధికారాలు 12వ, 13వ, 14వ భాగాలు వర్తించే విధంగా మార్పులు చేశారు.

భారత యూనియన్- జమ్ముకశ్మీర్ సంబంధాలు

- జమ్ముకశ్మీర్ సొంత రాజ్యాంగాన్ని కలిగి ఉంటుంది. అంటే మన దేశంలో ప్రత్యేకంగా సొంత రాజ్యాంగాన్ని కలిగి ఉన్న ఏకైక రాష్ట్రం జమ్ముకశ్మీర్. అలాగే రెండు రాజ్యాంగాలు కలిగి ఉన్న ఏకైక రాష్ట్రం జమ్ముకశ్మీర్.
- జమ్ముకశ్మీర్ భూభాగాల మార్పిడులు, దాని పేరు మార్పు విషయంలో రాష్ట్ర శాసనసభ ఆమోదం లేకుండా పార్లమెంట్ ఎలాంటి శాసనం చేయరాదు.
- జమ్ముకశ్మీర్ భూభాగంపై సరిహద్దుల మార్పులను ప్రభావితం చేసే విధంగా పార్లమెంట్ ఆ రాష్ట్ర శాసనసభ అనుమతి లేకుండా ఎలాంటి అంతర్జాతీయ ఒప్పందాలు చేయరాదు.
- అవశిష్ట అధికారాలు ఆ రాష్ట్ర శాసనసభకే చెందుతాయి. అంటే రాష్ట్ర శాసనసభ చట్టాలను రూపొందిస్తుంది.
- 1947 ఒప్పందం తర్వాత నుంచి 1954 వరకు పాకిస్థాన్‌కు వలస వెళ్లి తిరిగి వచ్చి కశ్మీర్‌లో స్థిరపడ్డ వారికి పౌరసత్వాన్ని కల్పించడంలో కశ్మీర్ శాసనసభ చేసే చట్టాలు చెల్లుబాటు అవుతాయి.
- 352 అధికరణను అనుసరించి అంతరంగిక జాతీయ అత్యవసర పరిస్థితిని వర్తింజేయాలంటే ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదం తప్పనిసరి.
- 365 అధికరణను అనుసరించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను పాటించలేదనే నెపంతో ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసే అవకాశం లేదు.
- 1964లో సవరణలను అనుసరించి 356, 357 అధికరణలను జమ్ముకశ్మీర్‌కు వర్తింపజేశారు. 356 అధికరణను అనుసరించి ఆ రాష్ట్రంలో 1986లో మొదటిసారి రాష్ట్రపతి పాలనను విధించారు.
- 1986లో రాజ్యాంగ సవరణ ప్రకారం 249 అధికరణను అనుసరించి రాజ్యసభ చేసే తీర్మానం వల్ల రాష్ట్ర జాబితాకు సంబంధించిన అంశంపై తాత్కాలికంగా శాసనం చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి బదిలీ అయ్యే అంశాన్ని జమ్ముకశ్మీర్‌కు కూడా వర్తింపజేశారు.
- జమ్ముకశ్మీర్‌లో ఆర్థిక అంశాలపై అత్యవసర పరిస్థితిని విధించే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి లేదు.

జమ్ముకశ్మీర్ ప్రత్యేకతలు

- భారత రాజ్యాంగంలో పొందుపరిచిన IVవ భాగంలోని నిర్దేశిక నియమాలు కశ్మీర్‌కు వర్తించవు.
- రాజ్యాంగాన్ని సవరించి ఆస్తిహక్కును 1978లో చట్టబద్ధమైన హక్కుగా మార్చినా జమ్ముకశ్మీర్‌లో ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుగానే కొనసాగుతున్నది.
- జమ్ముకశ్మీర్ రాజ్యాంగంలోని 92వ అధికరణ ప్రకారం ఆ రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం విఫలమైతే గవర్నర్ పరిపాలనను విధించవచ్చు.
- జమ్ముకశ్మీర్ రాజ్యాంగాన్ని సవరించాలంటే ఆ రాష్ట్ర శాసనసభలో 2/3 వంతు మెజారిటీతో ప్రత్యేక తీర్మానం ఆమోదించాలి.
- జమ్ముకశ్మీర్ రాష్ట్ర ప్రజలకు కల్పించిన ప్రత్యేక పౌరసత్వ హక్కుల ప్రకారం ఆ రాష్ట్రంలో ద్వంద్వ పౌరసత్వం అమల్లో ఉంది.
- రాష్ట్ర శాసనసభ తీర్మానాన్ని అనుసరించి భారత రాష్ట్రపతి 370(3) అధికరణ ప్రకారం జమ్ముకశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక అధికారాలను రద్దు చేయవచ్చు.

పత్యేక ప్రతిపత్తి (370 అధికరణ)

- 152వ అధికరణలో ఇతర రాష్ర్టాలతోపాటు జమ్ముకశ్మీర్ పేరును ప్రస్తావించలేదు.
- 370వ అధికరణ కశ్మీర్ ప్రత్యేక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.
- 1951లో జమ్ముకశ్మీర్ రాజ్యాంగ పరిషత్ సార్వత్రిక వయోజన ఓటు హక్కు ప్రాతిపాదికగా ఎన్నుకోవడం ద్వారా ఏర్పడింది.
- 1957 జనవరి 26న జమ్ముకశ్మీర్ రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.
- జమ్ముకశ్మీర్ రాజ్యాంగంలో 138 అధికరణలు 8 భాగాలు ఉన్నాయి.
- జమ్ముకశ్మీర్ రాజ్యాంగాన్ని ఆ రాష్ట్ర శాసనసభ 2/3వంతు ప్రత్యేక మెజార్టీతో సవరిస్తుంది. ఈ అధికారం పార్లమెంట్‌కు లేదు.
- 123 అధికరణ ప్రకారం ఆ రాష్ర్టానికి వర్తించే ఆర్డినెన్సులను జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉన్నది.
- ఆ రాష్ట్ర శాసనసభ ప్రత్యేక తీర్మానాన్ని అనుసరించి 370 అధికరణ ప్రకారం ఆ రాజ్యాంగాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.
- రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు జమ్ముకశ్మీర్‌లో వర్తించవు.
- దేశ పౌరసత్వంతోపాటు రాష్ట్ర పౌరసత్వం కూడా అమలులో ఉండడం వల్ల జమ్ముకశ్మీర్‌లో ద్వంద్వ పౌరసత్వం ఉంది.

ప్రతిభకు పరీక్ష

1. ఎడారి జాతీయ పార్క్ రాజస్థాన్‌లో ఉంది. 3162 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్‌లో ఎడారి నక్కలు, బెంగాల్ నక్కలు, ఎడారి పిల్లి, తదితర జంతువులు ఉన్నాయి. అయితే ఈ పార్క్ ఏ ప్రాంతానికి సమీపంలో ఉంది?

1) జైసల్మేర్ 2) జైపూర్
3) మౌంట్ అబూ 4) జోధ్‌పూర్

2. 2016-17 సంవత్సరానికిగాను బెస్ట్ ఫర్‌ఫార్మెన్స్ అవార్డును కింది ఏ గ్రామీణ బ్యాంక్‌కు ప్రకటించింది?

1) తెలంగాణ గ్రామీణ బ్యాంక్
2) కర్ణాటక గ్రామీణ బ్యాంక్
3) అలహాబాద్ గ్రామీణ బ్యాంక్
4) మధ్యాంచల్ గ్రామీణ బ్యాంక్

3. "The Adivasi Will Not Dance" పుస్తక రచయిత?

1) హెచ్‌ఎస్ శేఖర్
2) అరుంధతీరాయ్
3) మహాశ్వేతాదేవి
4) రంజన్ గగోయ్

4. దేశంలో మొట్టమొదటి ఏవియేషన్ యూనివర్సిటీని ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు?

1) ఉత్తరప్రదేశ్ 2) కర్ణాటక
3) తెలంగాణ 4) తమిళనాడు

5. రాజ్యసభ టీవీ సీఈవోగా ఎవరు నియమితులయ్యారు?

1) గురుదీప్ సింగ్ సప్పాల్
2) సూర్యప్రకాశ్
3) వినయ్ సహస్రబుద్ధి
4) శశిశేఖర్ వెంపటి

సమాధానాలు గురువారం నిపుణలో...

1-1, 2-2, 3-1, 4-2, 5-1, 6-2


చిరంజీవి

సై..రా నరసింహారెడ్డి!

స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కనున్న తాజా చిత్రం ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. సురేందర్‌రెడ్డి దర్శకుడు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. పద్దెమినిదవ శతాబ్దానికి చెందిన స్వాతంత్ర్య సమరసేనాని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీరోచిత పోరాటానికి దృశ్యరూపంగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. వివిధ భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని అనువాదం రూపంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని నేడు ప్రకటించబోతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'సై...రా నరసింహారెడ్డి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. 'సై..రా' ప్రధాన టైటిల్ కాగా..'నరసింహారెడ్డి' ఉపశీర్షికగా వుంటుందని తెలిసింది. దాదాపు 150కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

ఏడాది తర్వాత..

మహిళా ప్రధాన చిత్రాలు, ప్రయోగాత్మక కథాంశాలతో తమిళంలో ప్రతిభను చాటుకుంటున్నది నయనతార. కోలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న ఆమె టాలీవుడ్‌లో అడపాదడపా నటిస్తున్నది. దాదాపు ఏడాది విరామం తర్వాత తెలుగులో ఆమె ఓ సినిమా చేస్తున్నది. సింహా, శ్రీరామరాజ్యం తర్వాత బాలకృష్ణ, నయనతార కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రానికి కె.యస్. రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవలే ప్రారంభమైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుగుతున్నది. సోమవారం నుంచి నయనతార చిత్రీకరణలో పాల్గొంటున్నది. నిర్మాత మాట్లాడుతూ 'శక్తివంతమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలకృష్ణ, నయనతార కెమిస్ట్రీ అలరిస్తుంది. నయనతార పాత్ర సరికొత్త పంథాలో ఉంటుంది' అని తెలిపారు. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్‌రాణా, మురళీమోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: ఎం.రత్నం, కెమెరా: సి.రాంప్రసాద్, సంగీతం: చిరంతన్‌భట్.


నయనతార

సంగీతం మహా సముద్రం

'ప్రతి కథానాయకుడికి ఒక స్టైల్ వుంటుంది. వారి ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని కథానుగుణంగా సంగీతాన్నందించేందుకు ప్రాధాన్యతనిస్తాను' అంటున్నారు అనూప్‌రూబెన్స్. మనసును స్పృశించే విలక్షణ బాణీలతో తెలుగు సినీ సంగీతంలో తనకంటూ ప్రత్యేకతను సృష్టించుకున్నారాయన. శ్రావ్యమైన బాణీలతో సాగే ప్రణయగీతాలు, హుషారెత్తించే మాస్ బీట్‌లతో సంగీతప్రియుల్ని అలరిస్తూ విజయవంతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన సంగీత దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి' ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా అనూప్‌రూబెన్స్ ఇటీవల హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ సంగతులివి...


అనూప్‌రూబెన్స్

- **తొలిసారి రాజకీయ నేపథ్యంలో...**

ఇప్పటివరకు నేను రాజకీయ నేపథ్య చిత్రానికి సంగీతాన్నందించలేదు. అందుకే నా కెరీర్‌లో 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాన్ని ప్రత్యేకంగా భావిస్తున్నాను. స్క్రిప్ట్ విన్నప్పుడే ఉద్విగ్నతకు లోనయ్యాను. రానా పాత్రలో భిన్న పార్శ్వాలు కనిపించాయి. మనసును కదిలించే సంగీతాన్నదించేందుకు మంచి అవకాశంలా అనిపించింది. ఇక దర్శకుడు తేజతో ఎన్నో ఏళ్లుగా ప్రయాణం చేస్తున్నాను. ఆయన అభిరుచులేమిటో బాగా తెలుసు. ఈ సినిమాలో పాటలతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగుందని అందరూ ప్రశంసిస్తున్నారు. నేపథ్య సంగీతం సన్నివేశాల్లోని భావోద్వేగాలకు మరింత గాఢతను అద్దిందని అందరూ మెచ్చుకుంటున్నారు.

- **పాటలు కథ చెబుతాయి....**

'నేనే రాజు నేనే మంత్రి' చిత్రంలో సాధారణ పంథాకు భిన్నంగా సంగీతాన్నందించే అవకాశం లభించింది. ఈ చిత్రంలోని పాటలు కూడా కథలోని భావాన్ని ఆవిష్కరిస్తూ సాగుతాయి. అందుకే ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకునేలా స్వరరచన చేసే వీలు కలిగింది. కథలోని భావాలకు అనుగుణంగా పాటలు సాగితే వాయిద్యాల్ని అనుకున్న విధంగా ఉపయోగించుకోవచ్చు. ఈ సినిమాలో ఎక్కువగా వయొలిన్, కోరస్ బ్యాక్‌గ్రౌండ్‌ను వాడాను.

- **'సావిత్రి' కుదరలేదు...**

ఆరేళ్ల క్రితం వెంకటేష్ కథానాయకుడిగా తేజ దర్శకత్వంలో 'సావిత్రి' పేరుతో ఓ సినిమా చేయాలనుకున్నారు. ఆ సినిమాకు నేను కొన్ని బాణీలను సమకూర్చాను. అనుకోని కారణాల వల్ల ఆ చిత్రం కార్యరూపం దాల్చలేదు. ఆ చిత్రం కోసం తయారు చేసుకున్న ఓ బాణీని 'జోగేంద్ర జోగేంద్ర' పాట కోసం తీసుకున్నాను.

- **ప్రతిరోజు నేర్చుకోవాల్సిందే..**

సంగీతం మహా సముద్రంలాంటిది. ప్రతి రోజు కొత్త విషయాన్ని నేర్చుకుంటూ వుండాలి. ప్రతి ఆరు నెలలకొకసారి మార్కెట్‌లో కొత్త వాయిద్య పరికరాలు వస్తుంటాయి. వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయితేనే ట్రెండ్‌కు తగినట్లుగా సంగీతాన్నందించగలుగుతాం. నేను సంగీతాన్ని ఎంతగానో ప్రేమిస్తాను. ఒక్కో హీరో దగ్గర ఒక్కో ప్రత్యేకత వుంటుంది. వారి ఇమేజ్‌ను బట్టి సంగీతాన్ని అందించాలి. యువ దర్శకులతో పనిచేయడాన్ని ఎక్కువగా ఇష్టపడతాను. వారు సంగీతపరంగా సృజనాత్మకంగా ఆలోచిస్తుంటారు.

- **అఖిల్ పాట పాడాడు..**

ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 'పైసా వసూల్' చిత్రంతో పాటు అఖిల్ హీరోగా విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి సంగీతాన్నందిస్తున్నాను. బాలకృష్ణ వంటి సీనియర్ హీరోతో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది. సినిమాలో ఆయన పాడిన పాట వైరల్‌గా మారింది. ఇక విక్రమ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో అఖిల్‌తో ఓ పాట పాడించాను. అతని గళం చాలా బాగుంటుంది. త్వరలో ఈ పాటను విడుదల చేయబోతున్నాం.


సూరజ్, సానియా

ప్రేమ కన్న స్నేహమే మిన్న

సూరజ్, రవీంద్రతేజ, సానియా, స్నిగ్ధ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '2 ఫ్రెండ్స్'. 'ట్రూ లవ్' చిత్ర ఉపశీర్షిక. జి.ఎల్.బి. శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. అనంతలక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై ముళ్ళగూరు అనంతరాముడు, ముళ్ళగూరు రమేష్‌నాయుడు నిర్మిస్తున్నారు. ఈ నెలాఖరున ప్రారంభమయ్యే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రేమకంటే స్నేహం గొప్పదనే కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. వినోదంతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం ఉంటుంది. వరంగల్, బెంగళూరు, అనంతపురం, కర్నాటకలో చిత్రీకరించిన మూడు షెడ్యూళ్లలో ప్రధాన ఘట్టాలతో పాటు పాటలను చిత్రీకరించాం. ఈ నెలాఖరున తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం. ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: టి.సురేందర్‌రెడ్డి, కథ, మాటలు, సంగీతం: పోలూర్ ఘటికాచలం.


ఇలియానా

ఇలియానాగ్రహం...!

హద్దులు మీరిన అభిమానుల ప్రవర్తనతో గోవా భామ ఇలియానా కోపోద్రిక్తురాలైంది. ట్విట్టర్ వేదికగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. మనందరం ఓ కలుషిత వాతావరణంలో జీవనం సాగిస్తున్నామని మండిపడింది. ఈ అమ్మడి వీరావేశానికి ఓ సంఘటన కారణమైంది. వివరాల్లోకి వెళితే...ముంబయిలో ఇటీవల తన తాజా చిత్రం 'బాద్షాహో' ప్రచార కార్యక్రమాల్ని ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఇలియానాను ట్రాఫిక్ కూడలి వద్ద కొద్దరు అభిమానులు అడ్డగించారట. ఆమె పేరు పెట్టి పెద్దగా పిలుస్తూ కారు డోర్‌ను లాగే ప్రయత్నం చేశారట. వారిలో ఇద్దరు కారు బానెట్‌పైకి ఎక్కి కూర్చుని కారుని ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారట. ఏదో విధంగా ఆ అల్లరిమూక బారి నుంచి బయటపడ్డానని, అభిమానుల పేరుతో అమర్యాదగా ప్రవర్తించడం క్షమించరాని నేరమని ఇలియానా పేర్కొంది. 'ఇలాంటి చర్యల వల్ల కథానాయికలు ప్రైవేట్ జీవితాన్ని కోల్పోతున్నారు. సెలబ్రిటీని అయినంత మాత్రాన నా వ్యక్తిగత జీవితాన్ని భంగపరిచే హక్కు ఎవరికీ లేదు. ఇదంతా మూర్ఖపు అభిమానం' అంటూ ట్విట్టర్‌లో ఘాటుగా స్పందించింది ఇలియానా.

హిందీలో 'ప్రస్థానం'

ప్రస్థానం (2010) చిత్రం తెలుగులో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. రాజకీయం, అధికార వాంఛ, వారసత్వం ప్రధానాంశాలుగా విభిన్న కథాంశంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఈ చిత్రంలో సాయికుమార్, శర్వానంద్, సందీప్‌కిషన్ ప్రధాన పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా బాలీవుడ్‌లో రీమేక్ కాబోతుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్‌కు ఈ సినిమా ఎంతగానో నచ్చిందట. దాంతో స్వీయనిర్మాణంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. ఈ ప్రాజెక్ట్ విషయమై దర్శకుడు దేవాకట్టాతో సంజయ్‌దత్ సంప్రదింపులు జరుపుతున్నారని, త్వరలో తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ప్రస్తుతం సంజయ్‌దత్ 'భూమి' చిత్రంలో నటిస్తున్నారు.


సంజయ్‌దత్

పల్లెటూరి ప్రేమాయణం


తేజ

చూడాలని ఉంది, ఇంద్ర, యువరాజుతో పాటు తెలుగులో దాదాపు యాభైకి పైగా చిత్రాల్లో బాలనటుడిగా కనిపించిన తేజ కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అతడిని హీరోగా పరిచయం చేస్తూ లక్కీ మీడియా పతాకంపై ఓ చిత్రం తెరకెక్కనుంది. బెక్కెం వేణుగోపాల్ నిర్మాత. హరి దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే నవతరం ప్రేమకథా చిత్రమిది. నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సంస్థలో ఎనిమిదేళ్ల పాటు దర్శకత్వ విభాగంలో పనిచేసిన అనుభవంతో హరి ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. సన్నీ.ఎం.ఆర్ బాణీలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని తెలిపారు.







నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతోపాటు ఉపాధి

■ దరఖాస్తులు ఆహ్వానించిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 30 రోజుల ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ ఎన్ కిశోర్‌రెడ్డి సోమవారం తెలిపారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, మైక్రోమేటిక్ మెషిన్ టూల్స్ బెంగళూరు కంపెనీ సంయుక్తంగా ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, ఏదైనా డిప్లొమా విద్యార్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు 18 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్సు కల్గి, 30 రోజుల శిక్షణ అనంతరం ఉద్యోగం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం నగరాల్లో ఉపాధి కల్పించి, నెలకు రూ.8 వేలు వేతనం చెల్లించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 30 లోగా ఒరిజినల్ సర్టిఫికెట్స్, పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డును యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలో ఉన్న స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9951181416, 9676389944 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

త్వరలో నూతన మద్యం పాలసీ

గీత కార్మికులకు ఆధునిక యంత్రాలు.. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పద్మారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో త్వరలో నూతన మద్యం పాలసీ అమల్లోకి తీసుకొస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. నూతన మద్యం పాలసీపై పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం కేసీఆర్‌కు అందజేస్తామని తెలిపారు. సీఎం అనుమతితో నూతన మద్యం పాలసీ అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. సోమవారం ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పద్మారావు నూతన మద్యం పాలసీపై సమీక్షించారు. ఐఎంఎఫ్‌ఎల్ లైసెన్స్ కలిగిన వారితో సమావేశం ఏర్పాటుచేసి డ్రాఫ్ట్ పాలసీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. డినోటిఫికేషన్ ఆఫ్ స్టేట్ హైవేస్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చివరిగా ఎన్ని దుకాణాలు ఉంటాయి, ఎన్ని దుకాణాలు మార్చాల్సి ఉంటుందని ఆరా తీశారు. ఈ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులకు స్పష్టంచేశారు. గీతా కార్మికులకు చెట్లు ఎక్కే యంత్రాల పరిశీలన, నీరా స్టోరేజ్, మార్కెటింగ్, కల్లు గీత కార్మికులకు గుర్తింపుకార్డులు జారీప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అడిగారు. ఈ ప్రక్రియ జాప్యం జరుగడంపై మంత్రి పద్మారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల బదిలీలు త్వరితగతిన చేయాలని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు మూసివేసి గౌడ కులస్థుల పొట్టకొట్టిన ఘనత గత పాలకులకే దక్కిందని విమర్శించారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు తెరిచి వేల మంది గౌడ కులస్థులకు ఉపాధి కల్పించారన్నారు. చెట్టుపై నుండి కిందపడి చనిపోయిన గీత కార్మికుడికి ఎక్స్‌గ్రేషియా రూ.2 నుంచి రూ.5 లక్షలకు, శాశ్వత అంగవైకల్యం కలిగినవారికి రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు సీఎం కేసీఆర్ పెంచారని తెలిపారు. గీత కార్మికుల మరణాలను తగ్గించడానికి తాటి, ఈత చెట్లు ఎక్కే యంత్రాలను ఉచితంగా అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్, కమిషనర్ చంద్రవదన్, జాయింట్ సెక్రటరీ రామ్‌సింగ్, అడిషనల్ కమిషనర్ రాజశేఖర్‌రావు, టీఎస్‌బీసీఎల్ మేనేజర్ సంతోష్‌రెడ్డి, ఓఎస్డీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం నూతన మద్యం పాలసీపై ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పద్మారావు. చిత్రంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్, కమిషనర్ చంద్రవదన్, జాయింట్ సెక్రటరీ రామ్‌సింగ్, అడిషనల్ కమిషనర్ రాజశేఖర్‌రావు, టీఎస్‌బీసీఎల్ మేనేజర్ సంతోష్‌రెడ్డి, ఓఎస్డీ రాజేశ్వర్‌రావు

మంత్రి తుమ్మలకు ఎంపీ వినోద్ పరామర్శ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఫిలింనగర్‌లోని మంత్రి ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తుమ్మల త్వరగా కోలుకోవాలని వినోద్‌కుమార్ ఆకాంక్షించారు.

టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు సిరాజ్ సోమవారం టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ గులాబీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. సిరాజ్‌తోపాటు ఖైరతాబాద్‌కు చెందిన మహమూద్ సహిద్ సాహెబ్ కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలిపోయిన డిగ్రీ సీట్ల భర్తీపై సమావేశం నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు మంగళవారం మధ్యాహ్నం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఉన్నత విద్యామండలి అధికారులతో సమావేశం కానున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, విద్యాశాఖ కమిషనర్, దోస్త్-2017 అధికారులతో పాటు సీజీజీ అధికారులు సమావేశానికి హాజరుకానున్నారు. దోస్త్-2017 సీట్ల కేటాయింపులో తలెత్తిన గందరగోళం, విద్యార్థులకు జరిగిన నష్టంపై అధికారులతో డిప్యూటీ సీఎం చర్చించనున్నారు. డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియకు సాంకేతిక సహకారం అందించిన సీజీజీపైనా ఆయన దృష్టి సారించారు. సీజీజీలో తలెత్తిన సాంకేతిక తప్పిదంవల్లే డిగ్రీ ఆన్‌లైన్ సీట్ల కేటాయింపు గందరగోళం ఏర్పడిందని ఇప్పటికే అధికారులు గుర్తించారు. విద్యార్థులకు న్యాయం చేసేందుకు నాలుగో విడుత దోస్త్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నట్లు సమాచారం.

దివ్యాంగుల చట్టం అమలుకు నిధులు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగుల చట్టం -2016 ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.59 కోట్లు విడుదల చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ మేరకు సోమవారం మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎం జగదీశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ భవన్ ఏర్పాటు చేయండి

■ మంత్రి ఈటలకు బీసీ సంక్షేమ సంఘం వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీసీ కులాల సమావేశాల నిర్వహణకు బీసీ భవన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పదెకరాల స్థలంలో బీసీ భవన్‌ను నిర్మించాలని వారు మంత్రిని కోరారు. బీసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇందుకు అనుగుణంగా బీసీలకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. మంత్రి ఈటలను కలిసినవారిలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సంఘం ప్రతినిధులు దుర్గయ్యగౌడ్, కనకాల శ్యాం, కుల్కచర్ల శ్రీనివాస్, ఆర్ యుగంధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

27 నుంచి టీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర మహాసభలు

■ విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా కేంద్రంగా ఈ నెల 27 నుంచి నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘ్ సోమవారం పిలుపునిచ్చింది. కార్మిక వ్యతిరేక విధానాలు, ఎదురవుతున్న సవాళ్లు, హక్కులను కాపాడుకోవడంలో అనుసరించాల్సిన విధానాలపై అన్నివర్గాల కార్మికుల సమక్షంలో చర్చ జరుగుతుందని ఓ ప్రకటనలో తెలిపింది.

ఉత్తరకొరియాలో చివరి అమెరికా సైనికుడి మృతి

■ ధ్రువీకరించిన ఆయన కుటుంబసభ్యులు

సియోల్, ఆగస్టు 21: సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఉత్తరకొరియాకు వెళ్లిపోయి అక్కడే జీవిస్తున్న అమెరికాకు చెందిన చివరి సైనికుడు జేమ్స్ జోసెఫ్ డ్రెస్నాక్ (74) మృతి చెందారు. ఉత్తరకొరియా అధినేత, గొప్ప నాయకుడు మిమ్ జోంగ్ ఉన్ తమ తండ్రి మృతికి నివాళులు అర్పించారని ఆయన కుమారులు తెలిపారు. 1950-53 కొరియా యుద్ధం తర్వాత అమెరికన్ సైనికుల్లో కొందరు ఏడారిలో చిక్కుకుపోయారు. 1962లో జేమ్స్ జోసెఫ్ డ్రెస్నాక్‌సహా కొందరు భారీ కోటను దాటి ఉత్తరకొరియాలో ప్రవేశించారు. అనంతరం ఉత్తరకొరియా ప్రచార చిత్రాల్లో డ్రెస్నాక్ కనిపించారు. చివరి అమెరికా సైనికుడు దేశంలో బతికి ఉన్నారని, మిగతా వారంతా చనిపోయి, లేదా దేశం వీడి వెళ్లి ఉంటారని అంతా భావించారు. గత ఏడాది నవంబర్‌లో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ జేమ్స్ జోసెఫ్ డ్రెస్నాక్ చనిపోయారని ఆయన కుమారులు టెడ్, జేమ్స్ డ్రెస్నాక్ తెలిపారు. తమ ఇంటర్వ్యూ వీడియోను వారు ప్రభుత్వం ఆధ్వర్యంలోని వెబ్‌సైట్ యురిమిన్‌జొంకిరిలో పోస్టుచేశారు.

నీట్ అక్రమాలపై వివరణ ఇవ్వండి

■ కేంద్రం, పోలీసులకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: 2016లో జరిగిన జాతీయ అర్హత ప్రవేశ పీజీ పరీక్ష (నీట్)లో జరిగిన అక్రమాలపై వివరణ ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని, పోలీసులను ఢిల్లీ హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సీ హరిశంకర్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌బీఈ), మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ), ప్రొమెట్రిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీబీఐకి కూడా నోటీసులు జారీచేసింది. గతేడాది నీట్ పీజీ పరీక్షను దేశవ్యాప్తంగా 43 కేంద్రాల్లో సీఎంఎస్ ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంజినీర్లను అద్దెకు తీసుకొని ల్యాబులల్లో నీట్ పీజీ పరీక్షను నిర్వహించింది. ప్రొమెట్రిక్ కంపెనీ ఉప కాంట్రాక్ట్‌ను సీఎంఎస్ కంపెనీకి ఇచ్చింది. ఈ కేసు విచారణ ఆలస్యం అవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. కేసు విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్నందున వారంలో స్టేటస్ రిపోర్ట్ ఫైల్ చేయాలని ఆదేశించింది. విచారణను సెప్టెంబర్ 10కి వాయిదావేసింది. మధ్యప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన వ్యాపం కుంభకోణంపై పిటిషన్ దాఖలు చేసిన డాక్టర్ ఆనంద్ రాయ్ నీట్‌పై ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఓపెన్ కోటాలో ఏపీ చేతివాటం

ఇంజినీరింగ్, మెడికల్ సీట్ల భర్తీలో వేర్వేరు విధానాలు ● 15 శాతం సీట్లపై స్టేట్ యూనివర్సిటీల ఇష్టారాజ్యం ● ఉస్మానియా సీట్లు కూడా సీమాంధ్ర విద్యార్థులతోనే భర్తీ

జీవోలో మరింత స్పష్టత ఉండాలంటున్న విద్యాధికారులు ● చర్చకు త్వరలోనే వీసీల సమావేశం: తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలలో సీట్ల భర్తీ కోసం అమలు చేస్తున్న 15 శాతం ఓపెన్ కోటా విధానంలో స్పష్టత కొరవడిందని, ఇందువల్ల తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీలలో ఒక విధంగా, మెడికల్ కాలేజీలలో మరో తీరుగా ఓపెన్ కోటా సీట్ల భర్తీ జరుగుతున్నదని ఏపీ చేతివాటం ప్రదర్శిస్తున్నదని అంటున్నారు. స్టేట్ యూనివర్సిటీలు కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు పలువురు ప్రొఫెసర్లు, విద్యాధికారులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఓపెన్ కోటాలో రిజర్వేషన్ల విధానం ఉండాలా? లేక పూర్తి మెరిట్ లేదా ర్యాంకుల ఆధారంగా సీట్లను నింపాలా? అనే విషయమై స్పష్టత లేకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. ఓపెన్ కోటా సీట్ల భర్తీపై జీవోలో ఉన్న అంశాలను ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అన్వయించుకుంటున్నారని కొందరు సీనియర్ అధికారులు చెప్తున్నారు. అలాగే స్టేట్ యూనివర్సిటీల్లో భర్తీ కోసం తొలివిడుత కౌన్సెలింగ్‌లో మొత్తం సీట్ల సంఖ్యను చూపించకుండా వాటిని రెండు లేదా మూడో విడుతల కోసం ఖాళీగా పెట్టవచ్చా? అనే అంశంపై కూడా యూనివర్సిటీల మధ్య ఏకాభిప్రాయం కొరవడింది. ఇలాంటి సమస్యే జేఎన్‌యూఎఫ్‌ఏ యూనివర్సిటీలో తలెత్తింది. తొలి విడుత కౌన్సెలింగ్‌లో 15 శాతం ఓపెన్ కోటాలో రిజర్వేషన్ల అమలు పేరుతో వాటిని భర్తీ చేయకుండా ఖాళీగా చూపించారు. ఈ విధానాన్ని కొన్ని వర్సిటీల అధికారులు తప్పుబడుతున్నారు.

15 శాతం నాన్ లోకల్ కోటా కాదు!

ఉన్నత విద్యాసంస్థలలో 15 శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్ పేరుతో భర్తీ చేస్తున్నారు. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఒక మెడికల్ కాలేజీలో 15 శాతం ఓపెన్ కోటా మూడు ప్రాంతాలకు (అంటే ఉస్మానియా, ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర వర్సిటీల పరిధి) కలిపి భర్తీ చేయాలి. కాని ఇందుకు విరుద్ధంగా ఉస్మానియా ప్రాంత విద్యార్థులను పక్కకు పెట్టి రెండు సీమాంధ్ర వర్సిటీలకు చెందిన వారితో సీట్లను భర్తీ చేస్తున్నారని నిపుణులు తెలిపారు. రాష్ట్రం విడిపోయి మూడేండ్లయినా ఇప్పటికీ విభజనకు నోచుకోని కొన్ని విద్యాసంస్థలలో ఇలాంటి అవకతవకలు జరుగుతున్నాయని తెలంగాణ వారు మొదటి నుంచీ చెప్తున్నా వినేవారు కరువయ్యారు. ఏపీ అధికారులు, ప్రొఫెసర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలంగాణ అధికారులు వాపోతున్నారు. అయితే ఓపెన్ కోటాలో రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉందని, జీవోలు కూడా ఇదే చెప్తున్నాయని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కాకపోతే జీవోలో మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి కూడా ఇదే మాట అన్నారు. ఈ విషయమై చర్చకు త్వరలోనే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. విభజన కాని కొన్ని స్టేట్ యూనివర్సిటీలు, విద్యాసంస్థలలో ఏపీ అధికారుల పెత్తనమే ఇంకా కొనసాగుతుండడం వల్ల ఓపెన్ కోటాలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు.

వరదలతో ఒక్క రోజే 57 మంది మృతి

■ బీహార్‌లోనే 51 మంది మృతులు

■ క్రమంగా సాధారణ స్థాయికి బెంగాల్

పాట్నా/ లక్నో/ గువాహటి/ కోల్‌కతా, ఆగస్టు 21: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పోటెత్తిన వరదలతో బీహార్, అసోం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో సోమవారం ఒక్కరోజే 57 మంది మృతి చెందగా, వారిలో బీహార్‌లో 51 మంది ఉన్నారు. అసోం, ఉత్తరప్రదేశ్‌ల్లో ముగ్గురు చొప్పున మృతి చెందారు. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో వెల్లువెత్తిన వరదలు క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయి. నదుల్లోకి వరద ఉద్ధృతి కూడా క్రమంగా తగ్గుతున్నది. ఇక బీహార్‌లో వరదల వల్ల మృతి చెందిన వారి సంఖ్య 304కు చేరుకున్నది. 18 జిల్లాల్లోని 1.38 కోట్ల మంది ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు.7.34 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా, సుమారు 3.27 లక్షల మంది 1,346 సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. బీహార్ పొరుగు రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి గంభీరంగా ఉన్నది. మొత్తం మృతుల సంఖ్య 72కు చేరుకోగా 24 జిల్లాల పరిధిలో 20 లక్షల మందికి పైగా ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. ఇప్పటికీ 2,688 గ్రామాలు నీటిలోనే మగ్గుతున్నాయి. అసోంలో ఇప్పటికి 12 జిల్లాల్లో వరద ప్రవాహం కొనసాగుతున్నది. గత 24 గంటల్లో పశ్చిమ బెంగాల్‌లో వర్షాలు కురువలేదు. సహాయ శిబిరాల్లో తల దాచుకున్న ప్రజలు తమ సొంతిండ్లకు బయలుదేరి వెళుతున్నారు. అయితే మహానంద నది మాత్రమే ఇప్పటికీ ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నది. వరదలతో 152 మంది మృతి చెందారని, 1.5 కోట్ల మంది ఇబ్బందుల పాలయ్యారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ తెలిపారు.



పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా ఇటాహార్ గ్రామంలో ఓ తాత్కాలిక వెదురు వంతెన పైనుంచి వరద ప్రవాహాన్ని దాటుతున్న ప్రజలు

ప్రతి మొక్కా బతుకాలి

■ ఫారెస్టు అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ దోబ్రియాల్

వికారాబాద్, నమస్తే తెలంగాణ: హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కా బతికేలా అటవీశాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఫారెస్టు అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ దోబ్రియాల్ అన్నారు. సోమవారం ఆయన వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం జైదుపల్లి అటవీప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతగిరి అటవీ ప్రాంతంలో మైదాన ప్రాంతాన్ని గుర్తించి అక్కడా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటిన మొక్కలు బతికేలా చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో హరితహారం విజయవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డీ దివ్య, ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ సిద్దానంద్‌కుక్కురేటి, జిల్లా అటవీ అధికారి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా జైదుపల్లి అటవీప్రాంతంలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఫారెస్టు అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్‌వేటర్ దోబ్రియాల్

సర్వీస్‌రూల్స్‌పై అభిప్రాయ సేకరణ

■ ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ డైరెక్టర్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై అభిప్రాయాల సేకరణ కోసం శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ సమావేశం నిర్వహించారు. సర్వీస్‌రూల్స్, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యాశాఖ డైరెక్టర్‌కు పలు సూచనలు చేశారు. క్లాస్ 2లోని క్యాటగిరీ (1) జిల్లా విద్యాధికారి పోస్టు పదోన్నతి కోసం క్లాస్ 3 నుంచి టీచింగ్ డిపార్టుమెంట్ వారికి, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులకు నాన్ టీచింగ్ వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. క్లాస్ 4లోని క్యాటగిరీ (1)లోని మండల విద్యాధికారి పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ క్లాస్ 3లోకి చేర్చాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు మూడురోజుల్లో ప్రతిపాదనలు సమర్పిస్తామన్నారు. సమావేశంలో ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీహరి, ఎస్ఎస్ఏ ఏఎస్పీడీ భాస్కర్‌రావుతోపాటు పీఆర్టీయూటీఎస్ నుంచి సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి, యూటీఎఫ్ నుంచి ఏ నర్సిరెడ్డి, చావ రవి, ఎస్టీయూ నుంచి భుజంగరావు, సదానందంగౌడ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షఫీజు గడువు 26

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అక్టోబర్ ఐదు నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు మరో ఐదురోజులపాటు గడువు పొడిగించారు. మంగళవారం నుంచి 26 వరకు పరీక్ష ఫీజు చెల్లింపునకు విద్యార్థులకు అవకాశం ఇచ్చామని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ బాలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



మిషన్ భగీరథ పనుల పురోగతిపై సచివాలయంలో సమీక్షిస్తున్న వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్

దశలవారీగా గ్రామాలకు భగీరథ నీరు

■ వచ్చేనెల నుంచి సరఫరాకు చర్యలు


■ డిసెంబర్ వరకు అన్ని గ్రామాలకు నీటి సరఫరా

■ సమీక్షలో మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ ప్రాజెక్టులో భాగంగా పనులు పూర్తయిన సెగ్మెంట్ల పరిధిలోని గ్రామాల్లో సెప్టెంబర్ నుంచి దశలవారీగా తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలకు అనుగుణంగా డిసెంబర్ చివరినాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటిని అందిస్తామని అన్నారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మిషన్ భగీరథ పనుల పురోగతిపై ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ఇంటేక్‌వెల్ నిర్మాణాలు, ఇంటింటికీ నల్లా పనులు వేగంగా జరుగుతున్నాయని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సెగ్మెంట్, జిల్లాలవారీగా పనులు ఏదశల్లో ఉన్నాయో ఇంటేక్‌వెల్ నుంచి ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల విధానం వరకు సమగ్ర నివేదికను రెండురోజుల్లో అందించాలని చీఫ్ ఇంజినీర్లను ఆయన ఆదేశించారు. వచ్చేనెల నుంచి ఏ సెగ్మెంట్‌లో, ఎన్ని గ్రామాలకు భగీరథ నీటిని అందిస్తారో వివరాలు ఇవ్వాలని చెప్పారు. ఇందుకు అనుగుణంగా ఇంటేక్‌వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు పనిచేయనున్న తేదీలను నివేదికలో పొందుపరుచాలని ఆయన సూచించారు.

సంయుక్త రంగంవైపు ఇస్రో చూపు

■ మార్కెట్ వాటా పెంచుకునేందుకు కసరత్తు



ఏఎస్ కిరణ్‌కుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు 21: కారుచౌకగా ఉపగ్రహ ప్రయోగాలు నిర్వహించడంలో పేరెన్నికగన్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంతర్జాతీయ మార్కెట్ వాటాను పెంచుకునేందుకు సంయుక్తరంగం వైపు దృష్టి సారిస్తున్నది. ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ ఢిల్లీలో సోమవారం మీడియాకు ఈ సంగతి వెల్లడించారు. ఉపగ్రహ వాహక రాకెట్ల తయారీని పెంచడంతో పాటుగా ప్రయోగాలలో అంతర్జాతీయ మార్కెట్‌లో గరిష్ఠ వాటా పొందేందుకు కృషి చేస్తున్నామని కిరణ్‌కుమార్ అన్నారు. సంయుక్తరంగంలో కన్సార్టియం ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నట్టు ఆయన చెప్పారు. స్వదేశీ అవసరాలకూ ఉపగ్రహ ప్రయోగాల సంఖ్య పెంచాలని భావిస్తున్నట్టు ఆయన వివరించారు. అంతర్జాతీయ ఉపగ్రహ మార్కెట్ విలువ 20 వేల కోట్ల డాలర్లు కాగా అందులో భారత్ వాటా 0.6 శాతం మాత్రమే. ఇస్రో వాణిజ్య విభాగమైన యాంట్రిక్స్ 2015-16లో వాణిజ్యపరమైన ఉపగ్రహాల ప్రయోగం ద్వారా రూ.230 కోట్లు ఆర్జించింది. ఇప్పుడు ఈ వాటా పెంచుకోవడం లక్ష్యంగా ఇస్రో అడుగులు వేస్తున్నది.

ఎన్నికల విరాళాలపై పరిమితి సబబేనా?

■ పార్టీలకు పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రశ్నావళి

న్యూఢిల్లీ, ఆగస్టు 21: రాజకీయ పార్టీలకు వివిధ సంస్థలు అందజేస్తున్న విరాళాలపై ప్రభుత్వం తాజాగా రూపొందించిన నిబంధనల అమలుపై వైఖరి తెలియజేయాలని ఆయా పార్టీలను పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. న్యాయ, సిబ్బంది వ్యవహారాల శాఖకు చెందిన స్థాయీ సంఘం ఈ మేరకు ఆయా పార్టీలకు ప్రశ్నలు సంధించింది. నూతన ఎన్నికల బాండ్లు జారీ చేయాలన్న నిబంధన దాతల వ్యక్తిగత సమాచారాన్ని సంరక్షిస్తుందా? రూ.2000 లోపు నగదు విరాళాలు మాత్రమే చెల్లించాలన్న నిబంధన వాస్తవిక పరిస్థితులకు వర్తిస్తుందా? వంటి ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని జాతీయ, ప్రాంతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు స్థాయీ సంఘం పంపింది. రాజకీయ పార్టీలకు విరాళాల చెల్లింపులో పారదర్శక విధానాన్ని అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆర్థిక బిల్లు – 2017'లో నగదు విరాళాలపై రూ.2000 లోపు పరిమితి విధించాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను అమలుజేయాలని ఎప్పటి నుంచో కోరుతున్న కేంద్ర ఎన్నికల సంఘం.. ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతించింది. అయితే మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుతం ద్రవ్యోల్బణం రేటును పరిగణనలోకి తీసుకుంటే నగదు విరాళాలపై రూ.2000 పరిమితి విధించాలని ప్రతిపాదించడం సరైన చర్యేనా? అని రాజకీయ పార్టీలను స్థాయీ సంఘం ప్రశ్నించింది.

ఫారం-6

(చట్టం-30/2013లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్-1 రూల్ 19 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వము

రెవిన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టర్/సంయుక్త కలెక్టర్,/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూసేకరణ)

ప్రాథమిక నోటిఫికేషన్

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. G1/2776/2017 — **తేది: 18.08.2017**
ఫైలు నెం.బి/06/2017 — **తేది: 26.07.2017**
గెజిట్ నెం.78/2017 — **తేది: 18.08.2017**

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం యాదాద్రి-భువనగిరి జిల్లా రామన్నపేట మండలం, సిరిపురం గ్రామములో భూమి విస్తీర్ణం ఎ.18.07 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్ధం పిల్లాయిపల్లి కాలువ సిరిపురం గ్రామము రామన్నపేట మండలం పిల్లాయిపల్లి కాలువ కోసం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

రిక్విజేషన్ అథారిటీ లేఖను సమర్పిస్తూ ఇట్టి ప్రాజెక్టు ఇ.ఐ.ఎ. చేయబడినది అని తెలిపినారు. కావున చట్టం 2013లోని సెక్షన్ 6(2) ప్రకారము ఎస్.ఐ.ఎ.ను మినహాయించనైనది.

నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలకు జాయింట్ కలెక్టరు మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేటు యాదాద్రి-భువనగిరి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నెం.19, రెవిన్యూ (జె.ఎ.అండ్ ఎల్.ఎ), తేది:11.02.2015 ప్రకారము ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద యాదాద్రి-భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామములో విస్తీర్ణం ఎ.18.07 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా: యాదాద్రి-భువనగిరి — **మండలం: రామన్నపేట** — **గ్రామము: సిరిపురం**

సర్వే నెం. భూమి స్వభావము హక్కు స్వభావము విస్తీర్ణము (ఎ.గుం.)	భూ సేకరణ విస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు (ప)/అనుభవదారు(అ) పేరు మరియు తండ్రి/భర్త పేరు	చెట్లు/ కట్టడములు
1	2	3	4
172 ఖుష్కి/పట్టా 4.19	--	కంచరకుంట్ల అండాలు భర్త యాదిరెడ్డి	--
	--	కంచరకుంట్ల యాదిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	--
	--	మోతే మాధవి భర్త యాదయ్య	--
	--	మోతే యాదయ్య తండ్రి ఎల్లయ్య	--
	--	కంచరకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తండ్రి వీరారెడ్డి	--
	--	కంచరకుంట్ల జనార్థన్‌రెడ్డి తండ్రి వీరారెడ్డి	--
	--	కంచరకుంట్ల వీరారెడ్డి తండ్రి కనకారెడ్డి	--
	--	బండారు సత్తమ్మ భర్త ఎల్లయ్య	--
	--	సిరసు ఎట్టయ్య తండ్రి ముత్తయ్య	--
	--	చిందచన సత్తయ్య తండ్రి మల్లయ్య	--
	--	మార్త శైలజ భర్త సత్తిరెడ్డి	--
	--	మార్త మల్లారెడ్డి తండ్రి రాంరెడ్డి	--
	--	అంబటి సురేంధర్ రెడ్డి తండ్రి ఎల్లారెడ్డి	--
	--	కంచరకుంట్ల జయమ్మ భర్త జెన్నారెడ్డి	--
	--	కంచరకుంట్ల అండాలు భర్త ప్రభాకర్‌రెడ్డి	--
	--	అంబటి వెంకటరెడ్డి తండ్రి సురేంధర్ రెడ్డి	--
Sanjeevni Indus27.3(26.55)15441
Sark Sys 74.95(75.25)34825
Sathavahana Ispat 35.75(38.0)69448
Saven Tech 22.65(22.4)1196
Sks Microfin 865.6(876.2)255066
Sms Pharma 71.2(73.6)1723
Softsol India 35.0(35.0)85
Southern Online Bio 3.2(3.13)6587
Sr Ray Alkalies 27.55(28.0)137368
Sree Rayalaseema 122.95(125.3)857
Srinivasa Shipp 61.45(59.35)12069
Steel Exchange 80.3(83.7)206972
Sujana 0.95(0.95)54819
Sujana Towers 4.25(4.38)3810
Sujanametal 1.61(1.65)24641
Surana Telecom 4.61(4.65)2755
Suryaamba 63.45(59.65)3782
Suryachakra Power Corp1.14(1.2)76654
Suryalak Cott 97.25(98.7)12025
Suryalata Spin 135.6(135.6)459
Suryavanshi Spin 9.57(9.24)70
Suvarna Cem 154.85(154.55)2040
Suven 164.55(160.85)60675
Taj Gvk 156.8(160.95)2295
Tanla Solutions 33.0(33.6)86366
Tci Fin 20.9(21.05)13037
Transcorp Int19.25(19.1)23618
Transgene Biotek 2.26(2.31)54070
Transport Co 273.65(276.95)3860
Trendy Knitwear 0.19(0.19)6000
Tyche 78.4(80.05)27964
Unisocks 3.45(3.43)6210
Usher 6.71(6.76)12280
V & K Softech 4.05(4.25)1
V B C Ferro 40.1(39.9)1658
V S T Ind 2751.25(2835.8)76
Vamshi Rubber 56.95(59.0)1482
Viceroy Hotels 17.0(16.8)42353
Vijay Textiles 59.5(59.0)17664
Vimta Labs 129.5(130.0)7229
Virat Crane 38.0(38.1)2342
Virnichiq 77.4(77.85)38881
Visaka Ind 520.55(496.55)18434
Vista Pharma 32.45(31.25)15614
Vivmed Labs 104.25(106.0)52604
Vivo Bio Tech 65.9(63.95)120
Vmf Softech 86.5(89.85)9719
Waterbase 121.0(118.25)483482
Xl Energy Ltd 1.8(1.85)13644
Ybrant Digital 6.53(6.65)130756
Zen Tech51.15(51.05)9486
Zenotech 46.4(46.0)2454



కామారెడ్డి జిల్లా నర్సన్నపల్లిలోపట్టాల వద్ద గుమిగూడిన గ్రామస్తులు.. రోదిస్తున్న తల్లి భానుశ్రీ. (ఇన్‌సెట్) మృతి చెందిన చిన్నారులు (ఫైల్)

ఆడుకునేందుకు వెళ్లి అనంతలోకాలకు

- రైలు ఢీకొని కవలలు మృతి
- కామారెడ్డి జిల్లాలో దుర్ఘటన

కామారెడ్డి రూరల్ : తల్లి ఒడిలో ఆడుకోవాల్సిన చిన్నారులను మృత్యువు రైలు రూపంలో కబళించింది. కామారెడ్డి జిల్లా నర్సన్నపల్లిలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకొంది. అప్పటి వరకు అమ్మ పెట్టిన గోరుముద్దలు తిని కాసేపు పడుకుని ఆరుబయట ఆడుకుంటామని వెళ్లిన వారు మృత్యువు ఒడిలోకి చేరడం కలవరానికి గురిచేసింది. చంద్రం, భానుశ్రీ దంపతులకు విద్వేశ్, విఘ్నేశ్(3) కవల కుమారులు ఉన్నారు. చంద్రం వ్యవసాయ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆడుకునేందుకు ఇంటికి కొద్ది దూరంలో ఉన్న వారి కొట్టంలోకి వెళ్లారు. ఆ తర్వాత ఇంటి దగ్గరే ఉన్న రైలు పట్టాలపై ఉన్న కంకర రాళ్లతో ఆడుకోసాగారు. అదే సమయంలో సికింద్రాబాద్ నుంచి ముంబై వైపు వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టడంతో చిన్నారులు తునాతునకలయ్యారు. లోకోపైలెట్ ముందు నుంచే హారన్ కొడుతున్నప్పటికీ చిన్నారులు గమనించలేదు. రైలు ఢీ కొట్టిన తరువాత ఆపి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను గుర్తించిన వారు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో రోదిస్తూ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మొదటి కాన్పులో కవలలు పుట్టగా ఇప్పుడు తల్లి భానుశ్రీ ఏడు నెలల గర్భిణి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి సమ్మయ్య కన్నుమూత

- నిమ్స్‌లో చికిత్స పొందుతూ విడిచిన తుదిశ్వాస
- సీఎం కేసీఆర్ సంతాపం

పరకాల/ఖైరతాబాద్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, వరంగల్ రూరల్ జిల్లా పరకాలకు చెందిన బొచ్చు సమ్మయ్య(71) సోమవారం కన్నుమూశారు. ఈనెల 9న ఆయన తన నివాసంలోని బాత్‌రూంలో కాలుజారి పడటంతో తలకు తీవ్ర గాయమైంది. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించగా న్యూరాలజీ అత్యవసర విభాగంలో ఆయనకు చికిత్స అందించారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో పరిస్థితి విషమించి సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. సమ్మయ్య మృతితో పరకాల ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం పరకాలలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సమ్మయ్య కొంత కాలం క్రితం టీఆర్‌ఎస్‌లో చేరి ఈ మధ్యే తిరిగి కాంగ్రెస్ గూటికి వెళ్లారు. ఆయన మృతిపట్ల కాంగ్రెస్, టీఆర్‌ఎస్ నాయకులు సంతాపం ప్రకటించారు.



సమ్మయ్య పార్థివదేహం. ఇన్‌సెట్‌లో సమ్మయ్య (ఫైల్)

సీఎం కేసీఆర్ సంతాపం

మాజీ మంత్రి బొచ్చు సమ్మయ్య మృతి పట్ల సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికార లాంఛనాలతో సమ్మయ్య అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను సీఎం ఆదేశించారు.

సమ్మయ్య ప్రస్థానం

పేరు: బొచ్చు సమ్మయ్య, **తండ్రి:** నర్సయ్య
పుట్టిన తేదీ : 07-08-1946
జన్మస్థలం: పరకాల, **విద్యాభ్యాసం:** బీ.ఏ., ఎల్‌ఎల్‌బీ
ఉద్యోగం: కాకతీయ మెడికల్ కళాశాలలో 1968 నుంచి 1978 జనవరి వరకు
రాజకీయం: ఉద్యోగానికి రాజీనామా చేసిన వెంటనే ఇందిరా గాంధీ నాయకత్వంలోని ఇందిరా కాంగ్రెస్ పార్టీలో చేరిక.

- 1978లో జరిగిన ఎన్నికల్లో పరకాల ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలోనూ ఆయన పరకాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- అంజయ్య క్యాబినెట్‌లో ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు.
- భవనం వెంకట్రామిరెడ్డి క్యాబినెట్‌లో మత్స్య, పట్టు పరిశ్రమల శాఖ మంత్రిగా కొనసాగారు.
- కోట్ల విజయభాస్కర్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా..
- 1983-84లో సీఎల్పీ కార్యదర్శిగా పనిచేశారు.
- 1997-1998 వరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా..
- 1992-1994 వరకు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా పని చేశారు.

మట్టి గణపతే.. మహాగణపతి

- పదివేల మట్టి విగ్రహాల పంపిణీని ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి
- త్వరలో సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ పనులు పూర్తి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: విఘ్నాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మట్టి విగ్రహాల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో పండుగులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ముఖ్యంగా గ్రామదేవతలను పూజించే సంస్కృతి ఒక్క తెలంగాణలోనే ఉన్నదన్నారు. జిల్లాలో 10 వేల చిన్న మట్టి విగ్రహాలను, ఐదు అడుగుల ఎత్తులో ఉన్న 100 విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అనంతరం స్థానిక సద్దుల చెరువు మినీట్యాంక్ బండ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరలోనే ట్యాంక్ బండ్ పనులు పూర్తవుతాయన్నారు. మినీ ట్యాంక్ బండ్ పనులపై ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌కు మంత్రి వివరించారు. ఆ తరువాత పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు మంత్రి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేశారు. అనంతరం ఆ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సురేంద్రమోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

శ్రావణం.. భక్తజనం ఘనం!

- నెలలోనే రాజన్న ఆదాయం రూ.2.60 కోట్లు
- 5 లక్షలకుపైగా దర్శించుకున్న భక్తులు



శ్రావణ సోమవారం ఆలయం ముందు భాగంలో భక్తులు(ఫైల్)

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజన్న ఆలయానికి శ్రావణ మాసం భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. ఈ నెల రోజుల్లో వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ. 2.60 కోట్ల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు లక్షల మంది స్వామివారిని దర్శించుకున్నట్టు ఈవో దూస రాజేశ్వర్ వెల్లడించారు. రాష్ట్రంతోపాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జూలై 24 నుంచి శ్రావణం ప్రారంభం కావడంతో ప్రతి ఆది, సోమ, శుక్రవారాలతోపాటు పర్వదినాలైన శ్రీకృష్ణాష్టమి, నాగుల పంచమి తదితర రోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పవిత్ర శ్రావణమాసంలో మహారాష్ట్ర ఆర్థిక, అటవీ శాఖ మంత్రి సుధీర్‌మునుగంటివార్, వివిధ ప్రాంతాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు స్వామివారి సేవలో తరించారు.



రేషన్ బియ్యం అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

110 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి, నమస్తే తెలంగాణ: పెద్దపల్లి మండలం అప్పన్నపేట పరిధి విజయలక్ష్మి ఎస్టేట్‌లోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వఉంచిన 110 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పెద్దపల్లి, సుల్తానాబాద్ సివిల్ సప్లయ్స్ అధికారులు ఆ ఇంటిపై దాడిచేసి బియ్యం అక్రమ నిల్వలను గుర్తించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన కొదురుపాకకు చెందిన తిరుపతి, నంబయ్యలపై కేసు నమోదు చేశారు. సదరు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక గోదాముల్లో భద్రపరిచారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

గుండాల(జనగామ): తండ్రి మందలించాడని కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జనగామ జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మరిపడిగ గ్రామానికి చెందిన కొండబోయిన లక్ష్మమ్మ, సోమయ్య దంపతుల పెద్ద కుమారుడు యాకయ్య(24) ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లాడు. బోనాల పండుగకని ఆదివారం గ్రామానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి తిరుగుతుండటంతో తండ్రి సోమయ్య కొడుకును మందలించాడు. మనస్తాపానికి గురైన యాకయ్య వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల గ్రామం ఏరియల్ వ్యూ



ఏదుల సమీపంలో నిర్మాణంలో ఉన్న వీరాంజనేయ రిజర్వాయర్

స్వచ్ఛందంగా కదిలారు

- రిజర్వాయర్ కోసం భూములిచ్చారు
- ప్రతిపక్షాల కుట్రలను భగ్నం చేశారు
- ప్రభుత్వానికి బాసటగా నిలిచిన ఏదుల వాసులు
- 'పాలమూరు' పనుల్లో పుంజుకున్న వేగం

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధానప్రతినిధి:

ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను భగ్నం చేశారు వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల గ్రామస్తులు. వారు ఎంత రెచ్చగొట్టినా పట్టించుకోలేదు. తమకు నీళ్లు కావాలని, పంటలు పండాలని, గ్రామం అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో ప్రభుత్వానికి బాసటగా నిలిచారు. ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని ఉంచి.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ఏదుల రిజర్వాయర్ కోసం తమ భూములను అప్పగించేందుకు గ్రామంలోని రైతులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూ.35,200 కోట్ల అంచనాలతో చేపడుతున్నది. ఈ ప్రాజెక్టులో ప్రధానంగా ఆరు రిజర్వాయర్లు నిర్మిస్తున్నది. ఇందులో వీరాంజనేయ రిజర్వాయర్ గోపాల్‌పేట మండలం ఏదుల సమీపంలో ఏర్పాటవుతున్నది. 6.55 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ రిజర్వాయర్‌లో 4,201 ఎకరాల భూములు ముంపునకు గురవుతున్నాయి. వీటిలో ఏదుల గ్రామంతోపాటు మరో 5 గ్రామాల భూములు మునుగుతున్నాయి. ఏదుల గ్రామంలో 1,500 ఎకరాల భూములు పోతున్నాయి. ఈ గ్రామంలోని వారంతా తమ భూములిచ్చేందుకు ముందుకు వచ్చారు.



ఏదుల సమీపంలో వీరాంజనేయ రిజర్వాయర్ పనులపై ఆరా తీస్తున్న మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు

ఇప్పటికే 1,250 ఎకరాల భూసేకరణ పూర్తి కాగా, డాక్యుమెంటేషన్ చేసుకున్న రైతులకు రెవెన్యూ అధికారులు వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు. మిగతా రైతులు కూడా స్వచ్ఛందంగా భూములిస్తున్నారు. ప్రతిపక్షాల మాటలు ఈ గ్రామస్తులు ఏ మాత్రం లెక్క చేయలేదు. నీళ్లొస్తే భూములు సస్యశ్యామలం అవుతాయన్న భావన, పాలకులపై ఉన్న నమ్మకంతో వారంతా ముందుకు వచ్చారు.


సర్కారు నజరానా..

స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు ముందుకు వచ్చిన ఏదుల వాసులకు మొదటి నుంచి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఏదుల గ్రామస్తుల సహకారాన్ని ఆయన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ప్రతిఫలంగా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం తొలి విడుతగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాల ప్రహరీలు, మురుగు కాలువలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వంటి మొత్తం 42 పనులకు శ్రీకారం చుట్టారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఇటీవలే వీటికి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపనలు చేసి పనులను మొదలు పెట్టించారు.

సమైక్య పాలనలో మా సమస్యలు పట్టించుకోలే..

35 ఏండ్ల కిందట శ్రీశైలం ప్రాజెక్టు కడితే ఇప్పటివరకు పరిహారం, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన సమస్యలు అలాగే ఉన్నాయని ఏదుల వాసులు కొందరు గుర్తుచేసుకుంటున్నారు. సీఎం కేసీఆర్ చొరవతో వీరాంజనేయ రిజర్వాయర్ పనులు ప్రారంభం కాగానే ఏదుల భూ నిర్వాసితులకు అదే నిండు హృదయంతో చేయూతనందిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇది సమైక్య రాష్ట్రంలోని పాలనకు, స్వరాష్ట్రంలోని పాలనా తీరుకు ఉన్న తేడాపై ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..



రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఏదుల గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. స్థానికులంతా స్వచ్ఛందంగా ముందుకు రావడంలో ఆయన పాత్ర కీలకం. ఇందులో భాగంగానే ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. ఆరునెలల కాలంలోనే గ్రామాభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయగా, పనులు ప్రారంభమయ్యాయి. సీఎం కేసీఆర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

- శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్, ఏదుల, గోపాల్ పేట మండలం, వనపర్తి జిల్లా


మా ఊరు బాగుపడుతది..



ఇన్నేండ్లకు మా ఊరు బాగుపడుతుందన్న నమ్మకం కలిగింది. రిజర్వాయర్‌కు పూర్తిగా సహకరించడం వల్ల ప్రభుత్వం మా ఊరికి అన్ని సౌకర్యాలు సమకూర్చుతున్నది. ఇందుకోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. పనులు కూడా జరుగుతున్నాయి. ఇప్పుడు మా గ్రామ రూపురేఖలే మారిపోతున్నాయి.

- గోపాల్ యాదవ్, ఏదుల గ్రామస్తుడు

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 424.540 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	0	35000	1705	1703.64	128.72	122.27
నారాయణపూర్	34410	229	1615	1612.14	37.646	33.73
జూరాల	2330	2330	1045	1038.85	9.66	6.16
తుంగభద్ర	6326	963	1633	1618.20	100.86	53.49
శ్రీశైలం	2266	44	885	781.50	215.807	20.94
నాగార్జునసాగర్	0	529	590	500.20	312.045	115.626
పులిచింతల	0	0	175	119.69	45.77	3.71
ప్రకాశం బ్యారేజీ	12990	12990	54.95	56.35	3.070	2.91

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	54425	118	1522	1512.96	102.732	69.28
కడెం	2496	740	700	697.90	7.6	7.064
ఎస్సారెస్పీ	89531	557	1091	1065.00	90.313	20.21
సింగూరు	975	245	1717.93	1708.66	29.91	17.57
నిజాంసాగర్	2389	64	1405	1383.00	17.803	1.941
ఎల్లంపల్లి	3866	660	485	473.79	20.175	11.48
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	268330	267172	45	45	2.93	2.93

బాసరలో వెలుగుచూసిన పంచలోహ విగ్రహం

- ప్రధాన అర్చకుడి బీరువాలో లభ్యం
- దేవరకొండకు తరలించింది ఇదేనా?
- కీలక దశకు చేరిన విచారణ

బాసర: బాసర సరస్వతీ క్షేత్రంలో కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపుతున్న అమ్మవారి ఉత్సవ విగ్రహ తరలింపు వ్యవహారంపై విచారణ కీలక దశకు చేరింది. ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మరో ఇద్దరు పూజారులు ప్రణవ్ శర్మ, విశ్వజిత్‌తో కలిసి గత నెల 28న అక్షరాభ్యాసాల నిమిత్తం విగ్రహాన్ని నల్లగొండ జిల్లా దేవరకొండకు తరలించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 8న ఆలయంలోని రెండు బీరువాలను సీజ్ చేసిన అధికారులు సోమవారం వాటిని తెరిచి పంచనామా నిర్వహించారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటరమణ, ముథోల్ సీఐ రఘుపతి, ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, ముగ్గురు సాక్షుల సమక్షంలో బీరువాలు తెరిచారు. మొదట తెరిచిన బీరువాలో అమ్మవారికి సంబంధించి అభిషేక పాత్ర, వెండి పళ్లెం, మిశ్రమ బంగారం, వెండి, ముక్కు పుడక తదితర వస్తువులు లభించాయి. కాగా ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్‌కు సంబంధించిన బీరువాను తెరువగా.. 1,520 గ్రాములు గల పంచలోహ విగ్రహం బయటపడింది. రూ.3,600 నగదు, అర్చకుల పంచెలు, పట్టువస్త్రాలు, అమ్మవారికి సంబంధించిన మాల తదితర వస్తువులు కనిపించాయి. ఈవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్‌కు సంబంధించిన బీరువాలో విగ్రహం ఉందని, గతంలో ఈ విగ్రహం స్టోర్ రూములో ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ విగ్రహం సదరు పూజారి తన సొంత బీరువాలో భద్రపరచడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. బీరువాలో దొరికిన విగ్రహం దేవరకొండలో అక్షరాభ్యాస పూజలు జరిపిన విగ్రహం ఒకటేనా కాదా? అనేది విచారణ అనంతరం వెల్లడిస్తామని సీఐ తెలిపారు.



బీరువాలో లభించిన పంచలోహ విగ్రహం

రికార్డులకెక్కని విగ్రహం...

ప్రధాన అర్చకుడు సంజీవ్ కుమార్ బీరువాలో లభించింది ఉత్సవ విగ్రహం కాదని మిగితా అర్చకులు పేర్కొంటున్నారు. ఈ విగ్రహాన్ని గతంలో ఓ భక్తుడు అమ్మవారికి కానుకగా ఇచ్చారని చెబుతున్నారు.



సత్తుపల్లిలో టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేసిన కల్తీ ఉత్పత్తులు

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పట్టుబడిన కల్తీ ఉత్పత్తులు

సత్తుపల్లి/ ఖమ్మం క్రైం, నమస్తే తెలంగాణ: ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి కల్తీ ఆహార ఉత్పత్తులను సీజ్ చేశారు. సత్తుపల్లిలోని దివాకరా ఎంటర్‌ప్రైజెస్‌లో సోదాలు నిర్వహించారు. కల్తీ నూనెతోపాటు కారం, పసుపు కల్తీ చేసేందుకు హానికర రంగులు, తెల్లటి పౌడర్‌ను గుర్తించిన అధికారులు గోడౌన్‌ను సీజ్ చేశారు. కాగా, ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ ఉమెన్స్ కళాశాల సమీపంలోని రాజేశ్ ఏజెన్సీలో తనిఖీలు చేపట్టారు. నాణ్యతలేని తినుబండారాలకు సంబంధించి భారీగా నిల్వలను గుర్తించారు. వీటిపై తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు, తయారీ చిరునామా ముద్రించలేదు. దీంతో అన్ని రకాల తినుబండారాల శాంపిల్స్‌ను సేకరించి ఆహార తనిఖీ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎస్సై సదా నిరంజన్, కరుణాకర్ పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై ఆర్‌ఐ సస్పెన్షన్

పెద్దఅడిశర్లపల్లి : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నల్లగొండ జిల్లా పీఏపల్లి ఆర్‌ఐ నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పీఏపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పని చేస్తున్న నవీన్‌కుమార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతుల వద్ద భారీ ఎత్తున డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. పలువురు బాధితులు రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు కలెక్టర్‌కు నివేదిక సమర్పించగా ఆయన ఆర్‌ఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుర్తుతెలియని మృతదేహం దహనం

తిప్పర్తి : గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసి అతడి మృతదేహాన్ని దహనం చేసిన ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. దుప్పలపల్లి గ్రామ శివారులో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి వెంట కంపచెట్ల మధ్య ఒక వ్యక్తి మృతదేహం కాలిపోతుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నల్లగొండ ఎస్పీ ప్రకాశ్‌రెడ్డితో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎవరో వ్యక్తిని హత్యచేసి అతడి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొచ్చి దహనం చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం పూర్తిగా కాలిపోవడంతో సదరు వ్యక్తి వివరాలు తెలియరాలేదు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా కేంద్ర దవాఖానకు తరలించారు.


నాదల్

మూడేండ్ల తర్వాత 'టాప్'లోకి

పారిస్: స్పెయిన్ టెన్నిస్ కింగ్ రఫెల్ నాదల్ పూర్వపుఫామ్‌లోకొచ్చాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌తో 15వ గ్రాండ్‌స్లామ్‌ను ఖాతాలో వేసుకున్న నాదల్.. మూడేండ్ల తర్వాత తొలిసారి ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నాదల్ టాప్‌ర్యాంకర్‌గా నిలిచాడు. కెరీర్‌లో తొలిసారిగా 2008లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న నాదల్ అత్యధికంగా 141 రోజులు టాప్‌ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. చివరిసారిగా 2014 జూలైలో టాప్ ర్యాంకర్‌గా నిలిచిన నాదల్.. ఆ తర్వాత మోకాలి గాయం కారణంగా ఫామ్ కోల్పోయి ర్యాంకుల్లో వెనుకబడ్డాడు. ఇక ఇప్పటిదాకా టాప్‌లో కొనసాగిన బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే 2వ ర్యాంక్‌కు పడిపోగా.. స్విస్ స్టార్లు రోజర్ ఫెదరర్, స్టానిస్లాస్ వారింకా, సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్‌లు వరుసగా 3, 4, 5 ర్యాంకులను నిలబెట్టుకున్నారు. 'మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోవడం నమ్మశక్యంగా లేదు. కొన్నేండ్లుగా నేను ఆటలో పడ్డ కష్టాలన్నింటిని ఈరోజుతో మరిచిపోయాను' అని 31ఏండ్ల నాదల్ అన్నాడు.

ప్రపంచ పోలీస్ క్రీడల్లో మనోళ్ల పతకాల పంట

న్యూఢిల్లీ: ప్రపంచ పోలీస్, ఫైర్ టోర్నీలో భారత్ పతకాల పంట పండించింది. లాస్‌ఏంజిల్స్ వేదికగా జరిగిన చాంపియన్‌షిప్‌లో భారత్ రికార్డు స్థాయిలో 321 పతకాలు కొల్లగొట్టింది. రెజ్లింగ్, బాక్సింగ్, జూడో, ఆర్చరీ, స్విమ్మింగ్, షూటింగ్ విభాగాల్లో మన క్రీడాకారులు 151 స్వర్ణాలు, 99 రజతాలు, 71 కాంస్యపతకాలు సాధించారు. ఇందు లో అథ్లెటిక్స్ జట్టు 147 పతకాలు నెగ్గింది.

రెజ్లింగ్‌లో తొలిరోజు నిరాశ

పారిస్: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో మొదటి రోజు భారత రెజ్లర్లు తీవ్రంగా నిరాశపరిచారు. గ్రీకో-రోమన్ విభాగంలో బరిలోకి దిగిన నలుగురు రెజ్లర్లు యోగేశ్(71కి), గురుప్రీత్(75కి), ఖత్రి (85కి), హర్‌దీప్ (98కి) ప్రత్యర్థుల చేతుల్లో ఓడారు.



బోణీ అదిరింది



ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు భారత షట్లర్లు అదరగొట్టారు. పురుషుల సింగిల్స్‌లో హాట్ ఫేవరెట్ కిడాంబి శ్రీకాంత్, సమీర్ వర్మ అద్భుత శుభారంభం చేయగా.. మిక్స్‌డ్, మహిళల డబుల్స్‌లో భారత షట్లర్లు రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు.

శ్రీకాంత్

తొలిరోజు భారత షట్లర్ల హవా
శ్రీకాంత్, సమీర్, తన్వి ముందంజ
ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

గ్లాస్గో: భారత్ తరపున కచ్చితంగా పతకం సాధిస్తాడనుకుంటున్న స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బోణీ చేశాడు. తొలిరౌండ్లో ప్రత్యర్థిని వరుసగేముల్లో చిత్తుచేసి టోర్నీకి గ్రాండ్‌గా శుభారంభాన్నిచ్చాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో 8వ సీడ్ శ్రీకాంత్ 21-13, 21-12తో రష్యాకు చెందిన సెర్జీ సిరాంత్‌ను ఓడించాడు. ఆద్యంతం దూకుడుగా ఆడిన శ్రీకాంత్ కేవలం అరగంటలోపే మ్యాచ్‌ను ముగించాడు. నెట్‌గేమ్‌లో అద్భుత ఆటతీరుతో చెలరేగిన శ్రీకాంత్, తొలిగేమ్‌లో విరామానికల్లా 11-6తో పైచేయి సాధించాడు. బ్రేక్ తర్వాత అదేజోష్‌ను చూపిన శ్రీకాంత్ వరుసగా పాయింట్లు సాధిస్తూ మ్యాచ్‌పై పట్టు సాధించాడు. 19-12తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థిని మరోపాయింట్‌కే పరిమితం చేస్తూ 21-13తో తొలిగేమ్‌ను వశం చేసుకున్నాడు. ఇక రెండోగేమ్‌లో దూకుడు పెంచిన శ్రీకాంత్ బ్రేక్ సమయానికి 11-5తో ముందుకెళ్లాడు. బ్రేక్ తర్వాత ఏమాత్రం వెనుదిరుగని శ్రీకాంత్ స్మాష్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడుతూ పాయింట్ల సంఖ్యను పెంచుకుంటూ పోయాడు. అదే ఊపులో 21-12తో ఆ గేమ్‌ను నెగ్గి రెండోరౌండ్ చేరాడు. మరో మ్యాచ్‌లో సమీర్ వర్మ 21-8, 17-4తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి పాబ్లో అబియాన్ (స్పెయిన్) గాయంతో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. రెండోరౌండ్లో ఫ్రాన్స్‌కు చెందిన లుకాస్ కార్వీతో శ్రీకాంత్ తలపడనున్నాడు. రాజీవ్ ఊసెఫ్, ఆడమ్ మెండ్రిక్ మధ్య జరిగే మ్యాచ్ విజేతను సమీర్ రెండోరౌండ్లో ఢీకొననున్నాడు. మహిళల సింగిల్స్‌లో భారత యువ కెరటం తన్వి లాడ్ తొలిరౌండ్‌ను అధిగమించింది. హోరాహోరీగా సాగిన పోరులో తన్వి 17-21, 21-10, 21-19తో చోలె బిర్చ్ (ఇంగ్లండ్)పై గెలిచి రెండోరౌండ్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన రెండు జోడీలు ముందంజ వేశారు. సాత్విక్‌సాయిరాజ్ రాంకీ రెడ్డి-మనీషా ద్వయం 24-22, 21-17తో హాంకాంగ్ జోడీ తామ్ చున్-ఎంగ్ యూపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మలేషియా ఆటగాడు యోగేంద్రన్ జతగా భారత అమ్మాయి ప్రజక్తా సావంత్ 21-15, 13-21, 21-18తో చైనీస్ తైపీ ద్వయం లూ చింగ్-కాయ్ సిన్‌పై గెలిచి మిక్స్‌డ్ విభాగంలో రెండోరౌండ్‌కు దూసుకెళ్లింది. మహిళల డబుల్స్‌లో భారత జోడీ సంజన సంతోష్-ఆరతి సారా సునీల్ 21-15, 21-19తో ఉక్రెయిన్ జంటను చిత్తుచేసి రెండోరౌండ్‌లో ప్రవేశించింది. ఇక పురుషుల డబుల్స్‌లో అంచనాలున్న భారత జంట సుమిత్ రెడ్డి-మను అత్రి అనూహ్యంగా తొలిరౌండ్లోనే నిష్క్రమించి నిరాశపరిచింది. సుమిత్ జోడీ 20-22, 11-21తో కొరియా ద్వయం చుంగ్ సియోక్-కిమ్ డుకుయోంగ్ చేతిలో ఓటమిపాలైంది.


ధవన్

వైఫల్యాలను చూసి భయపడేవారు కొందరైతే.. వాటి నుంచి పాఠాలను నేర్చుకునే వారు మరికొందరు. భారత ఓపెనర్ శిఖర్ ధవన్ రెండో కోవకు చెందినవాడు. మొండి పట్టుదలకు మారుపేరు. స్థూలంగా చెప్పాలంటే.. పాతాళానికి పడిన చోటే ఎవరెస్ట్ ఎత్తుకు నిచ్చెనలు వేసే విలక్షణమైన వ్యక్తిత్వం. అలాంటి వ్యక్తి అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి ఏడేండ్లు అవుతున్నది. ఈ ఏడేండ్లలో అతను చాలాసార్లు జట్టు నుంచి ఉద్వాసనకు గురయ్యాడు. కానీ ఏనాడూ నిరాశపడలేదు. పరాజయం ఎదురైన ప్రతిసారి దాని నుంచి కొత్త పాఠం నేర్చుకున్నాడు. కాబట్టే ఇప్పుడు భారత క్రికెట్‌లో సరికొత్త పరుగుల 'శిఖరా'న్ని చూస్తున్నాం..!

పరాజయాలే పాఠాలుగా..

(నమస్తే తెలంగాణ క్రీడావిభాగం)

సరిగ్గా ఏడాది కిందట జట్టులో చోటు లేదు. కుర్రాళ్ల నుంచి గట్టిపోటీ ఉండటంతో భవిష్యత్‌లోనైనా స్థానం దక్కుతుందో లేదో తెలియని అయోమయ పరిస్థితి. దీనికితోడు ఫామ్‌లేమి. బరిలోకి దిగిన ప్రతి మ్యాచ్‌లో వైఫల్యం. ఫలితం న్యూజిలాండ్‌తో సిరీస్‌కు జట్టు నుంచి ఉద్వాసన.

సీన్ కట్ చేస్తే.. 2017 చాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన జట్టులో ధవన్‌కు చోటు. ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద. ఆ వెంటనే వెస్టిండీస్ టూర్. ఇప్పుడు లంక పర్యటన.. శిఖర్ పరుగుల ప్రవాహం శిఖరాన్ని తాకుతున్నది. ఏడాది కాలంలో తనకు తానుగా మారిన ధవన్.. ఇప్పుడు భారత బ్యాటింగ్ లైనప్‌కు వెన్నెముక. ఫార్మాట్ ఏదైనా తన దూకుడు మంత్రం మారదంటున్న ఓపెనర్ ప్రస్తుత ఫామ్‌పై స్పందించాడు.

చాలా నేర్పుతాయి..

ప్రతి ఒక్కరి జీవితంలో వైఫల్యాలు చాలా సహజమని ధవన్ అన్నాడు. అవి మనకు చాలా నేర్పుతాయని చెప్పిన అతను వాటి నుంచి నేర్చుకోకపోతే జీవితం ఉండదని హెచ్చరించాడు. 'నా అదృష్టమేమిటంటే నేను వాటి కంటే ఎక్కువే నేర్చుకున్నా. అందుకే ఇప్పుడు ఇలా ఆడగల్గుతున్నా. చాంపియన్స్ ట్రోఫీకి ముందు జట్టులో చోటులేదు. అవకాశం వస్తే సత్తా ఏంటో చూపాలనుకున్నా. చాన్స్ వచ్చింది చూపెట్టా. వన్డే వరల్డ్‌కప్‌నకు చాలా సమయం ఉంది. అయినా అప్పటివరకు ఈ ఫామ్‌ను కొనసాగించాల్సిందే. ఇదే నా లక్ష్యం కూడా. నేను రాణించకపోతే నా కంటే గొప్ప బ్యాట్స్‌మెన్ జట్టులో చాలా మంది ఉన్నారు. ఎవరో ఒకరు నా స్థానాన్ని భర్తీ చేస్తారు. గతంలో ఫామ్‌లేక చాలా ఇబ్బందులుపడ్డా. ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తూ కూర్చోను. అది వస్తుంది, పోతుంది. ఆ సమయాన్ని తలుచుకుంటే నాకు కూడా సిగ్గేస్తుంది. నేను బాగా ఆడకపోతే నా సన్నాహకాలు మరింతగా పెంచుతా. బాగా ఆడితే వాటిపైనే ఎక్కువగా దృష్టిపెడుతా. కాబట్టి పరిస్థితులను, ప్రత్యామ్నాయాల గురించి పెద్దగా పట్టించుకోను. బాగా ఆడటమే నా విధి, కర్తవ్యం' అని ధవన్ వ్యాఖ్యానించాడు.

అప్పటిలాగే..

2013 చాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టిన ధవన్.. రోహిత్ కలిసి ఓపెనింగ్‌ను కొత్త పుంతలు తొక్కించాడు. సచిన్-సౌరవ్, సచిన్-సెహ్వాగ్ జోడీని మైమరిపిస్తూ ఈ ఇద్దరు పరుగుల ప్రవాహాన్ని సృష్టించారు. చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన వెంటనే ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ అదే ఫామ్‌ను కొనసాగించిన ధవన్ కంగారూలపై తొలి శతకాన్ని సాధించాడు. సీన్ కట్ చేస్తే ఇంగ్లండ్ గడ్డపై జరిగిన 2017 చాంపియన్స్ ట్రోఫీలోనూ ధవన్ తన వీరోచిత బ్యాటింగ్‌ను చూపెట్టాడు. ఆ తర్వాత జరిగిన విండీస్ టూర్‌లో ఓ మాదిరిగా ఆడినా.. లంక పర్యటనలో మాత్రం ఈ ఢిల్లీ స్టార్ మరోసారి మీసం మెలేశాడు. గాలె, పల్లెకెలె టెస్టు ల్లో సెంచరీలు బాదిన ధవన్..తొలివన్డేలోనూ శతకంతో మెరుపులు మెరిపించాడు. '2013 చాంపియన్స్ ట్రోఫీ కోసం వన్డే జట్టులోకి పునరాగమనం చేసిన నేను ధారాళంగా పరుగులు రాబట్టాను. మళ్లీ ఇటీవల ముగిసిన చాంపియన్స్ ట్రోఫీలోనూ అదే ఫామ్‌ను చూపెట్టా. ఆసీస్‌పై అరంగేట్రం టెస్టు అయినా.. మొన్న గాలెలో లంకతో మొదటి టెస్టు అయినా నా బ్యాటింగ్‌లో ఎలాంటి మార్పు లేదు. రెండుసార్లూ ఒకే రకమైన సారూప్యంతో బ్యాటింగ్ చేశా. ఇదే మంత్రాన్ని భవిష్యత్‌లో పునరావృతం చేయాలని భావిస్తున్నా' అని ధవన్ పేర్కొన్నాడు.

ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం

ప్రస్తుతం టీమ్‌ఇండియాలో చాలా మంది కుర్రాళ్లు ఉన్నారు. సీనియర్లు వారితో పోటీపడాలంటే ఫిట్‌నెస్ ప్రధానం. అందుకే తాను ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తానన్న ధవన్.. దానిని కాపాడుకునేందుకు చాలా శ్రమిస్తానన్నాడు. 'శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం నాకు చాలా ఇష్టం. ఇది మినహా నేను పెద్దగా లక్ష్యాలను పెట్టుకోను. పరుగులు చేస్తున్నా కాబట్టి ఫామ్‌ను కొనసాగించాలని కోరుకుంటా. ఇందులో భాగంగా ఫిట్‌నెస్, నైపుణ్యం మెరుగుపర్చుకోవడం, ఫీల్డింగ్ వంటి అంశాలపై ఎక్కువగా దృష్టిపెడుతా' అని ఈ లెఫ్టాండర్ వ్యాఖ్యానించాడు.

మలింగలో పదును తగ్గింది!



లంక క్రికెట్‌లో మలింగ ఓ దిగ్గజం. అన్ని ఫార్మాట్లలో అతనికి చాలా మంచి రికార్డు ఉంది. కానీ వయసు మీద పడుతున్నది కాబట్టి మలింగ పేస్‌లో పదును తగ్గినట్లు కనిపిస్తున్నదని ధవన్ చెప్పుకొచ్చాడు. 'బ్యాట్స్‌మన్‌గా మలింగ బౌలింగ్‌లో ఎక్కువ దూకుడుగా ఆడాం. అతను చాలా క్రికెట్ ఆడాడు. కాబట్టి బౌలింగ్ పదును తగ్గడం చాలా సహజం. చాంపియన్స్‌లో లంక పేస్ అటాక్ అద్భుతంగా పని చేసింది. టీమ్ ఇండియా పరిణతి చెందిన జట్టు. ఒత్తిడిని సులువుగా అధిగమిస్తారు. ఎందుకంటే సుదీర్ఘమైన అనుభవం మా సొంతం. కాబట్టి సమయం గడిచేకొద్దీ లంక జట్టు కూడా బాగా రాణిస్తుంది' అని ధవన్ అన్నాడు.

పగిలిన ప్లాస్టిక్ ట్యాంక్‌లో స్నానం

విచారణకు క్రీడాశాఖ ఆదేశం

న్యూఢిల్లీ: మెరుగైన క్రీడా వసతుల కోసం ప్రభుత్వాలు కోట్లకు కోట్లు గుమ్మరిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఆటగాళ్లకు ఆ సౌకర్యాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. బెంగళూరులోని భారత క్రీడా ప్రాధికారిక సంస్థ(సాయ్) కేంద్రంలో ఆటగాళ్లు పగిలిపోయిన ఓ ప్లాస్టిక్ ట్యాంక్‌లో స్నానం చేయడమే దీనికి



ఉదాహరణ. భారత జూనియర్ హాకీ జట్టుకు చెందిన ఆటగాళ్లు సాయ్ సెంటర్‌లో ఐస్ బాత్ కోసం పనికిరాని వృథాగా పడిఉన్న ప్లాస్టిక్ ట్యాంక్‌ను ఉపయోగించడం క్రీడాశాఖ దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే విచారణకు ఆదేశించింది. సాయ్ కేంద్రాల్లో శిక్షణ పొందే ఆటగాళ్లకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి గోయల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని క్రీడాశాఖ ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఉదంతంపై క్రీడాశాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.



శ్రీలంక పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ మ్యాచ్‌ల మధ్య విరామాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఓ రిసార్ట్‌లో ఏనుగుల వద్ద తాను దిగిన ఫొటోను కోహ్లీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

అవార్డుల ఎంపిక ప్రక్రియలో మార్పులు

వచ్చే ఏడాది నుంచి అమలు చేయనున్న క్రీడాశాఖ

న్యూఢిల్లీ: ప్రతి యేడాది క్రీడా అవార్డుల ఎంపికలో ఏదో ఒక వివాదం చోటు చేసుకుంటున్నది. అద్భుతంగా రాణించిన ఆటగాళ్లను పక్కకు పెడుతూ అసలు అంచనాలకు కూడా అందని క్రీడాకారులకు అవార్డులు కట్టబెడుతున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. దీంతో క్రీడా అవార్డుల ఎంపిక ప్రక్రియలో సమూల మార్పులు చేసేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సిద్ధమైంది. దీనిలో భాగంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి విజయ్ గోయల్ ఎంపిక ప్రక్రియపై ఇప్పటికే దృష్టిసారించారు. ఆటగాళ్లను అవార్డులకు నామినేట్ చేసే విషయంలో ప్రస్తుతమున్న సెలెక్షన్ కమిటీ పారదర్శకతను తప్పుపట్టాల్సిన అవసరం లేకపోయినా.. ఎంపిక పద్ధతిని మార్చాలనుకుంటున్నట్లు క్రీడాశాఖ ప్రతినిధి ఒకరు మీడియాతో అన్నారు. 'త్వరలో కొత్త నియమ నిబంధనలను తీసుకురాబోతున్నాం. అవార్డు కోసం దరఖాస్తు చేసుకోకపోయినా..లేక ఆయా క్రీడా సంఘాలు వారి పేర్లను సిఫారసు చేయకపోయినా రాణించి ఉంటే వారి పేర్లను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటాం. ఇదేదో వ్యక్తిగతంగా ఒకరికి సంబంధించిన అంశం కాదు, పూర్తిగా వ్యవస్థనే మార్చాల్సిన అవసరముంది' అని సదరు అధికారి తెలిపారు. ఇదిలా ఉంటే..ఈసారి అవార్డుల ఎంపిక విషయంలో భారత మహిళల క్రికెట్ కెప్టెన్ మిథాలీరాజ్‌తో పాటు టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న, పారా అథ్లెట్ దీపా మాలిక్, వెయిట్ లిఫ్టర్ సంజూ చానుకు నిరాశ ఎదురైన సంగతి తెలిసిందే. అఖిల భారత టెన్నిస్ సమాఖ్య(ఏఐటీఏ) బోపన్న పేరును ఆలస్యంగా క్రీడాశాఖకు పంపగా, అసలు మిథాలీ పేరును బీసీసీఐ నామినేట్ కూడా చేయలేదు.

ముగురుజాదే 'సిన్సినాటి'

సిన్సినాటి: ఈ ఏడాది వింబుల్డన్ చాంపియన్ గార్బినె ముగురుజా 'సిన్సినాటి'లోనూ సత్తాచాటింది. ఫైనల్లో గెలుపొంది ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలువాలన్న రొమేనియా స్టార్ సిమోనా హలెప్ ఆశలకు గండి కొడుతూ స్పెయిన్ టెన్నిస్ క్వీన్ ముగురుజా సిన్సినాటి ఓపెన్ చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో ముగురుజా 6-1, 6-0తో హలెప్‌ను చిత్తుచేసి ఈ వేదికపై తొలిసారి టైటిల్ నెగ్గింది. అమెరికా గడ్డపై తొలి టైటిల్ నెగ్గిన 23ఏండ్ల ముగురుజా.. త్వరలో జరిగే సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లోనూ టైటిల్ నాదేనంటూ ఈ విజయంతో ప్రత్యర్థులకు హెచ్చరిక పంపినట్లయింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను బల్గేరియా ఆటగాడు గ్రిగోర్ దిమిత్రోవ్ గెలుచుకున్నాడు. ఫైనల్లో దిమిత్రోవ్ 6-3, 7-5తో ఆస్ట్రేలియాకు చెందిన నిక్ కిర్గియోస్‌ను ఓడించాడు. కెరీర్‌లో ఏడో టైటిల్‌ను అందుకున్న 26ఏండ్ల దిమిత్రోవ్‌కిదే ఏటీపీస్థాయిలో అతిపెద్ద టైటిల్ కావడం విశేషం.




దిమిత్రోవ్

ముదిత్ సంచలనం



శాన్‌సాల్వడార్(ఎల్ సాల్వడార్): భారత వర్ధమాన టేబుల్ టెన్నిస్ ఆటగాడు ముదిత్ దాని సోమవారం ముగిసిన ఎల్ సాల్వడార్ జూనియర్ అండ్ క్యాడెట్ ఓపెన్‌లో ముదిత్ ఓ స్వర్ణం సహా మూడు పతకాలు గెలిచి సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, డబుల్స్‌లో రజతం, సింగిల్స్‌లో కాంస్యం గెలుచుకున్నాడు. డబుల్స్‌లో కోస్టారికా ఆటగాడు జెర్సన్‌తో జట్టు కట్టిన ముదిత్ 5-11, 6-11, 8-11తో టాప్‌సీడ్, స్వీడన్ జంట ఆస్కార్-హెల్డండ్ జోడీ చేతిలో ఓడి రజతం అందుకున్నాడు. ఇక సింగిల్స్‌లో ముదిత్ 11-6, 11-1, 3-11, 9-11, 9-11తో జాకబ్ చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.



ఐదురోజుల క్రితం ప్రారంభమైన జీహెచ్‌ఎంసీ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి రిటైర్డ్ జస్టిస్ చంద్రయ్య, మాజీ షట్లర్, అర్జున అవార్డుగ్రహీత చేతన్ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్ రెడ్డి, అదనపు కమిషనర్ అద్వైత్ కుమార్‌సింగ్, స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ తదితరులు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభం




జ్యోతినగర్, నమస్తే తెలంగాణ: రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎన్టీపీసీ టౌన్‌షిప్ జ్యోతిక రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు జీఎం ఎమ్‌ఎన్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్యారమ్స్ సంఘం, రామగుండం ఎన్టీపీసీ సహకారంతో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈనెల 24వరకు జరుగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రవ్యాప్తంగా 150మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు.

ధోనీ వల్ల కార్తీక్ నష్టపోయాడు

న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ కెరీర్‌పై విమర్శల పరంపర కొనసాగుతూనే ఉన్నది. నిలకడగా రాణిస్తేనే అతనికి జట్టులో చోటని లేకపోతే ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నామని ఇప్పటికే సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అనగా, తాజాగా గంభీర్ కూడా గొంతు కలిపాడు. గత ప్రదర్శనల ఆధారంగా జట్టుకు ఎంపిక చేయడం కాదని, ప్రస్తుత ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుని ఎంపిక ఉండాలని గౌతీ పేర్కొన్నాడు. 'నిలకడగా రాణిస్తేనే 2019 ప్రపంచకప్‌నకు జట్టులో ధోనీ చోటు దక్కించుకుంటాడు, లేకపోతే చాలా కష్టం. ఎవరికైనా ఒకే ప్రతిపాదిక ఉండాలి. అంతేకానీ గతాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. అలా ఎన్ని ఏండ్లు జట్టులో కొనసాగుతారు. ఈ విషయంలో దినేశ్ కార్తీక్ చాలా అవకాశాలు కోల్పోయాడు. తనకు దక్కిన ప్రతి చాన్స్‌ను ఉపయోగించుకున్న కార్తీక్..ధోనీ వల్ల రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైపోయాడు' అని గంభీర్ అన్నాడు.

యువీకి విశ్రాంతి కారణం కాదు:

శ్రీలంకతో వన్డే సిరీస్‌కు యువరాజ్‌సింగ్‌ను ఎంపిక చేయకపోవడానికి విశ్రాంతి కారణం కాదని గంభీర్ కుండబద్దలు కొట్టాడు. 'విశ్రాంతి అనేది సరైంది కాదు. ఇటీవలి కాలంలో అతను పెద్దగా సిరీస్‌లు ఆడింది లేదు. ప్రపంచకప్‌లో యువీ ఆడాలంటే మరిన్ని అవకాశాలు ఇవ్వండి. అంతేగానీ విశ్రాంతి పేరుతో ఓ సిరీస్ నుంచి తప్పించి మరో సిరీస్‌లో అవకాశమిస్తే కుదురదు' అని గంభీర్ పేర్కొన్నాడు.


గంభీర్



సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో కన్నుమూసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ అంత్యక్రియలు పంజాగుట్ట శ్మశాన వాటికలో జరిగిన దృశ్యం. (ఇన్‌సెట్) పీవీఆర్కే ప్రసాద్ (ఫైల్)

విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ కన్నుమూత

పంజాగుట్ట శ్మశానవాటికలో ముగిసిన అంత్యక్రియలు

గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్/బంజారాహిల్స్/తిరుమల, నమస్తే తెలంగాణ:


విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ (77) సోమవారం కన్నుమూశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక పదవులు నిర్వహించిన ఆయన, మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావుకు మీడియా సలహాదారుగా కూడా పనిచేశారు. బంజారాహిల్స్ రోడ్‌నంబర్ 8లో నివాసం ఉంటున్న ప్రసాద్‌కు నాలుగురోజుల క్రితం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు స్థానిక కేర్ దవాఖానకు తరలించారు. వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి ఐసీయూలో చికిత్స పొందుతున్న ప్రసాద్ శనివారం అర్ధరాత్రి దాటాక తుదిశ్వాస విడిచారు. సోమవారం హైదరాబాద్‌లోని పంజాగుట్ట హిందూ శ్మశాన వాటికలో కుమారుడు సంజీవప్రసాద్ చేతులమీదుగా ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించారు. ప్రసాద్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ తరపున ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్‌రావు శ్మశాన వాటికకు వచ్చి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ప్రసాద్ మృతిపట్ల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తంచేశారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రసాద్ కుటుంబసభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మతోపాటు విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జయప్రకాశ్‌నారాయణ్, దాసరి శ్రీనివాస్, ఎంవీఎస్ ప్రసాద్, ఎంవీ భాస్కర్‌రావు, చెంగప్ప, జే రాంబాబు, జే సత్యనారాయణ, బీవీ రామారావు, జీ సుధీర్, ఆర్ ప్రభాకర్‌రావు, ఐవీఆర్ కృష్ణారావు తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. ప్రసాద్ మృతికి రాష్ట్ర ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, టీటీడీ ఈవో అనిల్‌కుమార్, ఇతర అధికారులు సంతాపం తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో సమీక్ష సమావేశానికి ముందుగా ప్రసాద్‌కు నివాళులు అర్పించారు.

ప్రభుత్వసేవల్లో తనదైన ముద్ర వేసిన ప్రసాద్

ఐఏఎస్ అధికారిగా పీవీఆర్కే ప్రసాద్ ప్రభుత్వ సేవల్లో తనదైన ముద్ర వేశారు. మాజీ ప్రధాని, పీవీ నర్సింహారావుకు సన్నిహితుడైన ప్రసాద్ 1991 నుంచి 1996 వరకు ఆయనకు మీడియా సలహాదారుగా పనిచేశారు. 1978 నుంచి 1982 వరకు టీటీడీ ఈవోగా ప్రసాద్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. వేంకటేశ్వర ఎంప్లాయీస్ ట్రైనింగ్ అథారిటీని ఏర్పాటుచేశారు. టీటీడీ ప్రెస్‌ను స్థాపించి 'పుస్తక ప్రసాదమ్' పేరుతో అనేక భక్తి పుస్తకాలను ముద్రించారు. అనంతరం విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్‌గా పనిచేసి పోర్ట్‌పై చెరగని ముద్రవేశారు. 1998లో ప్రసాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బాధ్యతలు చేపట్టారు. పదవీవిరమణకు ముందు మూడేండ్లు, తర్వాత మరో మూడేండ్లు పదవిలో ఉండి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ అభివృద్ధికి పాటుపడ్డారు. బాబ్రీమసీదు కూల్చివేత సమయంలో జరిగిన సంఘటనలపై 'అసలేమి జరిగిందంటే' అనే పుస్తకాన్ని రచించారు. తిరుమల విశిష్టతపై 'తిరుమల లీలామృతం, తిరుమల చరితామృతం' పుస్తకాలను ప్రసాద్ రచించారు.

పండుగలా సంపూర్ణ సూర్యగ్రహణం

• అమెరికాలో రెండు తీరాలమధ్య ఛాయా ప్రయాణం



సోమవారం అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం రెడ్మండ్ నగరానికి సమీపంలో సంపూర్ణ సూర్యగ్రహణం ఈ విధంగా కనిపించింది

వాషింగ్టన్, ఆగస్టు 21: అమెరికా ఆ చివర నుంచి ఈ చివర దాకా సోమవారం సూర్యగ్రహణం చుట్టేసింది. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించేందుకు అమెరికా పౌరులు ఎగబడడంతో రహదారుల మీద ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయింది. టీషర్టులు, బటన్‌లు, కేకులు మొదలైన ప్రత్యేక ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తాయి. సుమారు వందేండ్ల తర్వాత వచ్చిన 'మహా సూర్యగ్రహణాన్ని' కండ్లారా చూసేందుకు ప్రజలు ఆహారపదార్థాలు, ఇతర సరంజామా సమకూర్చుకుని గుడారాలు వేసుకుని కూర్చోవడంతో గ్రహణ పరిధిలోని అమెరికా నగరాల్లో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. రెస్టారెంట్లు, బార్లు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాయి. విదేశాల నుంచి కూడా సందర్శకులు పెద్దసంఖ్యలో అమెరికాకు వచ్చారు. కండ్ల రక్షణకు ఉపకరించే ప్రత్యేక కళ్లద్దాల అమ్మకం జోరుగా సాగింది. పడమరన పసిఫిక్ తీరంలో మొదలైన గ్రహణఛాయ ప్రయాణం నిరంతరంగా సాగుతూ తూర్పు తీరం వైపు సాగింది. వాయవ్య రాష్ట్రమైన ఒరెగాన్‌లోని పోర్ట్ ల్యాండ్‌లో మొట్టమొదటగా సంపూర్ణ గ్రహణం ఆవిష్కృతమైంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.05కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 9.35కు) గ్రహణం మొదలైంది. సుమారు 75 నిమిషాలకు సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించింది. మెల్లమెల్లగా గ్రహణఛాయ తూర్పు దిశగా కదులడం మొదలుపెట్టింది. ఇదాహో, వ్యోమింగ్, నెబ్రాస్కా, మిస్సోరీ, ఇల్లినాయిస్, కాన్సస్, కెంటకీ, టెన్నెస్సీ, నార్త్ కరోలినా, జార్జియా రాష్ట్రాల గుండా గ్రహణం ముందుకు సాగింది. చివరకు సౌత్ కరోలినా రాష్ట్రంలో తీరం దాటింది. గ్రహణం తుదిఘట్టం చార్లెస్టన్‌లో స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.49కి(భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.30) ముగిసింది. 14 రాష్ట్రాల్లోని 1.2 కోట్ల మంది అమెరికా జనాభా గ్రహణం పరిధిలోకి వచ్చారు. పెద్దఎత్తున సందర్శకుల రాకతో చిన్నచిన్న పల్లెలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. మరోవైపు నకిలీ కండ్లద్దాల బెడద అధికారులకు దడ పుట్టించింది.

మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎలా పెంచుతారు?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎలా పెంచుతారో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. భోజనం పరిశుభ్రంగా ఉందో లేదో ఎలా తెలుసుకుంటున్నారో వివరణ ఇవ్వాలని చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందిస్తూ జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో రెండు చొప్పున పర్యవేక్షక కమిటీలు వేస్తామని పేర్కొన్నాయి. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ పరిశుభ్రత పెంపు విషయంలో మరిన్ని సూచనలు ఇవ్వాలని వాటికి మెరుగులు దిద్ది అమలయ్యేలా చూస్తామని పేర్కొన్నది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. 2013లో బీహార్‌లోని ఓ గ్రామంలో మధ్యాహ్న భోజనం తిని 23 మంది చిన్నారులు మృతిచెందడంపై 'అంతరాష్ట్రీయ మానవ్ అధికార్ నిగ్రాని' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను ధర్మాసనం విచారణకు స్వీకరించింది. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పూర్తి వివరాలను తాము సూచించిన ఫార్మాట్‌లో విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఈ ఏడాది మార్చిలో కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలను ఆదేశించింది.





ఉన్నతాధికారులతో పంట బీమా యోజన, భూసార పరీక్ష పథకాలపై సమీక్షిస్తున్న ప్రధాని

90 లక్షల మంది రైతులకు పంటల బీమా

ప్రధాని మోదీకి వివరించిన వ్యవసాయ అధికారులు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా 2016 ఖరీఫ్, 2016 – 17 రబీ సీజన్‌లో సుమారు 90 లక్షల మంది రైతులకు పంటల బీమా కింద లబ్ధి చేకూరినట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అధికారులు చెప్పారు. ఈ మేరకు వారికి రూ.7,700 కోట్ల మేరకు బీమా మొత్తం చెల్లించామని అధికారులు ప్రధాని మోదీకి వివరించారని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ సోమవారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, భూసార గుర్తింపు కార్డుల జారీ పథకాల అమలుపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. భూసార పరీక్షల కోసం రైతులకు తగిన సూచనలు ఇవ్వడానికి ఇప్పటివరకు 16 రాష్ట్రాలు మాత్రమే తొలిదశలో రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేశాయని అధికారులు చెప్పినట్లు పీఎంవో తెలిపింది. మిగతా రాష్ట్రాల్లో మరికొన్ని వారాల్లో పూర్తవుతుందని అధికారులు వివరించారు. రైతుకు నేరుగా లబ్ధి చేకూర్చే ఈ పథకాన్ని చిత్తశుద్ధితో పూర్తిస్థాయిలో అమలుజేసేందుకు రాష్ట్రాలకు తగు సూచనలు ఇవ్వాలని అధికారులను ప్రధాని మోదీ ఆదేశించారు. భూసార పరీక్ష కార్డుల జారీపై నిరంతరం సమీక్షించాలని చెప్పారు. పంట పొలాల్లో సేకరించిన మట్టి నమూనా పరీక్షా ఫలితాలను స్థానిక భాషల్లో తెలియజేసినప్పుడే న్యాయం జరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో నూతన పరికరాలను తయారుచేయడానికి స్టార్టప్ కంపెనీలను, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖతోపాటు పీఎంవో, నీతి అయోగ్ అధికారులు పాల్గొన్నారు. మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేపట్టిన అభివృద్ధి, సాంఘిక సంక్షేమ పథకాలపై ప్రధాని మోదీ సమీక్షించారు. సోమవారం బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అధ్యక్షతన జరిగిన బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 13 మంది సీఎంలు, ఆరుగురు డిప్యూటీ సీఎంలు సమావేశానికి హాజరయ్యారు. సీనియర్ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, సుష్మా స్వరాజ్ ప్రభృతులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన సీఎంలు, డిప్యూటీ సీఎంలు తమ రాష్ట్రాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని వివరించారు.